

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 సంచిక: 24

SUNDAY Special | ఆదివారం 8-10-2023



కీళ్లనొప్పుల నివారణ మనచేతుల్లోనే!

ఈ నెల 12న 'ప్రపంచ ఆర్థరైటిస్ డే'గా జరుపుకోనున్న నేపథ్యంలో కీళ్ల నొప్పుల నివారణ, చికిత్సా పద్ధతులపై ప్రత్యేక కథనం.

- ఫ్యామిలీలో



వైరల్..

సామాజిక మాధ్యమాలైన ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో ట్రెండింగ్‌గా నిలుస్తున్న ఫొటోలు, వీడియోలపై ప్రత్యేక కథనం.

- ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



క్రికెట్‌లో గోల్డ్ | పసిడి పట్టు | పసిడి జ్యోతి | స్వర్ణాలతో రిత్విక్, చిరాగ్

వందే భారత్

ఆసియా క్రీడల్లో 107 పతకాలు సొంతం

తొలిసారి 'సెంచరీ' మైలురాయి దాటిన భారత క్రీడా బృందం

- చైనా గడ్డపై భారత క్రీడా బృందం అదరగొట్టింది. 'వంద' పతకాల లక్ష్యంతో బరిలోకి దిగి తమ అద్భుత ఆటతో దానిని నిజం చేసి చూపించింది. తమ పోటీల చివరిరోజు భారత క్రీడాకారులు 12 పతకాలు గెలిచారు. ఇందులో ఆరు స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి. ఓవరాల్‌గా భారత్ ఈ క్రీడల్లో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలతో కలిపి మొత్తం 107 పతకాలతో తొలిసారి 'సెంచరీ' మైలురాయిని దాటి 4వ స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలోనే భారత్ కిది అత్యుత్తమ ప్రదర్శన. శనివారం ఆర్చ రీలో ఏపీ అమ్మాయి జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని అందించింది. బ్యాడ్మింటన్ పురు షుల డబుల్స్‌లో ఏపీ ప్లేయర్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం తొలిసారి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. - 11లో

సఫారీ... రికార్డుల సవారీ

428 పరుగులతో చెరేగిన దక్షిణాఫ్రికా

102 పరుగులతో శ్రీలంకపై విజయం

- వివరాలు 11లో

ఇజ్రాయెల్‌పై దాడులు

20 నిమిషాల్లో 5 వేల రాకెట్లు ప్రయోగించిన హమాస్

100 మందికిపైగా మృతి, భారీగా క్షతగాత్రులు

దేశంలోకి భారీగా చొరబడ్డ మిలిటెంట్లు.. సరిహద్దు కంచెలను పేల్చేసి వాహనాల్లో, పారా గ్లైడర్ల ద్వారా కూడా దాడులు.. వీధుల్లో స్వైరవిహారం, విచ్చలవిడి కాల్పులు



గాజా స్ట్రిప్ నుంచి జరిగిన రాకెట్ దాడితో ఇజ్రాయెల్‌లోని ఆష్కెలాన్‌లో తగలబడుతున్న వాహనాలు. దాడి ప్రాంతం నుంచి తల్లీబిడ్డను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సైనికుడు

- ముట్టడిలో ఉన్నాం: ప్రధాని నెతన్యాహూ.. రెట్టింపు ప్రతీకారం తప్పదని హెచ్చరిక
- భారత్ సహా ప్రపంచ దేశాల ఖండన
- ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా నిలుస్తామన్న ప్రధాని మోదీ
- ఇజ్రాయెల్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని కేంద్రం సూచన
- గాజాపై భారీ ఎత్తున ఇజ్రాయెల్ ప్రతిదాడులు
- ఇప్పటికే 200 మందికిపైగా మృతి.. 2,000 మందికి గాయాలు: పాలస్తీనా

6లో



అఫ్గాన్‌లో భూకంపం..

15 మంది మృతి మరో 40 మందికి గాయాలు

భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదు

6లో

అంగన్వాడీలకు ఫోర్టిఫైడ్ బియ్యం

- సంతులిత పోషకాల సమాహారంగా ఫోర్టిఫైడ్ రైస్
- గర్భిణులకు, బాలింతలకు ప్రయోజనం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు



ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. వీటి వాడకం... ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకువెళ్తోంది. వారిలో ఉన్న అపోహలను తొలగిస్తోంది.

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపాలన్న లక్ష్యంతో నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. నాణ్యతలో తేడా లేకుండా చర్యలు చేపట్టింది. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించింది. ఫోర్టిఫైడ్ బియ్యంతో సమస్యకు చెక్ పెడుతోంది. ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్వాడీ సిబ్బంది తమ వంతు కృషి చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్ అంటే..

ఫోర్టిఫైడ్ రైస్‌ను వాడుక భాషలో బలవర్ధక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి దీనికి అనేక అంశాల్లో సారూపత్య ఉంది. బలవర్ధక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను ప్రత్యేక గింజలు తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జత చేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్స్ అంటారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఎస్ఐ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి వంద కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్యస్థితి అవసరాన్ని బట్టి (సరఫరా అయ్యేది బాలింతలకా, గర్భిణులకా లేదా సాధారణ వ్యక్తులకా అనే అంశం పరిగణనలోకి తీసుకుంటారు.) ఒక కిలో లేదా రెండు కిలోల కెర్నల్స్‌ను కలుపుతారు.

వంట విధానం..

బలవర్ధక బియ్యంలో జత చేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంబించాలని కాకినాడ సీడీపీఓ వెల్లడించారు. ఫోర్టిఫైడ్ రైస్ కడిగేటప్పుడు అతిగా రుద్దకూడదు. వండే ముందు కొంతసేపు నీటిలో ఉంచి ఆ నీటిని ఒంపేయాలి. మరో మారు నీరు వేసి కడగాలి. తద్వారా పోషకాలు కోల్పోవు. అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క, జీలకర్ర, యాలికలు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. ఫోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలు మరింత ద్విగుణీకృతం చేసేందుకు సగం నీరు, సగం పాలు కలిపిన ద్రవంలో ఉడికిస్తే మేలు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరి రూపంలో కోల్పోవాల్సి ఉంటుంది. అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు, గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.

ప్లాస్టిక్ బియ్యం కాదు..

ఫోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యతను గుర్తించక పలువురు గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ రైస్ అంటూ తప్పుడు ప్రచారాలను నమ్ముతున్నారు. సాధారణంగా సంతులిత పోషకాలతో నిండిన కృత్రిమ బియ్యానికి ప్రత్యేక గుణముంది. తయారీ ప్రక్రియలో పోషకాల చేరికలోని హెచ్చుతగ్గుల కారణంగా వాటిలో కొన్ని నీటిలో తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. అలా తేలిన బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమపడుతున్నారు. ఇవి ప్లాస్టిక్ బియ్యం కాదంటూ భద్రంగా వినియోగించుకోవచ్చంటూ నిపుణులు చెబుతున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం శక్తివంతం

బాలింతలు, గర్భిణులకు అందించే ఫోర్టిఫైడ్ బియ్యం చాలా శక్తివంతమైనవి. అంగన్వాడీలతో పాటు బాలింతలు, గర్భిణులకు కూడా అందిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆహారం చాలా రుచికరంగా ఉంటోంది. మహిళల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ చిక్కీలు మొదలుకొని నూనె, రాగిజావ, కోడిగుడ్లు, బియ్యం అందిస్తున్నాం.

– విజయగౌరి, ఐసీడీఎస్ పీడీ, పార్వతీపురం మన్యం

విశాఖ అభివృద్ధి

మరింత వేగవంతం



- నీతి ఆయోగ్ గ్రోత్ హబ్‌లో చోటు
- దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక నగరం
- దేశంలో ఎంపికైన మరో మూడు నగరాలు
- ఈ నేపథ్యంలోనే ఆర్థిక వృద్ధికి రోడ్ మ్యాప్
- ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభివృద్ధికి ఉన్న అవకాశాలపై నీతి ఆయోగ్ ప్రత్యేక అధ్యయనం
- అందుకనుగుణంగా ప్రత్యేక రాయితీలు ఇచ్చే అవకాశం

- వివరాలు 5లో

కొత్తరూపుతో ఎయిరిండియా విమానాలు

- మొత్తం విమానాలన్నీ కొత్త లోగో, కొత్త రూపుతో కనిపిస్తాయి
- 'ఎక్స్'లో ఎయిరిండియా వెల్లడి

- వివరాలు 6లో

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 8-10-2023

వైరల్




గ్లామర్ పాత్రలతో మెరిసిన నయన తార 'గ్లామర్'కు మాత్రమే పరిమితం కాలేదు. 'శ్రీరామరాజ్యం' 'అనామిక' 'గాడ్‌ఫాదర్'లాంటి సిని మాలతో నటిగా మెప్పించింది. ఫిమేల్ – సెంట్రిక్ ఫిల్మ్ అనగానే తన పేరు గుర్తుకు వచ్చేలా చేసుకుంది. 'లేడీ అమితాబ్'గా పేరు తెచ్చుకుంది.

మరియం కురియన్ మరియు నయనతార

సినిమా ఫీల్డ్‌కి రాక ముందు నయనతార మోడలింగ్, టీవీ షోలు చేసేది. ఒక టీవీలో ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ షో 'చమయం' చేసేది. నయనతార అసలు పేరు డయాన మరియం కురియన్. ఆంగ్ల సాహి త్యంలో డిగ్రీ చేసిన డయాన(నయన) కాలేజీ రోజుల్లోనే పార్ట్–టైమ్‌గా మోడలింగ్, టీవి యాంకరింగ్ చేసేది. ఆమె మోడలింగ్ స్కిల్స్ చూసిన మలయాళం డైరెక్టర్ సత్యన్ 'మనసిన క్కరే' సినిమాతో వెండితెరకు పరిచయం చేశాడు. ఆ సినిమాలో 'గౌరి' పాత్రలో నటిం చిన నయనతార నిన్నా మొన్నటి బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'జవాన్'లోని 'నర్మదా రాయ్' పాత్ర వరకు నటనలో ఫస్ట్ క్లాస్ మార్కులు తెచ్చుకుంటూనే ఉంది.

దయా హృదయం



నగర అరణ్యంలో తప్పిపోయి అయోమయంగా తిరు గుతోంది ఒక ఆవు దూడ. దాడి చేయడానికి కుక్కలు కాచుకొని కూర్చున్నాయి. ఈ దృశ్యాన్ని కారులో నుంచి చూసిన ఒక మహిళ కారు దిగింది. ఆ దూడను కారులో తన ఇంటికి తీసుకువెళ్లింది.

దూడకు స్నానం చేయించి మేత పెట్టించింది.

'ఈ దూడ మాదే' అని ఎవరూ ఇంకా రాలేదుగానీ నెటి జనులు మాత్రం ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు.

'రోడ్డు మీద మనిషి చావుబతుకుల మధ్య ఉంటే కూడా ఆఫీసుకు టైమ్ అవుతుంది అంటూ పరుగులు తీసే జనాలు ఉన్న ఈ రోజుల్లో మీరు చేసిన మంచి పని మమ్మల్ని కదిలిం చింది' అంటూ నెటిజనులు ఆమెను ఆకాశానికెత్తుతున్నారు.

1950లో విరాట్ కోహ్లి యంఎస్ ధోనీ



ఇప్పటి క్రికెటర్‌లు 1950 నాటి లుక్‌తో ఎలా ఉంటారు?

ఎలా ఉంటారంటే...అని ఊహించనవ సరం లేకుండానే 'ఏఐ' టెక్నాలజీ చేసి చూపిం చింది.

ఈ వీడియో మొదట విరాట్ కోహ్లి బ్లాక్ అండ్ వైట్ ఫొటోతో ఓపెన్ అవుతుంది. ఆ తరు వాత రోహిత్ శర్మ స్పోర్టింగ్ కోట్‌తో, యంఎస్ ధోనీ బ్యాటు పట్టుకొని కనిపిస్తారు. హార్దిక్ పాండే కెమెరా ముందు చిరునవ్వులు చిందిస్తాడు. ఈ ఫొటోలు అలనాటి ఫొటోలే అని భ్రమింపజేసేలా బ్యాక్‌గ్రౌండ్‌లో రాజ్‌కపూర్ పాపు లర్ పాట 'ప్యార్ హువా' వినిపిస్తుంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 19 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

అయ్‌బాబోయ్... ఇదేం డాన్సండీ!



ఖాళీ గ్యాస్ సిలిండర్ అయినా సరే, నెత్తి మీద పెట్టుకోవడం కష్టం. అలాంటిది డ్యాన్స్ చేయా లాంటే 'అయ్ బాబోయ్' అంటాం. దుర్గ అనే ఈ మహిళ మాత్రం 'అయామ్ ఓకే' అంటూ నెత్తి మీద గ్యాస్‌బండ పెట్టుకొని చిన్న స్టీలు బిందె ఎక్కి డ్యాన్స్ చేసింది. ఈ వీడియో 23 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా 'ఇలాంటి డేంజరస్ స్టంట్లు చేయవద్దు' అంటూ నెటిజనులు ఆమెను హెచ్చరించారు. కొందరు మాత్రం ఆమె 'బ్యాలె న్సింగ్ స్కిల్స్'కు భేష్ అన్నారు. 'ఈ డేంజరస్ డ్యాన్స్‌ను పొరపాటున కూడా అనుకరించవద్దు' అంటూ కొందరు హెచ్చ రిక కామెంట్‌లు పెట్టారు.

కూలి పనులు చేసిన ఈ చేతులు కాంస్య పతకం అందుకున్నాయి

మనం కనే కలలకు మన ఆర్థికస్థాయి, హోదాతో పనిలేదు. సంకల్పబలం గట్టిగా ఉంటే మనల్ని విజేతలను చేస్తాయి. అందరిచేతా 'శబ్బాష్' అనిపించేలా చేస్తాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాంబాబు కూలి పనులు చేసేవాడు. ఆటల్లో తన కంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలని కలలు కనేవాడు. నిజానికి అతడి కలలకు, అతడు చేసే కూలిపనులకు పొంతన కుద రదు. అయితే లక్ష్యం గట్టిగా ఉంటే విజయం మనవైపే చూస్తుంది. కూలిప నులు చేస్తూనే కష్టపడి తన కలను నిజం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్‌లో 35 కిలోమీటర్‌ల రేస్‌వాక్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకొని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచాడు.



'మాది పేదకుటుంబం. చాలా కష్టాలు పడ్డాను. మా అమ్మ నన్ను మంచి స్థాయిలో చూడాలనుకునేది. కాంస్య పతకం గెలుచుకోవడంతో మా తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు' అంటున్నాడు రాంబాబు.

రాంబాబు కూలిపనులు చేస్తున్న ఒకప్పటి వీడియోను ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్వీన్ కాశ్వాన్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

'అదృష్టం కష్టపడే వారి వైపే మొగ్గు చూపుతుంది అంటారు. అయితే రాంబాబుది అదృష్టం కాదు. కష్టానికి తగిన ఫలితం. లక్ష్య సాధనకు సంబంధించి సాకులు వెదుక్కునేవారికి ఈ వీడియో కనువిప్పు కలిగిస్తుంది' అంటూ నెటిజనులు స్పందించారు.

తోడొకరుండిన అదే భాగ్యము

ఏడడుగులతో పడే బంధం
ఏడు జన్మలు కొనసాగాలనుకునే బంధం
వైవాహిక బంధం.
భార్యకు భర్త.. భర్తకు భార్య..
సంసారాన్ని ఈదాక
ఏడు పదుల వయసు దాటాక
ఒకరికి ఒకరై మరీ మెలగాలి.
తమిళనాడులోని ఒక వృద్ధ జంట
మధ్యాహ్న భోజనం తయారు చేసుకునే వీడియో
పది లక్షల వ్యూస్ పొందింది.

రోజులు కొందరికి కలిసి వస్తాయి. పెళ్లయిన నాటి నుంచే భార్య మనసు భర్తకు అర్థ మయ్యి, భర్త స్వభావాలు భార్య అకళింపు చేసుకుని కాపురాన్ని కాపాడు కుంటూ వస్తారు. పిల్లల్ని కని, పెద్ద చేసి ఒక దారికి చేరుస్తారు. ఆ తర్వాత? తామిద్దరూ జీవించాలి. ఏం భయం? ఇప్పటికే ఎంతో జీవితం గడిపారు. కష్టసు ఖాలు పంచుకున్నారు. అను బంధాన్ని దృఢం చేసుకు న్నారు. పిల్లలు దూరంగా ఉన్నా హాయిగా జీవిస్తారు. అతను కూరగాయలు తెస్తాడు. ఆమె వంట చేస్తుంది. ఇద్దరూ కలిసి హాస్పిటల్‌కు వెళ్లి వస్తారు. గుళ్లకు తిరుగుతారు. ఓపి కుంటే పర్యట నలు చేస్తారు. నేను న్నానని.. నీకై నిలిచే.. తోడొకరుండిన అదే భాగ్యము.. అదే స్వర్గము అని రాశాడు శ్రీశ్రీ. తమిళనా డులో ఒక జంట అలాంటిదే. మధ్య తరగతికి చెందిన ఈ జంట ముదిమి వయసులో కలిసి మధ్యాహ్న వంట చేసుకుంటున్న వీడియోను అభిషేక్ చందరమర్కణ్ అనే ఇన్‌స్టా యూజర్ పోస్ట్ చేశాడు. తన భార్యతో కలిసి వీడియోలు చేసే అభిషేక్ ఈ వీడియో పోస్ట్ చేస్తూ 'భవిష్య త్తులో నువ్వూ నేనూ' అనే క్యాప్షన్ పెట్టాడు. నిజమే.. ఈ వీడియో చూసిన యువ జంటలు ఆ వయసులో తాము అలా ఉంటే ఎంత బాగుం టుంది అని వ్యాఖ్యానించారు. జీవితం పండాలి... అని పెద్దలు అంటారు. పండు వయసులో భార్యకు భర్త; భర్తకు భార్య తోడుండ టమే పండు జీవితం.



నా సామి రంగ

'పుష్ప' సినిమాలోని సూపర్‌హిట్ సాంగ్ 'సామీ నా సామీ' పాటకు ఓ చిన్న అమ్మాయి చేసిన డ్యాన్స్ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైర ల్‌గా మారింది. అచ్చంగా రష్మిక మందన స్టెప్పులను అనుసరిస్తూ చేసిన డ్యాన్స్ నెటిజనుల చేత 'అహో' అనిపిస్తుంది. పాటకు ఈ చిన్నారి లిప్–సింక్ కూడా అద్భుతంగా కుదిరింది. 'వండర్‌ఫుల్ క్యూట్ వీడియో' అంటూ నెటిజనులు ప్రశంసలు కురిపించారు. ఈ వీడియో చార్మ్ రష్మిక వరకు వెళ్లింది. 'సో క్యూట్' అనే క్యాప్షన్‌తో తన సోషల్ మీడియా ఎకౌంట్స్‌లో షేర్ చేసింది.



సినిమా

సెలబ్రేషన్స్ షురూ


● చిరంజీవి, సురేఖ, లావణ్యా త్రిపాఠి, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠిల వివాహ వేడుకలకు సంబంధించిన హంగామా మొదలైంది. ఈ ఏడాది జూన్‌లో వరుణ్, లావణ్యల నిశ్చితార్థం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. వీరి ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ హైదరాబాద్‌లోని చిరంజీవి స్వగృహంలో జరిగాయి. ఈ సెలబ్రేషన్స్‌కి సంబంధిం చిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల వేదికగా చిరంజీవి, వరుణ్ షేర్ చేశారు. వరుణ్, లావణ్యల డెస్టినేషన్ వెడ్డింగ్ ఇటలీలో నవంబరు మొదటివారంలో జరుగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక వరుణ్, లావణ్య 'మిస్టర్ (2007)', 'అంతరిక్షం 9000 కేఎమ్‌పీహెచ్ (2018)' చిత్రాల్లో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. సిల్వర్ స్క్రీన్‌పై ప్రేమికులుగా జతకట్టిన ఇద్దరూ వ్యక్తిగతంగా కూడా ప్రేమలో పడి, పెద్దల అనుమతితో పెళ్లి చేసుకుంటున్నారు.

కథ విన్నప్పుడే కన్నీళ్లొచ్చాయి - గాయత్రీ భరద్వాజ్



రవితేజ టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. వంశీ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఈ నెల 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో గాయత్రీ భరద్వాజ్ మాట్లాడుతూ– ''నా స్వస్థలం ఢిల్లీ. పుణేలో చదువుకున్నాను. మా నాన్నగారు పైలెట్. అమ్మ సైకాలజిస్ట్. నాకు చిన్నప్పట్నుంచే ఫ్యాషన్ వరల్డ్‌లో ఫేమస్ కావాలని ఉండేది. నా ఏడో తరగతిలోనే ఫ్యాషన్ ర్యాంప్ వాక్ చేసి, విజేతగా నిలిచాను. ఆ తర్వాత భరత నాట్యం, క్లాసికల్ సింగింగ్ నేర్చుకున్నాను. హిందీలో అవకాశాలు రావడంతో ఓ సినిమా, మూడు వెబ్ సిరీస్‌లు చేశాను. 'టైగర్ నాగేశ్వరరావు' నా తొలి తెలుగు సినిమా. నన్ను ఎంపిక చేయడానికి ముందు దాదాపు 60 మందిని ఆడిషన్ చేశారట. ఈ చిత్రంలో విలేజ్‌లో టామ్ బాయ్‌లా కనిపించే మణి పాత్ర చేశాను. దర్శకులు వంశీగారు ఈ పాత్ర గురించి దాదాపు మూడు గంటలు వివరించారు. పాత్రలో మంచి ఎమోషన్ ఉంది. కథ వింటున్నప్పుడే కన్నీళ్లొచ్చాయి. ఈ సినిమా విషయంలో నాకు భాషాపరంగా ఏ ఇబ్బంది లేదు. నాకు తెలుగు టీచర్ ఉన్నారు. ఇక రవితేజగారు సెట్స్‌లో చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. ప్రస్తుతం ఓ తెలుగు సినిమా చేస్తున్నాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నార్త్ ఇండస్ట్రీలో కాస్త హరీబరీగా ఉంటుంది. కానీ తెలుగు పరిశ్రమలో చాలా ఓర్పుతో వర్క్ చేస్తున్నారు. లభిస్తున్న గౌరవం కూడా ఎక్కువే. తెలుగు ప్రేక్షకులు కూడా సినిమాను ఎంతో ప్రేమిస్తారు'' అని చెప్పుకొచ్చారు.

ట్రైలర్ ఆసక్తిగా ఉంది - బాబీ

శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా నటించిన చిత్రం 'మధుర పూడి గ్రామం అనే నేను'. మల్లి దర్శకత్వంలో ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఒకే ఊరిలో జరిగే కథ ఇది. శివ బాగా యాక్ట్ చేశారు. మణిశర్మగారు ఈ సినిమాకు సంగీతం అందించడం విశేషం. యూనిట్‌కు ఆల్ ది బెస్ట్'' అన్నారు.


● బాబీ, శివ కంఠమనేని

క్రైమ్.. కామెడీ

సూర్య తేజ ఏలే హీరోగా నటించిన తొలి చిత్రం 'భరతనాట్యం'. మీనాక్షి హీరోయిన్. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో పాయల్ సరాఫ్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సూర్య తేజ ఏలే మాట్లాడుతూ– ''నన్ను నమ్మి ఇంత మంచి సినిమా చేసిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు. హర్షవర్ధన్, హర్షగార్లు.. ఇలా సినిమాలోని అందరి పాత్రలు అదిరిపోతాయి. వివేక్ సాగర్‌గారి మ్యూజిక్, రవితేజ గిరిజాల ఎడిటింగ్.. ఇలా టెక్నికల్‌గా కూడా స్ట్రాంగ్'' అన్నారు. ''క్రైమ్ కామెడీ జానర్‌లో తెలుగు ప్రేక్షకులు ఇప్పటివరకూ చూడని సరికొత్త ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు కేవీఆర్ మహేంద్ర. ''ఈ సినిమా మావారి కల. సినిమా బాగా వచ్చింది'' అన్నారు పాయల్ సరాఫ్. ''మా అబ్బాయికి ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు, టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు ధని ఏలే.


● మీనాక్షి, సూర్య తేజ

లవ్.. ఎమోషన్..

సంతోష్ కల్వచెర్ల, క్రిషికా పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వంలో జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్న సినిమా 'ఆర్టిస్ట్'. తనికెళ్ల భరణి, 'సత్యం' రాజేశ్, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 'ఆర్టిస్ట్' త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ వేడుకలో సంతోష్ మాట్లాడుతూ– ''చిన్న ప్రాజెక్ట్‌గా మొదలైన మా సినిమాలో పేరున్న నటీనటులు నటించడం షాకింగ్‌గా ఉండేది. ఈ గ్లింప్స్‌లానే, సినిమా అందరికీ నచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు. ''గ్లింప్స్ చూసి అందరూ ఈ సినిమా థ్రిల్లర్ అనుకుంటారు కానీ లవ్, ఎమోషన్, కామెడీ వంటివి ఉన్నాయి. నిర్మాత నా కోసమే ఈ ప్రాజెక్ట్ చేశారనిపిస్తోంది'' అన్నారు రతన్ రిషి. ''ఆర్టిస్ట్'తో ఓ మంచి హీరోను ఇండస్ట్రీకి ఇవ్వనున్నాం'' అన్నారు జేమ్స్ వాట్ కొమ్ము.


● సంతోష్, క్రిషికా

హెల్త్

ఆర్థరైటిస్ డే


WORLD ARTHRITIS DAY
అక్టోబర్ 12న

కీళ్లనొప్పుల నివారణ మనచేతుల్లోనే!

ఆర్థరైటిస్ అంటే కీళ్లనొప్పులు లేదా కీళ్ల వాతంగా చెప్పవచ్చు. ఇందులో చాలా రకాలు ఉంటాయి. ఈ నెల 12వ తేదీ 'ప్రపంచ ఆర్థరైటిస్ డే'. "దీన్ని ఎదుర్కోవడం మీ చేతుల్లోనే, అందుకే దీనిపై చర్యకు ఉప క్రమించండి" (ఇట్స్ ఇన్ యువర్ హ్యాండ్స్, టేక్ యాక్షన్) అన్నది ఈ ఏడాది థీమ్. ఈ నేపథ్యంలో దీని నివారణకూ, మేనేజ్ మెంట్‌కూ బాధితుల చేతుల్లో ఏ మేరకు అవకాశం ఉందనే అనేక విష యాలపై అవగాహన కోసం ఈ కథనం.



వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లు అరిగిపోతుంటాయనీ, దాంతో కీళ్లు ఒరుసుకుపోయి నొప్పి వస్తుంటుందనీ, ఇది వయసు పెరగడం వల్ల వచ్చే సమస్య కాబట్టి సర్దుకుపోక తప్ప దనే అభిప్రాయం చాలామందిలో ఉంది. ఇది కొంతవరకే వాస్తవం. నిజా నికి కీళ్లనొప్పులు / కీళ్లవాతం అనేక కారణా లతో వస్తుంటాయి. వీటిల్లో వందకు పైగా రకాలు న్నాయి. అన్నింటినీ కలుపుకుని ఆర్థరైటిస్ లేదా కీళ్లవాతం అనే ఒక పదంతో సూచిస్తుంటారు. పైగా వయసు పెరిగిన వారిలోనే వస్తుంటాయ న్నది కూడా పూర్తిగా నిజం కాదు. చాలామంది మధ్యవయస్కుల్లోనూ, కొంతమంది యువకు ల్లోనూ కనిపిస్తుంటాయి.

కారణాలు

కొన్ని వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ల కార ణంగా, హార్మోన్ల అసమతౌల్యతలూ, విటమిన్‌ల లోపాలు, వాతావరణ కాలుష్యాలూ... ఇలా అనేక కారణాలతో వస్తుంటాయి. అరుగుదలతో వచ్చే వాటిని మినహాయిస్తే... సొంత కణాలపైనే తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ ప్రతికూలంగా పని చేసి, కణాలను దెబ్బతీయడం వల్ల వచ్చే కీళ్ల వాతాలూ ఉన్నాయి. ఇలా వచ్చేవాటిని ఆటో ఇమ్యూన్ సమస్యలుగా పేర్కొంటారు. శరీరంలోకి ప్రవేశించే శత్రుకణాలను దెబ్బతీయడానికి పుట్టే యాంటీబాడీస్... తమ సొంత కణాలే పరాయి విగా భావించి దెబ్బతీయడంతో కొందరిలో ఎము కలు, కీళ్లు, కండరాలతో పాటు... కొన్ని సంద ర్భాల్లో కీలకమైన అవయవాలు, వ్యవస్థలూ దెబ్బ తినవచ్చు.

ఆర్థరైటిస్‌లలో ప్రధాన ఆటోఇమ్యూన్ వ్యాధులు...

ఆటోఇమ్యూన్ సమస్యలతో మహిళల్లో కని పించే వ్యాధుల్లో లూపస్ (ఎస్ఎల్ఈ), రుమటా యిడ్ ఆర్థరైటిస్, సోరియాటిక్ ఆర్థరైటిస్, సిస్టమిక్ స్క్లిరోసిస్, ఏపియస్ వంటివి ముఖ్యమైనవి.

● ఎస్ఎల్ఈ మహిళల్లో ఎక్కువగా కనిపించే ఓ ముఖ్యమైన వ్యాధి. ఇది కిడ్నీలు, కీళ్లు, చర్మం, మెదడు, కండరాల వంటి అనేక అవయవాలను దెబ్బతీస్తుంది. అది చూపే ప్రభావాన్ని బట్టి కొంద రిలో తేలికపాటి నుంచి తీవ్రమైన సమస్యగానూ ఉండవచ్చు. కొందరిలో ప్రాణాపాయానికి దారితీ యవచ్చు. ● రుమటాయిడ్ ఆర్థ రైటిస్ (ఆర్ఏ) కీళ్ల మీద ప్రభావం చూపే వ్యాధి. సరైన చికిత్స తీసుకోక పోతే కీళ్లు వంకర్లుపోయి, శాశ్వత వైక ల్యానికీ దారితీయవచ్చు. ఇది కీళ్లను మాత్రమే కాకుండా లంగ్స్, రక్త నాళాలు, కళ్లు, నాడీవ్యవస్థతో సహా శరీరంలోని ఇతర అవయవాలను లక్ష్యంగా చేసు కుని, ఇతర వ్యవస్థలనూ ధ్వంసం చేసే అవకాశమూ ఉంది. ఈ సమస్యతో బాధప డేవారిలో కొలె స్ట్రాల్ పెరుగుద లకు ఆస్కారం ఎక్కువ. అలాగే నాడీ వ్యవస్థ దెబ్బ తినవచ్చు. ఈ కారణాలతో మరణాలకూ అవకాశం ఉంది. ● స్క్లిరోడెర్మా అనే కీళ్లవాతంలో చర్మం గట్టిపడటంతో పాటు జీర్ణవ్యవస్థ, గుండె, లంగ్స్, కిడ్నీల వంటి అవయవాలు ప్రభావితం కావచ్చు. ● యాంటీ ఫాస్ఫోలిపిడ్ యాంటీబాడీ సిండ్రోమ్ అనే కీళ్లవ్యాధిలో రక్తం తరచూ గడ్డకడుతుంది. మహిళల్లో గర్భస్రావాలూ జరుగుతుంటాయి. **ఇవిగాక ఇతర వ్యాధులు చాలానే ఉంటాయి.**

లక్షణాలు : కీళ్లవాతాలకు దాని రకాన్ని బట్టి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. ఈ లక్షణాలు అందరిలోనూ ఒకేలా బయటపడకపోవచ్చు. వ్యాధి రకాన్ని బట్టి, తీవ్రతను బట్టి, బాధి తుల వయసు, వారి ఇతర వ్యాధులను బట్టి లక్షణాల తీరు మారుతూ ఉంటుంది.

అయితే దాదాపు అన్ని రకాల కీళ్ల వ్యాధుల్లో కనిపించే సాధారణ లక్షణాలను క్రోడీకరిస్తే... సాయంత్రానికి జ్వరం రావడం, నీరసం, నిస్సత్తువ, అలసట, క్రమంగా బరువు తగ్గడం, ఆకలి మందగిం చడం లాంటి లక్షణాలు తొలిదశలో కనిపిస్తాయి. ఇవే లక్షణాలు ఇతర వ్యాధుల్లోనూ కనిపిస్తుండటం వల్ల వీటిని ఆర్థరైటిస్‌గా గుర్తించడం కొంచెం కష్టమైన పని.

నిర్దిష్టంగా కీళ్ల విషయానికి వస్తే కీళ్లలో విపరీతమైన నొప్పి, వాపు, అక్కడ ఎర్రగా కందిపోయినట్లుగా అవు తుంది. ఈ లక్షణాలు కనిపించేనాటికి బాధితులు తమ సొంత పనుల్ని కూడా చేసుకోలేని స్థితి వస్తుంది.

ఇతర జాగ్రత్తలు...

వీటిలో చాలావాటికి నివారణ ఉండదు. ఎందుకంటే ఇవి జన్యుపరమైనవీ, జన్యులోపా లతో వచ్చేవి. ఈ కారణంతో ఈ పరిమితి ఉంటుంది. ఈ జన్యులోపాలకు పర్యావరణ కార ణాలూ, జీవనశైలీ తోడైనప్పుడు ఇవి బయటపడ తాయి. అందుకే ఈ ఏడాది థీమ్‌ను బట్టి మన చేతుల్లో ఉండే అంశాలేమిటో తెలుసుకుని, ఆ మేరకు చర్యలు తీసుకోవడం చాలావరకు మేలు చేయడంతో పాటు... కొంతమేర నివారణకూ తోడ్పడేందుకు అవకాశం ఉంది. ఆ జాగ్రత్తలివి...

● బరువును తగ్గించుకోవాలి. దీనివల్ల మందులు సమర్థంగా పనిచేయడమే కాకుండా గుండె మీద ఒత్తిడి తగ్గుతుంది. ● ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇదీ చికిత్సలో భాగమే. దీనివల్ల కీళ్లు వంకర్లు పోవు. ● పొగతాగడం, మద్యపానం అలవాటును పూర్తిగా మానేయాలి. ● క్యాల్షియమ్ సమృద్ధిగా ఉండే ఆహారాల్ని తీసు కోవాలి. ● విశ్రాంతి వల్ల కీళ్లవాతాన్ని నివారించ వచ్చునని కొందరు అపోహపడతారు. ఇది పూర్తిగా అవాస్తవం. కీళ్లవాతం వచ్చినవారిలో ఒంటి కదలికలు చురుగ్గా ఉండేలా నడక వంటి వ్యాయామాలు చేయాలి. దాంపత్య జీవితానికి దూరంగా ఉండాలన్నది మరో అపోహ. ఇదీ వాస్తవం కాదు. ఈ అపోహలకు దూరంగా ఉండటమూ బాధితుల చేతుల్లో ఉన్న పనే.

ఈ ఏడాది థీమ్‌ను అను సరిస్తూ... బాధితులు తగిన జాగ్రత్తల్ని పాటించడం, రుమ టాలజిస్టులను సంప్రదించి, వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, జీవనశైలిని మెరుగు పరచుకుంటే కీళ్లవ్యాధుల బాధల నుంచి దూరంగా ఉండవచ్చు.

చికిత్స: ఆర్థరైటిస్‌కి కారణమైన కీళ్లవాతాన్ని బట్టి చికిత్స ఉంటుంది. చాలావాటికి కొన్ని యాంటీ ఇన్‌ఫ్లమే టరీ మందులతోపాటు, చిన్న మోతాదుల్లో స్టెరాయిడ్స్ వాడాల్సిన అవసరం ఉంటుంది. జబ్బు తీవ్రత ఎక్కువగా ఉంటే తగు మోతాదులో స్టెరాయిడ్స్‌తో పాటు 'డిసీజ్ మాడిఫైయింగ్ డ్రగ్స్'ని మొదలుపెట్టాలి. జబ్బు తీవ్రతను అదుపు చేయడం కష్టమైన సందర్భాల్లో కొందరిలో 'బయలాజిక్స్' అనే మందుల్ని ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అన్ని రకాల కీళ్లవాతాలకూ ఒకేరకం బయలాజిక్స్ పనిచేయవు. వ్యాధి తీవ్రత, ప్రభావితమైన అవయవం, బాధితులు స్త్రీ లేదా పురుషుడా అన్న అంశంతో పాటు ఒకవేళ బాధి తులు మహిళలైతే వారు గర్భవతా లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మందుల్నీ, వాటి మోతా దుల్నీ రుమటాలజిస్టులు నిర్ణయించి, సూచిస్తుంటారు.


డా॥ విజయ ప్రసన్న పరిమి,
సీనియర్ రుమటాలజిస్ట్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

SUNDAY Special

ఆదివారం 8-10-2023

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 24

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



అసలు సమరానికి సై!

వన్డే క్రికెట్‌లో మరోసారి జగజ్జేతగా నిలిచే లక్ష్యంతో భారత జట్టు తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది. టీమిండియా నేడు మొదటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది.

- వివరాలు 11లో



62 మంది సురక్షితం

సిక్కింలో తీస్తా నదికి బుధవారం సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన వారిలో 62 మంది సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- వివరాలు 6లో



మిల్లెట్ల పిండిపై 5% పన్ను

తృణ ధాన్యాల ఆధారిత పిండిపై 5 శాతం పన్ను విధించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



నన్ను పోలీస్ లాకప్‌కు పంపొద్దు

తనను ఈడీ కార్యాలయం నుంచి పోలీస్ లాకప్‌కు తరలించకుండా అడ్డుకోవాలంటూ ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ కోర్టును కోరారు.

వివరాలు 6లో ▸



రాజస్తాన్‌లోనూ కులగణన

బిహార్ బాటలో రాజస్తాన్ పయనిస్తోంది. రాష్ట్రంలో కులగణన చేపట్టనున్నట్లు సీఎం అశోక్ గహ్లోత్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



కెనడాలో కూలిన విమానం

కెనడాలో శనివారం జరిగిన విమాన ప్రమాదంలో ఇద్దరు భారతీయ ట్రైనీ పైలట్లు సహా ముగ్గురు మృతి చెందారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'డిజి లాకర్'లో ఇంటర్ సర్టిఫికెట్లు



ఏపీలో ఇంటర్ పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సులభంగా పొందే వెసులుబాటును ఇంటర్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. పాస్ సర్టిఫికెట్, మైగ్రేషన్, ఈక్వలెన్సీ, జెన్యూన్‌నెస్ సర్టిఫికెట్లు ఎప్పుడు, ఎక్కడ కావాలన్నా తీసుకునేలా 'డిజి లాకర్'లో ఉంచింది.

వివరాలు 12లో ▸

గగన్‌యాన్‌లో కీలక ప్రయోగానికి ఇస్రో సిద్ధం



అంతరిక్షంలోకి మనుషుల్ని పంపించే ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీలక పరీక్షలకు సిద్ధమైంది. ఈ మిషన్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి మానవరహిత ఫ్లైట్ టెస్ట్‌ల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది.

వివరాలు 6లో ▸

రెవెన్యూ విధానాలతో ▸ భూ హక్కు

వివాదాలకు చెక్ పెడుతూ ముమ్మరంగా భూముల రీ సర్వే

- గ్రామాల్లో భూములకు డిజిటల్ రికార్డులు.. రైతులకు హక్కు పత్రాలు
- బ్రిటీష్ హయాం తర్వాత దేశంలోనే తొలిసారిగా విజయవంతంగా రీ సర్వే
- మరోవైపు రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలకు శ్రీకారం
- విప్లవాత్మక రీతిలో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు
- నిషేధిత జాబితా నుంచి సర్వీసు ఈనాం భూములకు విముక్తి
- చుక్కల భూములు, షరతులు గల పట్టాలు, అనాధీనం భూముల సమస్యకు పరిష్కారం
- మ్యుటేషన్లు పెండింగ్‌లో లేకుండా ప్రతి నెలా ఆడిటింగ్
- రెవెన్యూ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం



సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవిన్యూ సంస్కరణలు, కొత్త కార్యక్రమాలతో ఇటు ప్రజలు, అటు ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. ప్రధానంగా భూముల విలువ అనూహ్యంగా పెరిగిపోవడంతో పేద రైతుల తల రాత మారిపోతోంది. ఎందుకూ పనికి రావనుకున్న భూములకు సైతం మంచి ధరలు కళ్లెదుటే కనిపిస్తుండటంతో అసైన్డ్ రైతుల పంట పండింది. 'కొనుగోళ్లు - అమ్మకాలు - రిజిస్ట్రేషన్లు' చక్రం ద్వారా లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు ఇకపై మరింతగా ఊపందుకోనున్నాయి. తద్వారా రాష్ట్రంలో సంపద సృష్టి ఏమేరకు జరిగిందన్నది ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. వీటన్నింటికీ తోడు ఇన్నాళ్లూ అనుభవంలో ఉన్నప్పటికీ రికార్డు పరంగా హక్కు లేని భూమికి ఇప్పుడు 'ఇది నా భూమి' అని సంతృప్తిగా చెప్పుకునే పరిస్థితిని రైతులకు కలిగించింది.

- వివరాలు 2లో ▸

ధర్నాలు, నిరసనలకు బాలలను తీసుకెళ్తే ఉపేక్షించం

ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ హెచ్చరిక

- ఇటీవల భువనేశ్వరి సభలో పిల్లాడితో మాట్లాడించడంపై సీరియస్
- సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసేలా ప్రేరేపించడం సరికాదు
- ఇటువంటి చర్యలు పునరావృతమైతే సుమోటోగా కేసు నమోదు

2 లో



నవనీత్ కౌర్



రమ్యకృష్ణ



కవిత

ఆ మాటలనడానికి నోరెలా వచ్చింది

రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బండారుపై నటీమణుల ఆగ్రహం

- బండారూ.. నీకు సిగ్గులేదా అంటూ విరుచుకుపడిన సినీనటి, ఎంపీ నవనీత్ కౌర్
- ప్రధాని కఠిన చర్యలు తీసుకోవాలని నటి రమ్యకృష్ణ డిమాండ్
- టీడీపీ నేతలు రాజకీయాలను దిగజారుస్తున్నారంటూ కవిత ఆవేదన

3 లో

టపాసుల దుకాణంలో ఘోర అగ్నిప్రమాదం

12 మంది మృతి.. మరో పది మందికి తీవ్రగాయాలు

హోసూరు-బెంగళూరు జాతీయ రహదారిపై తమిళనాడు సరిహద్దులో ఉన్న అత్తిపల్లి వద్ద శనివారం సాయంత్రం ఓ బాణసంచా దుకాణంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రెండు లారీలతో సహా పలు వాహనాలు బూడిదయ్యాయి. 12 మంది కార్మికులు మరణించారు. లారీ నుంచి టపాసులను అన్‌లోడ్ చేసే సమయంలో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.



- వివరాలు 6లో ▸

క్లుప్తంగా...

ఆసియా క్రీడల్లో తెలుగు జెండా రెపరెపలు

విజేతలకు సీఎం జగన్ అభినందనలు

సాక్షి,అమరావతి: ఆసియా క్రీడల్లో భారత్ చరిత్ర సృష్టించిందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఈ క్రీడల్లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలను సీఎం అభినందించారు. సాత్విక్ సాయిరాజ్ యావత్ భారతదేశాన్ని, రాష్ట్రాన్ని, తనను గర్వించేలా చేశాడని పేర్కొన్నారు. తెలుగు జెండా నిజంగా రెపరెపలాడుతోందంటూ శనివారం సీఎం జగన్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.

9న సీఎం జగన్ విజయవాడ పర్యటన

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 9న విజయవాడలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం చేరుకుంటారు. వైఎస్సార్‌సీపీ పార్టీ ప్రతినిధుల సభలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు.

శాసన మండలిలో పలు కమిటీల ఏర్పాటు

ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా మురుగుడు హనుమంతరావు



సాక్షి, అమరావతి: ఏపీ శాసన మండలిలో పలు కమిటీలను చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన బులిటెన్ శనివారం విడుదలైంది. రూల్స్ కమిటీ చైర్మన్‌గా కొయ్యే మోషేన్‌రాజు, సభ్యులుగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సి.రామచంద్రయ్య, ఎం.అరుణ్ కుమార్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శ్రీకాంత్, ఐ.వెంకటేశ్వరరావును నియమించారు. తెలుగు భాష, సాంస్కృతిక కమిటీ చైర్మన్‌గా మోషేన్‌రాజు, సభ్యులుగా పి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.సూర్యనారాయణరావు, ఎం.మురళీధర్, ఎ.మధుసూదన్, చిరంజీవిరావు, ఐ.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. పిటీషన్స్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్, సభ్యులుగా ఎస్.రామారావు, సుబ్రహ్మణ్యం, ఎంవీ రామచంద్రారెడ్డి, బి.రామ్‌గోపాల్‌రెడ్డి, కల్పలతను నియమించారు. కౌన్సిల్ టేబుల్‌పై ఉంచే పేపర్స్ కమిటీ చైర్మన్‌గా పండుల రవీంద్రబాబు, సభ్యులుగా కేఆర్‌జే భరత్, వీవీ సూర్యనారాయణరాజు, డి.రామారావును నియమితులయ్యారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా మురుగుడు హనుమంతరావు, సభ్యులుగా కర్రి పద్మశ్రీ, ఎస్.మంగమ్మ, పి.అనూరాధ, పి.రఘువర్మను నియమించారు. హక్కుల కమిటీ చైర్మన్‌గా యల్లారెడ్డిగారి శివారెడ్డి, సభ్యులుగా టి.మాధవరావు, దువ్వాడ శ్రీనివాస్, బి.కళ్యాణ చక్రవర్తి, పి.అశోక్‌బాబు, కేఎస్ లక్ష్మణరావు నియమితులయ్యారు. హామీల కమిషన్ చైర్మన్‌గా మహ్మద్ ఇక్బాల్, సభ్యులుగా డి.చిన్నగోవిందరెడ్డి, వి.రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, బి.తిరుమల నాయుడును నియమించారు.


ఏపీలో బెటర్ కాటన్ ఇనీషియేటివ్ ప్రాజెక్ట్

చేనేత, జౌళి పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత



గుంటూరు రూరల్ : ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని నాణ్యమైన పత్తి ఉత్పత్తి కోసం బెటర్ కాటన్ ఇనీషియేటివ్ ప్రాజెక్ట్‌ను ఏపీలో ప్రారంభించనున్నట్లు చేనేత, జౌళి, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత చెప్పారు. శనివారం లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో బెటర్ కాటన్ ఇనీషియేటివ్ ప్రాజెక్ట్‌పై పత్తి రైతులు వ్యవసాయ కూలీల అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. పత్తి పంట సాగు, జిన్నింగ్ స్పిన్నింగ్ నుంచి వస్త్ర తయారీ వరకు అన్ని దశల్లోనూ సరైన జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగితేనే చేనేత, జౌళి రంగం మనుగడ ఆశాజనకంగా ఉంటుందన్నారు. ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని బెటర్ కాటన్ ఇనీషియేటివ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరించారు.

రూ.227 కోట్లతో అడవుల అభివృద్ధి



కాఫీ పంటను పరిశీలిస్తున్న బీకే సింగ్

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): అడవుల అభివృద్ధికి కాంపా ప్రాజెక్టు కింద రూ.227 కోట్లు మంజూరైనట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) బీకే సింగ్ తెలిపారు. విజిలెన్స్ అడిషనల్ పీసీసీఎఫ్ గోపీనాథ్, సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మతో కలిసి నర్సీపట్నంలోని ఏపీఎఫ్‌డీసీకి చెందిన కాఫీ గోడౌన్లలోని కాఫీ పంటను పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పండిన కాఫీని శుద్ధి చేయడం వల్ల ఏటా రూ.8 కోట్ల నుంచి రూ.9 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు.

రెవె'న్యూ' విధానాలతో భూ హక్కు



భూముల వివాదాలకు చెక్ పెడుతూ ముమ్మరంగా రీ సర్వే

గ్రామాల్లో భూములకు డిజిటల్ రికార్డులు.. రైతులకు హక్కు పత్రాలు

సాక్షి, అమరావతి : వివాదాలు, సమస్యలు, ఎడతెగని జాప్యంతో కునారిల్లిన రెవెన్యూ శాఖను వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో సమూలంగా మార్చేసింది. ఆ వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు మార్గం చూపింది. సర్టిఫికెట్లు పొందడాన్ని సులభతరం చేయడం దగ్గర నుంచి కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన నిషేధిత భూముల చిక్కు ముడులు విప్పడం, సాహసోపేతమైన రీతిలో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా లక్షలాది రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తొలిసారి భూముల రీ సర్వేను చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం అన్ని ప్రాంతాల అభిప్రాయాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాలు ఏర్పాటు చేసి రాష్ట్రానికి ఒక కొత్త స్వరూపాన్ని ఇచ్చింది. మొత్తంగా నాలుగేళ్లలో రెవెన్యూ శాఖలో చోటుచేసుకున్న మార్పులు ఇలా ఉన్నాయి.

మహా యజ్ఞంలా భూముల రీ సర్వే

- అస్తవ్యస్థంగా మారిన భూముల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సాహసోపేతంగా భూముల రీ సర్వే చేపట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం సత్ఫలితాలు సాధిస్తోంది. బ్రిటీష్ కాలం నాటి భూముల రికార్డుల స్థానంలో ఆధునిక డిజిటల్ భూ రికార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు జరగని విధంగా మొత్తం భూ విస్తీర్ణాన్ని కొలిచే బృహత్తర కార్యక్రమం ఇది. ఇందుకోసం ఏకంగా 14,630 మంది సర్వేయర్లను నియమించడం ఒక రికార్డు.
- రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా భూ యజమానులకు స్పష్టమైన హక్కు కల్పించడం, అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా భూముల హద్దులను గుర్తించి.. ఆ భూమికి రక్షణ కల్పించడమే ధ్యేయంగా రీ సర్వే అత్యంత ఆధునిక రీతిలో సాగుతోంది. అత్యంత సంక్లిష్టమైన ఈ సర్వే తొలి దశలో 2 వేల గ్రామాల్లో అన్ని దశల్లోనూ పూర్తి కాగా, మరో 2 వేల గ్రామాల్లో త్వరలో పూర్తవనుంది. ప్రతి మూడు నెలలకు 2 వేల గ్రామాల చొప్పున సర్వే పూర్తి కానుంది.
- సర్వే పూర్తయిన గ్రామాల్లో ఇప్పటి వరకు 4.80 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. 16.55 లక్షల మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. 8.70 లక్షల భూ కమతాలకు సంబంధించి ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లు తయారయ్యాయి. రైతులకు శ్రమ లేకుండా, వారి డబ్బు ఖర్చు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఎంతో క్లిష్టమైన ఈ పనుల్ని పూర్తి చేసింది.
- ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. తొలిసారి భూముల హద్దులను నిర్ధారించి, భూ రక్ష సర్వే రాళ్లను రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో పాతుతున్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లోని భూములను కూడా తొలిసారి సర్వే చేసి, ఇళ్ల యజమానులకు ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు

- అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడంతో లక్షలాది మంది దళిత, పేద రైతుల ఆర్థిక స్థితి ఒక్కసారిగా పెరిగిపోయింది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత అసైన్‌దారులు లేకపోతే వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు లభించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది.
- తమ భూములపై తమకు హక్కులు ఇవ్వాలని అసైన్డ్ రైతులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత హక్కుదారులు వారికి అవసరమైనప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించింది. దీనివల్ల తమ భూములపై హక్కులు లేని 15,21,160 మంది పేద దళిత, ఇతర పేద వర్గాల రైతులకు సంబంధించిన 27,41,698 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. 'ఇక ఇది నా భూమి' అని ఆ రైతులు గర్వంగా చెప్పుకునే పరిస్థితి కల్పించింది.
- ఇన్ని లక్షల ఎకరాల లావాదేవీలు మార్కెట్‌లోకి రావడంతో ఆర్థిక వృద్ధి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. విలువ లేని పేద రైతుల భూమికి విలువ పెంచడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే నిర్ణయంగా దీన్ని నిపుణులు అభివర్ణిస్తున్నారు.

ప్రతి దళితవాడకు శ్మశాన వాటిక

రాష్ట్రంలోని దళిత వాడలకు శ్మశాన వాటిక సమస్య లేకుండా చేసేందుకు ఆ దిశగా నడుం బిగించింది. శ్మశాన వాటికలు లేని దళిత వాడలను గుర్తించి, వెంటనే ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలోని 1,700 గ్రామాల్లో 1050.08 ఎకరాల భూమిని శ్మశాన వాటికలకు కేటాయించింది.

కొత్త జిల్లాల కల సాకారం

- ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ ప్రభుత్వం పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాలను పునర్వ్యవస్థీకరించింది. 13 జిల్లాలను 26 జిల్లాలుగా, 51 రెవెన్యూ డివిజన్లను 77 డివిజన్లుగా పునర్వ్యవస్థీకరించింది. జిల్లా కేంద్రాలు, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, చారిత్రక, సాంస్కృతిక అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని విభజన పూర్తి చేసింది.
- పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని 25 జిల్లాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, గిరిజన ప్రాంతం విస్తృతి దృష్ట్యా అరకు పార్లమెంట్‌ను రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసింది. పరిపాలనా వికేంద్రీకరణ, భౌగోళిక అనుకూలతలతోపాటు ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఇచ్చింది.
- ప్రతి జిల్లాకు అక్కడి పరిస్థితులను బట్టి పేరు పెట్టి, ఆయా ప్రాంతాల ప్రాధాన్యాన్ని మరింత పెంచింది. గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్‌ను విస్మరిస్తే.. ఆయన జన్మించిన కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టడం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం ఆయన గౌరవాన్ని నిలబెట్టింది.

సుదీర్ఘకాలం తర్వాత భూ పంపిణీ

రాష్ట్రంలో సుదీర్ఘ కాలం తర్వాత నిరుపేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 23 జిల్లాల్లో 50 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచనున్నారు. 46 వేల మందికి భూములివ్వడానికి ఎంపిక చేయగా, అందులో ఎక్కువ మంది దళితులే. వ్యవసాయ కూలీలుగా, ఇతర పనులు చేసుకుంటూ జీవించే వారిని ప్రభుత్వం రైతులుగా మార్చనుంది. రాష్ట్రంలో 2013 తర్వాత మళ్లీ భూ పంపిణీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

1.68 లక్షల సర్వీసు ఈనాం భూములకు విముక్తి

గ్రామాల్లో కుల వృత్తుల వారికి ఇచ్చిన ఈనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించారు. 1,68,604 ఎకరాల ఈనాం భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పిస్తున్నారు.

లంక భూములకు డి పట్టాలు

అనేక సంవత్సరాలుగా అపరిష్కృత సమస్యగా ఉన్న లంక భూములకు డీకేటీ పట్టాలిస్తున్నారు. 8 జిల్లాల్లో ఉన్న కృష్ణా, గోదావరి లంకల్లోని 9,062 ఎకరాలకు సంబంధించిన 19,176 మంది రైతులకు పట్టాలు దక్కనున్నాయి. మూడు కేటగిరీల్లో లంక భూములను సాగు చేసుకుంటున్న రైతులు తమకు పట్టాలు ఇవ్వాలని కోరుతుండడంతో వివాదాల్లేకుండా సాగు చేసుకుంటున్న అర్హులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సి కేటగిరీలోని కొన్ని భూములకు ఐదేళ్ల లీజుకు ఇవ్వనుంది.

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం

- అత్యంత వివాదాస్పదమై ఏళ్ల తరబడి లక్షలాది మంది రైతుల కుటుంబాల్లో చీకట్లు నింపిన చుక్కల భూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం సునాయాసంగా పరిష్కరించింది. 15 జిల్లాల్లో 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22 ఏ (1) ఇ) నుంచి ఒకేసారి తొలగించి చరిత్ర సృష్టించింది.
- చుక్కల భూములుగా ఆర్ఎస్ఆర్‌లో రికార్డు చేసిన భూములు ప్రభుత్వానికి చెందినవా, ప్రైవేటు పట్టాదారులవా అనే అంశాన్ని గత ప్రభుత్వం ఖరారు చేయకుండా నిషేధిత భూముల జాబితాలో చేర్చింది. ఆ రికార్డులన్నింటినీ పరిశీలించి చుక్కల భూములకు విముక్తి కల్పించింది. ఈ నిర్ణయం వల్ల 1,07,134 మంది రైతులకు వారి భూములపై శాశ్వత హక్కులు లభించాయి.

షరతులు గల పట్టా భూములపై తొలగిన ఆంక్షలు

- చుక్కల భూముల తరహాలోనే సమస్యాత్మకంగా తయారైన షరతులు గల పట్టా భూములకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. 33 వేల ఎకరాల షరతులు గల పట్టా భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి ఆ రైతులకు మేలు చేకూర్చింది.
- బ్రిటీష్ హయాం నుంచి రైతుల చేతుల్లో ఉన్న భూములను తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 22ఏ కేటగిరీలో పెట్టగా, అలా పెట్టడం అన్యాయమని భావించి నిబంధనల ప్రకారమే వాటిని ఆ జాబితా నుంచి ఈ ప్రభుత్వం తీసివేసింది.
- ఇలా ఒక్క కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోనే 18 వేలకుపైగా ఎకరాలను 22ఏ నుంచి తీసివేశారు. 2022 అక్టోబర్ 20న అవనిగడ్డలో బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి కొందరికి పట్టాలిచ్చారు.

అనాధీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యకు చెక్

అనాధీనం, ఖాళీ కాలమ్ భూములను చుక్కల భూముల చట్టం పరిధిలోకి తీసుకువచ్చి, వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాలకు సంబంధించిన 35 నుంచి 40 వేల మంది రైతులు దీనివల్ల లబ్ధి పొందారు.

సాదాబైనామా కేసుల పరిష్కారం

గతంలో భూముల లావాదేవీలను తెల్ల కాగితాల మీద రాసుకోవడం, నోటి మాటగా జరిగిన భూముల లావాదేవీల (సాదాబైనామా విధానం) సమస్యకు పరిష్కారం చూపింది. ఒక నిర్దిష్ట విధానాన్ని రూపొందించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించింది.

మ్యుటేషన్లలో పారదర్శకత

- మ్యుటేషన్ల పేరుతో జరిగే అక్రమాలకు ముగింపు పలికేలా ప్రభుత్వం అనేక మార్పులు చేపట్టింది. ఇష్టానుసారం మ్యుటేషన్లు చేయడాన్ని నిలిపివేసి, పట్టాదారుకు నోటీసు ఇచ్చి, విచారణ జరిగిన తర్వాతే రెవెన్యూ రికార్డులో మార్పు జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చారు. దీంతో కరెక్షన్ పేరుతో జరిగే మ్యుటేషన్లు నిలిచిపోయాయి.
- మ్యుటేషన్లు తిరస్కరించే అధికారాన్ని తహశీల్దార్లకు తీసివేసి ఆర్డీఓలకు అప్పగించడంతో ఇబ్బందులు తగ్గిపోయాయి. రిజిస్ట్రేషన్‌కు ముందే సర్వే నంబర్ సబ్ డివిజన్ చేసుకునే విధానాన్ని ప్రవేశ పెట్టడంతో డబుల్ రిజిస్ట్రేషన్లు తగ్గాయి. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తీసుకువస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల ఈ విధానం అందుబాటులోకి వచ్చింది.

సర్టిఫికెట్ల జారీ సులభతరం

- ప్రజలకు అవసరమైన ముఖ్యమైన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వైఎస్ జగన్ ప్రభుత్వం సులభతరం చేసింది. సర్టిఫికెట్లు జారీ చేయడానికి దరఖాస్తులు తీసుకునే గ్రామ, వార్డు సచివాలయం, మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ వెబ్ అప్లికేషన్, కాల్ సెంటర్ వంటి వ్యవస్థలన్నింటికీ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చి వాటి ప్రకారమే పని చేయిస్తోంది.
- హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో ఉన్న కుటుంబానికి వెంటనే ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వడం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గతంలో జారీ అయి ఉంటే ప్రస్తుత తహశీల్దార్ డిజిటల్ సంతకం, ప్రస్తుత తేదీతో మళ్లీ వెంటనే ఇవ్వడం లాంటి అనేక మార్పులు తీసుకువచ్చి అమలు చేస్తోంది.

ఆస్తిని సంపదగా మార్చే ప్రక్రియ ముమ్మరం



భూములకు సంబంధించి అంతర్జాతీయ సంస్థలు ఏవైతే జరగాలని చెబుతున్నారో.. అలాంటి మార్పులన్నీ ఇప్పుడు ఏపీలో జరుగుతున్నాయి. ఎక్కడైనా సరే ఆస్తిని సంపదగా మార్చుకున్న దేశాలు అభివృద్ధి చెందుతాయి. ఆస్తి సంపదగా మారాలంటే అడ్డంకులను ప్రభుత్వమే తొలగించాలి. ఆ పని ఏపీ ప్రభుత్వం చేస్తోంది. భూ హక్కులకు భద్రత కల్పించడం, సరిహద్దుల స్పష్టత, అమ్మకాలు–కొనుగోళ్లను సులభం చేయడం, ఆంక్షలను తొలగించడం, మంచి భూ పరిపాలన యంత్రాంగాన్ని తయారు చేయడం ప్రధానమైనవి. ఏపీ ప్రభుత్వం ఈ పనులన్నీ చేస్తోంది. అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తేయడం, చుక్కల భూములు, అనాధీనం భూములపైనా ఆంక్షలు తొలగించడం ఇందులో భాగమే. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గ్రామ స్థాయికి రావడం పెద్ద మార్పు. ఇలా ఆస్తిని సంపదగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేసింది. తద్వారా వేల కోట్ల సంపద ఆవిష్కృతమైంది.

– ఎం.సునీల్‌కుమార్,
భూ చట్టాల నిపుణుడు, నల్సార్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, హైదరాబాద్

ధర్నాలు, నిరసనలకు బాలలను తీసుకెళ్తే ఉపేక్షించం

- ఏపీ బాలల హక్కుల కమిషన్ హెచ్చరిక
- ఇటీవల భువనేశ్వరి సభలో పిల్లాడితో మాట్లాడించడంపై సీరియస్
- సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసేలా ప్రేరేపించడం సరికాదు
- ఇటువంటి చర్యలు పునరావృతమైతే సుమోటోగా కేసు నమోదు



రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు

సాక్షి, అమరావతి: బాలలను రాజకీయ పార్టీల ప్రచారాలకు, ధర్నాలు, నిరసనలకు తీసుకెళ్తే ఉపేక్షించబోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ హెచ్చరించింది. అందుకు బాధ్యులైన నిర్వాహకులపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆదేశించింది. అవినీతి కేసులో అరెస్టు అయిన చంద్రబాబుకు మద్దతుగా నారా భువనేశ్వరి నిర్వహించిన సభలో ఒక బాలుడితో మాట్లాడించిన అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. టీడీపీ సభలో సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసేలా ఆ పిల్లాడిని ప్రేరేపించడం సరికాదని అభిప్రాయ పడింది. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సభ్యులు జంగం రాజేంద్రప్రసాద్, త్రిపర్ణ ఆదిలక్ష్మి, ఎం.లక్ష్మీదేవితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు రాజకీయ నాయకులు చిన్నారులను తమ రాజకీయాలకు వాడుకోవడంపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బాలలను రాజకీయ ప్రచారాలకు, ప్రసంగాలకు, వేడుకలకు, ధర్నాలకు, ఊరేగింపులకు ఉపయోగిస్తే వారికి బాలల హక్కుల కమిషన్ నుంచి సంజాయిషీ నోటీసులు జారీ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అసభ్యకర పదజాలంతో, అసహ్యకర వ్యాఖ్యలతో ప్రసంగాలు చేయించటం ద్వారా బాలల మనస్సులో విష బీజాలు నాటడం సరికాదన్నారు. ఇటువంటి చర్యల వల్ల పిల్లలు చదువుపై ఆసక్తి సన్నగిల్లి పెడతోవ పట్టే ప్రమాదం ఉందన్నారు. బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడిక ప్రకారం 18 ఏళ్లలోపు వారిని చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు, సదస్సులు, సమావేశాల్లో భాగస్వామ్యం చేయకూడదని స్పష్టం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడే వారిపై సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్పందనేది 'బాబూ'!

చంద్రబాబుపై కనిపించని సానుభూతి

- కాంతితో క్రాంతి కార్యక్రమానికీ స్పందన కరువు
- బాబు అరెస్టుతో సానుభూతి పొందాలని టీడీపీ ప్రయత్నాలు
- పట్టించుకోని ప్రజలు, పార్టీ కార్యకర్తలు
- టీడీపీ ఎన్ని కార్యక్రమాలు చేసినా అన్నీ విఫలం
- బాబు అవినీతి చేశారని ప్రజలు నమ్ముతున్నారంటున్న విశ్లేషకులు
- అందుకే టీడీపీ పిలుపునకు స్పందించడంలేదని వెల్లడి

సాక్షి, అమరావతి : చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో ఏమాత్రం స్పందన కనిపించడంలేదు. తమ నాయకుడిని అరెస్టు చేసిన తర్వాత ప్రజల నుంచి సానుభూతి వెల్లువెత్తుతోందని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నా, అది ఎక్కడా మచ్చుకైనా కనిపించడంలేదు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ పలు కార్యక్రమాలు ప్రకటించి, వాటిలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిస్తున్నా, స్పందన ఉండటంలేదు. ప్రజలే కాదు.. ఆ పార్టీ శ్రేణుల్లోనూ స్పందన కరవైంది. శనివారం రాత్రి కూడా కాంతితో క్రాంతి అంటూ టీడీపీ చేపట్టిన కార్యక్రమమూ విఫలమైంది. రాత్రి 7 గంటలకు ప్రజలంతా ఇళ్లలో లైట్లు ఆర్పేసి కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబు అరెస్టుకు నిరసన తెలపాలని టీడీపీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని ప్రజలు అసలు పట్టించుకునే లేదు. ఇలాంటి కార్యక్రమం ఒకటి జరుగుతోందనే విషయం కూడా చాలామందికి తెలియదు. రాజమహేంద్రవరంలో భువనేశ్వరి, ఢిల్లీలో లోకేశ్, అక్కడక్కడ కొందరు నేతలు, కొంతమంది మద్దతుదారులు ఇళ్లలో లైట్లు ఆర్పి, కొవ్వొత్తులు వెలిగించి సోషల్ మీడియాలో హంగామా చేశారు తప్ప ప్రజలు, ఆ పార్టీ కార్యకర్తలు కూడా స్పందించలేదు. అవినీతి చేసినందువల్లే చంద్రబాబు అరెస్టయి జైలుకు వెళ్లారని జనం నమ్మడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబుపై ఏమాత్రం సానుభూతి లేదని ఈ కార్యక్రమానికి వచ్చిన స్పందనే చెబుతోందని అంటున్నారు. బాబు అరెస్ట్ అయిన సమయంలో కూడా ప్రజల నుంచే కాదు పార్టీలోనే స్పందన కనిపించలేదు. బయటకు వచ్చి ఆందోళనలు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇతర నేతలు బతిమలాడుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత చేసిన బంద్‌తో సహా ఏ కార్యక్రమానికీ జనం నుంచి స్పందన రాలేదు.

దీపాలు వెలిగించి భువనేశ్వరి నిరసన..

ప్రత్యేక విమానంలో ఢిల్లీకి లోకేశ్, బ్రాహ్మణి

సాక్షి, రాజమహేంద్రవరం/మధురపూడి: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా 'కాంతితో క్రాంతి' పేరుతో శనివారం రాత్రి 7 నుంచి 7.05 గంటల వరకు రాజమహేంద్రవరంలోని లోకేశ్ శిబిరంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మహిళా నేతలు దీపాలు వెలిగించారు. అంతకు ముందే నారా లోకేశ్, బ్రాహ్మణి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లారు. కాగా, బాబు జ్యుడిషియల్ రిమాండ్ 27వ రోజుకు చేరింది.

పథకాల అమలులో ఏపీ ప్రామాణికం

- సంక్షేమ పథకాలతో ఆర్థిక సమానత్వం సాధ్యమని సీఎం జగన్ నమ్మారు
- ప్రతి స్కీమ్ ఆయన ఆలోచనల నుంచి వచ్చిందే
- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు
- ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టాం
- బెంగళూరు 'దక్షిణ్ డైలాగ్స్'లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



'దక్షిణ్ డైలాగ్స్' లో మంత్రి రజిని తదితరులు

సాక్షి, బెంగళూరు: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే గొప్ప ప్రామాణికంగా నిలుస్తొందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సమానత్వాన్ని సాధించొచ్చనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రముఖ మీడియా గ్రూప్.. సౌత్ ఫస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరులో శనివారం దక్షిణ్ డైలాగ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్షిణ భారత రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై మదింపు జరిగింది. దీనికి ఆయా రాష్ట్రాల ఐటీ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాలకు ఒక అభివృద్ధి నమూనా ఉందా? ఒకవేళ ఉంటే అది సరైన దారిలోనే ఉందా? అనే అంశాలపై చర్చ నిర్వహించారు.

అనేక సంస్కరణలకు శ్రీకారం..

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. మన దేశంలోనే గొప్ప రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పరిపాలనలో ముందుకు దూసుకెళుతోందని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ప్రతి పథకం ఆయన ఆలోచనుంచి వచ్చేందేనన్నారు. అమ్మఒడి ద్వారా ఏటా 44.50 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల విద్యార్థుల డ్రాపవుట్లు నివారించి అక్షరాస్యత శాతాన్ని పెంచగలిగామన్నారు. నాలుగేళ్లలో ఈ పథకానికి తమ ప్రభుత్వం ఏకంగా 26,067.28 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. అలాగే రాష్ట్రంలోని 46 వేల పాఠశాలలను నాడు-నేడు కింద రూ.17,805 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన కార్యక్రమాల ద్వారా 1 నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. నిజమైన మహిళా సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటివరకు 7.98 లక్షల మహిళా గ్రూపులకు రూ.19,178.17 కోట్ల రుణాలను తమ ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు. అలాగే వైఎస్సార్ చేయూత కింద 45 నుంచి 60 ఏళ్లలోపు వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఒక్కొక్కరికి ఏటా రూ.18,750 చొప్పున అందించిందన్నారు. 30 లక్షల మందికిపైగా మహిళలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు కూడా కట్టి ఇస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ రైతు భరోసా, వాహన మిత్ర , నేతన్న నేస్తం .. ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏపీ

ఏపీలో వైద్య ఆరోగ్య రంగంలో తమ ప్రభుత్వం కనీవినీ ఎరుగని సంస్కరణలు ప్రవేశపెట్టిందని రజిని తెలిపారు. రాష్ట్రంలోని అందరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేశామని చెప్పారు. దేశంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏపీయేనని వెల్లడించారు. రూ.16 వేల కోట్లతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య పరీక్షలు చేయడంతోపాటు ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు వెళితే మంచి ఫలితాలు సాధించొచ్చని అభిప్రాయపడ్డారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


చిత్తూరు జిల్లా పలమనేరులోని పాతపేటలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు


ఎన్టీఆర్ జిల్లా ముచ్చింతాలలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది


శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లొత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన గ్రామస్తులు


అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని కోటకాడపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది


గుంటూరు జిల్లా నల్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి తరలి వచ్చిన గ్రామస్తులు


పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం జట్లపాలెంలో వైద్య శిబిరానికి భారీగా వచ్చిన ప్రజలు


అనంతపురం నాయక్ నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలు పొందడానికి వచ్చిన ప్రజలు


ప్రకాశం జిల్లా కూటాగుండ్ల గ్రామంలోని వైద్య శిబిరంలో ఓపీలు రాయించుకుంటున్న గ్రామస్తులు


కర్నూలు ముజఫర్‌నగర్‌లో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన క్యాంప్‌లో మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది


గ్రేటర్ విశాఖ 11వ వార్డు యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన క్యాంప్‌లో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అప్పసముద్రం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది


విజయనగరం జిల్లా పురిటిపెంటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ సదస్సుకు ఆహ్వానితులకే అనుమతి

లేళ్ల అప్పిరెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ–పార్టీ ప్రతినిధుల సభకు ఆహ్వానితులకు మాత్రమే అనుమతి ఉంటుందని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రీజనల్ కోఆర్డినేటర్లు, సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, మేయర్లు, మున్సిపల్, మార్కెట్ యార్డు చైర్మన్లు, ఎంపీపీలు, సోషల్ మీడియా సభ్యులు.. ఇలా మొత్తం 25 విభాగాలకు చెందిన 8,222 మంది పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఆహ్వాన పత్రికలు, పాసులు పంపించామన్నారు. ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆహ్వానితులు ఉదయం 8.30కి స్టేడియానికి చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

దోచుకుంటే జైల్లో పెట్టరా?

ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా



తుని రూరల్: అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.370 కోట్లు అప్పనంగా దోచేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును జైల్లో పెట్టకుండా సన్మానాలు చేస్తారా అని ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రశ్నించారు. చంద్రబాబు పుణ్యమా అని జరిగిన స్కిల్ కుంభకోణం వల్ల ఒకతరం యువత మొత్తం మోసపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తుని మండలం గెద్దబీడు సాయివేదికలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... ప్రాథమిక ఆధారాలు లేకుండా ఏ కోర్టు నిందితులను రిమాండుకు పంపదని చెప్పారు. పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రూ.1,500 కోట్లకు అమ్ముడుపోయిన పవన్

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార(విశాఖ ఉత్తర): జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రూ.1,500 కోట్లకు చంద్రబాబుకు అమ్ముడుపోయాడని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. అమరావతిలో బినామీల పేర్లతో టీడీపీ నాయకులు భూములు కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. విశాఖ ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ ఒక రోజు ఎన్డీఏలో ఉన్నానంటాడని, మరొక రోజు లేనని చెబుతాడని, రేపు ఏమంటారో చూడాలన్నారు. చంద్రబాబు స్టీల్ ప్లాంట్ కోసం ఏనాడు పోరాటం చేయలేదని, ఆయన అదానీకి అమ్ముడుపోయాడని ఆరోపించారు. చంద్రబాబు అమరావతి కడతానని కట్టలేదని, పోలవరం పూర్తి చేయలేదని, ప్రత్యేక హోదా సాధించలేదని పేర్కొన్నారు. ఏ తప్పు చేయకపోతే లోకేశ్ ఎందుకు ఢిల్లీలో దాక్కున్నారని ప్రశ్నించారు. లోకేశ్ ఢిల్లీలో బీజేపీ పెద్దల కాళ్లవేళ్లా పడినా అపాయింట్‌మెంట్ దొరకలేదని అన్నారు. తాను విశాఖ ఎంపీ కాకపోతే వచ్చే ఏడాది స్టీల్ ప్లాంట్ అమ్మేస్తారని చెప్పారు. ప్రజాశాంతి పార్టీ నాయకుడు ఏసుపాదం పాల్గొన్నారు.

ఆ మాటలనడానికి నోరెలా వచ్చింది

టీడీపీ నేత బండారుపై పలువురు నటీమణుల ఆగ్రహం

- బండారూ.. నీకు సిగ్గులేదా అంటూ విరుచుకుపడిన సినీనటి, ఎంపీ నవనీత్ కౌర్
- ప్రధాని కఠిన చర్యలు తీసుకోవాలని నటి రమ్యకృష్ణ డిమాండ్
- టీడీపీ నేతలు రాజకీయాలను దిగజారుస్తున్నారంటూ కవిత ఆవేదన

సాక్షి, అమరావతి: మంత్రి రోజాపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సహ నటీమణులు, జాతీయ స్థాయి నేతలు, పక్క రాష్ట్రాల నేతలు రోజాకు మద్దతుగా గళం విప్పుతున్నారు. ఇప్పటికే కుష్బూ, రాధిక వంటి నటీమణులు.. బండారు సత్యనారాయణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాజాగా నటి, ఎంపీ నవనీత్ కౌర్, నటీమణులు రమ్యకృష్ణ, కవిత వంటి వారు రోజాకు మద్దతుగా నిలిచారు. రోజా గురించి ఆ మాటలనడానికి నోరెలా వచ్చిందని మండిపడ్డారు. బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు తెలుగు సినిమాల్లో నటించిన నటి, ఎంపీ (మహారాష్ట్ర అమరావతి లోక్‌సభ నియోజకవర్గం) నవనీత్ కౌర్ బండారుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రోజాకు మద్దతుగా ఆమె తెలుగులో మాట్లాడుతూ వీడియో విడుదల చేశారు. రోజాకు దేశంలోని మహిళా లోకమంతా మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. 'మహిళా ప్రజా ప్రతినిధిపై ఇలాంటి మాటలు మాట్లాడటానికి సిగ్గులేదా? నీకు ఇంటిలో భార్య, కూతురు, సోదరి వంటి వాళ్లు ఎవ్వరూ లేరా? ఇంత నీచంగా మాట్లాడటానికి నోరెలా వచ్చింది? తెలుగు అమ్మాయిలాగా తెలుగులో మాట్లాడుతుంది, తెలుగు సినిమాల్లో పని చేసింది అంటూ ఏపీ, తెలంగాణ ఎంపీలు నన్ను ఎంతో గౌరవంగా చూస్తారు. ఎంతో మంది అగ్ర హీరోలతో పని చేసి ప్రస్తుతం రాజకీయాల్లోకి వచ్చిన రోజాపై ఇంత దిగజారి మాట్లాడటానికి నీకు ఎంత ధైర్యం కావాలి' అంటూ బండారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు రాజకీయాలు ముఖ్యమా లేక తెలుగు మహిళల గౌరవం ముఖ్యమా అన్నది తేల్చుకోవాలని అన్నారు.

భువనేశ్వరి, బ్రాహ్మణి ఖండించాలి: కవిత

తెలుగుదేశం పార్టీ నేతలు మహిళలపై దిగజారి మాట్లాడుతున్నారని సినీ నటి, తెలుగుదేశం పార్టీ మాజీ మహిళా నేత కవిత ధ్వజమెత్తారు. మహిళా మంత్రి రోజాపై బండారు సత్యానారాయణ అత్యంత హేయంగా మాట్లాడారని అన్నారు. ఆయన వ్యాఖ్యలను భువనేశ్వరి, బ్రాహ్మణి వెంటనే ఖండించాలని డిమాండ్ చేశారు. దరిద్రపు మాటలు ఎలా మాట్లాడారో తెలియడంలేదని వ్యాఖ్యానించారు. టీడీపీ నాయకులు రాజకీయాలను ఇంతలా దిగజారుస్తారనుకోలేదన్నారు. బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంత నీచంగా మాట్లాడతారా?: రమ్యకృష్ణ

భారత మాతాకి జై అని గర్వంగా చెప్పుకొనే మన దేశంలోఒక మహిళపై ఇంత నీచంగా మాట్లాడతారా అంటూ సినీ నటి రమ్యకృష్ణ బండారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, జెండర్ తో సంబంధం లేకుండా బండారు వ్యాఖ్యలను అందరూ ఖండించాలన్నారు. ఓ మహిళగా, నటిగా, స్నేహితురాలిగా మంత్రి రోజాకి అండగా ఉంటానని చెప్పారు. నీచమైన వ్యాఖ్యలు చేసిన బండారు సత్యానారాయణను క్షమించకూడదన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలి

అల్లూరి జిల్లాలో మహిళల నిరసన.. కొవ్వొత్తుల ర్యాలీ


పాడేరులో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పర్యాటకశాఖ మంత్రి రోజాను అసభ్యకరంగా దూషించిన టీడీపీ నేత బండారు సత్యనారాయణపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బండారు సత్యనారాయణ వైఖరిని ఖండిస్తూ ఎమ్మెల్యే ఆధ్వర్యాన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడి జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. బండారు ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మంత్రి రోజాతోపాటు మహిళా సమాజానికి బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలపట్ల అగౌరవంగా ప్రవర్తిస్తున్న బండారు సత్యనారాయణకు టీడీపీ నేతలు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. బండారుపై కేంద్ర, రాష్ట్ర మహిళా కమిషన్‌లు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీకే చెందిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గతంలో మహిళా మున్సిపల్ కమిషనర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం, చింతమనేని ప్రభాకర్ ఏకంగా ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేయడం వంటి దారుణమైన ఘటనలు రాష్ట్ర ప్రజలు చూశారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.రాంబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, మంత్రి రోజాను బండారు సత్యనారాయణ అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ పాడేరులో కొవ్వొత్తులతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పలువురు నేతలు ర్యాలీ నిర్వహించారు.

లోకేశ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: భారతదేశానికి ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రాజధానిగా అభివర్ణిస్తూ టీడీపీ నేత నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యంతో కూడినవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా అది ఏపీలో తయారైందేనన్నట్టు రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల్ని కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ఈ మేరకు విజయసాయిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. టీడీపీ హయాంలో రాష్ట్రానికి ఎటువంటి మేలు చేయకపోగా ఇప్పుడు జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని తక్కువ చేస్తూ మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజాధనం కొల్లగొట్టేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ స్పష్టంగా తెలుస్తోందన్నారు. అప్పట్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి, టీడీపీకి ఒక్కరే ఆడిటర్‌గా వ్యవహరించారని ఆరోపించారు. కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ వాటిపై విచారించేందుకు చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలని కోరిందన్నారు.

పవన్ ప్యాకేజీ రూ.1,400 కోట్లు పైనే..

- హవాలా ద్వారా అదంతా విదేశాలకు తరలిపోయింది
- కేంద్రం వద్ద సమగ్ర సమాచారం ఉంది
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే 'ద్వారంపూడి' ఫైర్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఇంతవరకు వివిధ రూపాల్లో రూ.1,400 కోట్లకు పైగానే ప్యాకేజీ అందిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. రాజకీయ పొత్తుల వ్యవహారంలో భాగంగానే ఆయన ఈ సొమ్ము అందుకున్నారని.. ఈ మొత్తాన్ని ఇప్పటికే హవాలా ద్వారా పవన్ బినామీలకు చేరిందన్నారు. కాకినాడలో శనివారం ద్వారంపూడి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ ప్యాకేజీ మాట్లాడుకుని పెద్దఎత్తున సొమ్ములు తీసుకున్నారని తాను చేస్తున్న ఆరోపణలకు ఇప్పటికీ, ఎప్పటికీ కట్టుబడే ఉంటానన్నారు. అలా వచ్చిన రూ.1,400 కోట్లను రష్యా, దుబాయ్, సింగపూర్ వంటి దేశాలకు తరలించేశారన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారం కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుని బీజేపీని కూడా కలుపుకుని వెళ్తామని పవన్ పదేపదే చెబుతుండటం వెనుక పెద్ద కారణమే ఉందన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో తనపై కాకినాడ సిటీలో గ్లాస్ గుర్తుపై అభ్యర్థిని పోటీలో పెట్టలేకపోతే ఆ క్షణాన్నే పవన్ రాజకీయంగా ఓటమి చెందినట్లు భావిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేయడం, ఆ తరువాత టీడీపీ శాశ్వతంగా మూతపడడం రెండూ ఒకేసారి జరుగుతాయని ద్వారంపూడి చెప్పారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు దేశంలోనే మరొకరు లేరని.. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవస్థలను మేనేజ్ చేస్తోందంటూ లోకేశ్ విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. చీకట్లో చిదంబరం వంటి నేతలను కలవడం, నిన్నమొన్నటి వరకు దేశ అత్యున్నత న్యాయస్థానంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తితో సంబంధాలు.. వెంకయ్యనాయుడు వంటి వ్యక్తులతో సాగించిన చీకటి రాజకీయాలు ప్రజలకు తెలియనివి కావన్నారు. ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబుకు ఇప్పుడు పరిస్థితులు కలిసి రాకపోవడంలేదనే అక్కసుతోనే లోకేశ్ ఈ రకమైన విమర్శలు చేస్తున్నారని ద్వారంపూడి మండిపడ్డారు.

బాబుకు ఇక అధికారం దక్కదు


మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అనకాపల్లి టౌన్: చంద్రబాబు తన జీవితకాలంలో మళ్లీ అధికారంలోకి రాలేరని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. మండలంలోని మార్టూరు గ్రామంలో 'ఏపీకి జగన్ కావాలి' కార్యక్రమ సన్నాహక సమావేశం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద ఆధ్వర్యంలో శనివారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు 14ఏళ్లు సీఎంగా ఉండి రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. అదే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలుచేశారన్నారు. చంద్రబాబు వివిధ నేరాల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లాడని, ఈ విషయాన్ని న్యాయస్థానం కూడా నమ్ముతోంది కాబట్టే ఆయనకు బెయిల్ ఇవ్వటంలేదన్నారు. ఇక పవన్‌కళ్యాణ్‌కు పార్టీ నడిపే దమ్ములేదని, ఒంటరిగా పోటీచేసే సత్తాలేదని అందుకే టీడీపీతో పొత్తుకు వెంపర్లాడుతున్నారని అమర్‌నాథ్ విమర్శించారు.

ప్రజలనే అవినీతిపరులంటావా?

పవన్‌పై డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఫైర్



కార్వేటినగరం(చిత్తూరు జిల్లా): స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుపాలైన చంద్రబాబు అవినీతిపరుడు కాదని, అమాయకులైన ప్రజలే అవినీతిపరులంటున్న పవన్ కళ్యాణ్‌కు ప్రజాకోర్టులో పరాజయం తప్పదని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. శనివారం ఆర్కేవీబీపేటలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఒక అవినీతి చక్రవర్తి అని, ప్రజాధనాన్ని దోచుకున్న ఆయన్ను అరెస్ట్ చేస్తే దత్తపుత్రుడు రోడ్లపై దొర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అరెస్టుపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అరెస్టుకు, కాంగ్రెస్‌లో ఉన్న రేణుకాచౌదరికి సంబంధమేంటని ప్రశ్నించారు. తన తండ్రి ఎన్టీఆర్ మృతికి చంద్రబాబే కారణమన్న పురందేశ్వరి.. నేడు చంద్రబాబు అరెస్ట్‌తో మరిదిపై ప్రేమ వలకబోస్తున్నారని ధ్వజమెత్తారు. పురందేశ్వరి, తన భర్త వేంకటేశ్వరరావులు తెలుగుదేశాన్ని వదిలి బీజేపీలో ఎందుకు చేరారో చెప్పాలని ప్రశ్నించారు.

తప్పు చేస్తే.. చట్టం ఎవరినీ వదలదు

మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తప్పు చేస్తే చట్టం ఎవరినీ వదలదని, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల విచారణలోనే ముందుగా చంద్రబాబు బాగోతం బట్టబయలయిందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. బాబుపై అక్రమంగా కేసు నమోదు చేశామని ఎల్లో మీడియా గగ్గోలు పెడుతుందని, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలే బాబు అవినీతిపరుడని తేల్చాయన్నారు. శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో శనివారం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మాట్లాడారు. చంద్రబాబు కొన్ని షెల్ కంపెనీలు సృష్టించి డబ్బులు దోచుకున్నాడని చెప్పారు. అవినీతిలో ముఖ్యపాత్ర పోషించిన చంద్రబాబు, లోకేశ్ పీఏలు ఇద్దరూ అమెరికాకు పారిపోయారని తెలిపారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మాజీ సీఎంలు జయలలిత, లాలూ ప్రసాద్‌యాదవ్ తదితరులంతా కోర్టుల ముందు నిలబడినవారేనని, చంద్రబాబు ఏమైనా పైనుంచి దిగొచ్చారా.. ప్రశ్నించారు.

మళ్లీ ఢిల్లీ విమానం ఎక్కిన లోకేశ్

- టీడీపీ శ్రేణుల్లో అయోమయం
- సీఎం జగన్ ఢిల్లీ వెళ్లగానే రాజమండ్రికి వచ్చిన చినబాబు
- సీఎం తిరిగి రాగానే మళ్లీ ఢిల్లీకి వెళ్లిన వైనం
- ఇదంతా అరెస్టు భయం వల్లే అంటున్న ఆ పార్టీ నేతలు
- కీలక వేళ పార్టీని వదిలేస్తున్నారని క్యాడర్‌లో ఆందోళన



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో ఆయన తనయుడు లోకేశ్ వ్యవహరిస్తున్న తీరుతో తెలుగుదేశం పార్టీలో అయోమయం నెలకొంది. యువగళం పాదయాత్రను నిలిపివేసిన లోకేశ్ వెంటనే ఢిల్లీ వెళ్లి, అక్కడే ఉండిపోవడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయి. సుప్రీం కోర్టులో చంద్రబాబు కేసుల గురించి న్యాయవాదులతో చర్చించేందుకు అక్కడే ఉంటున్నట్లు పార్టీ వర్గాలు సమర్థించుకుంటూ వచ్చాయి. అరెస్టు భయంతోనే ఆయన ఢిల్లీ వదిలి రావడంలేదని సొంత పార్టీ నేతలకే అవగతమైంది. దీనిపై విమర్శలు వచ్చినా ఇన్నాళ్లూ ఆయన అక్కడే కాలం గడిపారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణం కేసులో ఏపీ సీఐడీ పోలీసులు లోకేశ్‌కు నోటీసులు ఇచ్చినప్పుడు సైతం ఆయన డ్రామా నడిపారు. నోటీసులు తీసుకోకుండా ఢిల్లీలో దాగుడుమూతలు ఆడి చివరికి తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారు. సీఐడీ పోలీసులు తనకు లవ్ లెటర్ ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. తాను 4వ తేదీన సీఐడీ విచారణకు హాజరవుతానని గంభీరంగా చెప్పారు. కానీ దానిపై కోర్టుకెళ్లి విచారణకు తనకు సమయం కావాలని అభ్యర్థించారు. కోర్టు 10వ తేదీ వరకు సమయం ఇవ్వడంతో ఢిల్లీలోనే పనేమీ లేకుండా కాలక్షేపం చేశారు.

తప్పులో కాలేసి మళ్లీ ఢిల్లీకి..

ఈ సమయంలోనే సీఎం జగన్ అధికారిక పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్లడంతో లోకేశ్ ఉన్నట్టుండి రాజమండ్రి వచ్చారు. తన తండ్రి చంద్రబాబుతో ములాఖత్ ఉంది కాబట్టే వచ్చానని సర్దిచెప్పుకుంటున్నా జగన్ ఢిల్లీలో అడుగుపెట్టగానే ఆయన ఢిల్లీని వీడడం చర్చనీయాంశమైంది. రాజమండ్రి వచ్చి జైల్లో చంద్రబాబును కలిశాక గంభీర ఉపన్యాసం ఇచ్చారు. తన తండ్రి అవినీతిని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామంటూ మళ్లీ పప్పులో కాలేయడంతో టీడీపీ శ్రేణులు తల పట్టుకున్నాయి. ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ అవుతుండగా శనివారం సీఎం జగన్ ఢిల్లీ నుంచి రాష్ట్రానికి తిరిగి రావడంతో లోకేశ్ మళ్లీ వెంటనే ఢిల్లీ విమానం ఎక్కేశారు. దీంతో ఏం జరుగుతోందో అర్థం కాక టీడీపీ శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. అరెస్ట్ భయంతోనే లోకేశ్ ఇలా చేస్తున్నారని టీడీపీలోని సీనియర్ నేతలు చర్చించుకుంటున్నారు. అత్యంత కీలక సమయంలో లోకేశ్ ఇలా పార్టీని వదిలేసి వెళ్లడం సరికాదని వాపోతున్నారు. ఏదో వంకతో 10వ తేదీ విచారణకు కూడా డుమ్మా కొడతారని టీడీపీ నేత ఒకరు తెలిపారు. రోజుకోరకంగా తన అసమర్థత, బేలతనాన్ని లోకేశ్ ఇలా బయట పెట్టుకోవడం పరిపాటిగా మారిందని పార్టీ శ్రేణులు వాపోతున్నాయి.

ఏ రైల్వే స్టేషన్ ఎప్పుడు పుట్టిందో?

మోదీ చేసిన ప్రస్తావనే ఆదేశంగా భావిస్తూ..

ఉరుకులు, పరుగులతో వివరాలు సేకరిస్తున్న రైల్వే అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల దేశవ్యాప్తంగా తొమ్మిది వందేభారత్ రైళ్లను రైల్వే శాఖ పట్టాలెక్కించింది. ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జెండా ఊపి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంలో ఆయన, ప్రజలను రైల్వేకు మరింత చేరువ చేసే క్రమంలో రైల్వే స్టేషన్లకు పుట్టినరోజు వేడుకలు చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. తమిళనాడులో కోయంబత్తూరు, ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినల్ స్టేషన్ల భవనాలకు ఇటీవల స్థానిక రైల్వే అధికారులు ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. వీటిని ఉదహరించిన మోదీ, మిగతా వాటికి కూడా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. కానీ, విధానపరంగా అలాంటి నిర్ణయం ఇప్పటి వరకు లేదని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నట్టుండి ప్రధాని స్వయంగా పేర్కొనేసరికి, వెంటనే కొన్ని స్టేషన్ భవనాలకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించాలని, ఆయా స్టేషన్లతో అనుబంధం ఉన్న ప్రముఖులు, సాధారణ ప్రయాణికులను పెద్ద సంఖ్యలో పిలిపించి అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో సమీపంలో ఏయే స్టేషన్ల ఆవిర్భావ రోజులున్నాయో గుర్తించే పనిలో పడ్డారు.

వివరాలు సేకరిస్తున్నాం

'రెండు స్టేషన్ల పుట్టినరోజు వేడుకలను ప్రధాని స్వయంగా ప్రస్తావించారు. కానీ, ఇప్పటి వరకు మాకు అలాంటి నిర్ణయంపై సమాచారం లేదు. ప్రధాని స్వయంగా చెప్పారంటే, ఆదేశాలతో సంబంధం లేకుండా మేం నిర్వహించాల్సిందే. అందుకే వివరాలు సేకరిస్తున్నాం' అని ఓ ఉన్నతాధికారి చెప్పుకొచ్చారు.



బీదల కిచ్చువానికి లేమి కలుగదు.
కన్నులు మూసికొనువానికి బహు శాపములు కలుగును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.నవమి ఉ.11.25 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పుష్యమి తె.4.36 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ప.11.11 నుండి 12.55 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.06 నుండి 4.55 వరకు, **అమృతఘడియలు:** రా.9.35 నుండి 10.44 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 5.42
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జె.పి. నడ్డా (బీజేపీ అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

హైదరాబాద్ నుంచి ఢిల్లీ రాగానే ఢిల్లీ నుంచి ఒక్క ఉదుటున ఊటీలో వెళ్లి పడినట్లుగా ఉంది నాకు! ఎండలేనా అవి?! మీటింగ్‌ని తాజ్‌కృష్ణలో పెట్టినా బాగుండేది. తీసుకెళ్లి సిటీ బయట స్టడీ సెంటర్‌లో పడేశారు. పాపం కేసీఆర్ ఫామ్ హౌస్ దాటి బయటికి ఎందుకు రారో ఇప్పుడు అర్థమవుతోంది.

"ఏంటి హైదరాబాద్ సంగతులు నడ్డాజీ.." అని అడుగుతున్నారు మోదీజీ... నా ఫీలింగ్స్‌ని ఏమాత్రం గమనించకుండా!

"కౌన్సిల్ మీటింగ్‌లో ఒక క్లారిటీ వచ్చేసింది మోదీజీ. తెలంగాణ ఓటర్లకు మనం ఇవ్వాల్సింది ఇచ్చేశాం. ఇక వాళ్లు మనకు వెయ్యాల్సింది వెయ్యడం ఒక్కటే మిగిలింది..." అన్నాను. ఆ మాటకు మోదీజీ నవ్వడం లాంటిదేమీ చేయలేదు.

"ఓటర్లకు మనం అన్నీ ఇచ్చేసినా కూడా, ఇంకా ఏదైనా వాళ్లకివ్వడానికి మన దగ్గర ఏదో ఒకటి ఉండాలి నడ్డాజీ! పైగా అది వాళ్లకు ఆసక్తి కలిగించేదై ఉండాలి..." అన్నారు!

అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ మావైపు ఒకసారి చూసి, తిరిగి తమ చేతుల్లో ఉన్న



మ్యాపుల్లోకి తలదూర్చేశారు. ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ మ్యాపులు అవి.

"మోదీజీ! ఓటర్లకు మనం అడిగినవీ అడగనివీ ఇచ్చేస్తున్నప్పుడు వాళ్లకింకా ఏదైనా ఆశను కల్పించడానికి స్పేస్ గానీ, స్కోప్ గానీ మనకు ఎక్కడ నుంచి వస్తుంది?" అన్నాను.

"స్పేస్ గానీ, స్కోప్ గానీ లేకుంటే భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడికి, భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారికి తేడా ఏం ఉంటుంది నడ్డాజీ? ఓటర్లకు ఇవ్వడం, ఓటర్ల నుండి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని ఎన్నికల కమిషనర్ అంటున్నారని చెప్పి... ఓటర్లకు ఏదో ఒక ఆశను కల్పించకుండా, వాళ్లలో ఓటేయాలన్న ఆసక్తిని రేకెత్తించకుండా ఉండటం... ప్రజాస్వామ్యానికి అసలుకే ప్రమాదం కదా..! " అన్నారు మోదీజీ నవ్వుతూ!

అమిత్‌షా, రాజ్‌నాథ్.. మ్యాపుల్లోంచి మా వైపు తలెత్తి చూశారు.

"మోదీజీ! మధ్యప్రదేశ్‌లో కాస్త అటు ఇటుగా మనం సగం, వాళ్లు సగం ఉన్నాం. రాజస్థాన్‌లో కాస్త ఇటు అటుగా వాళ్లు సగం, మనం సగం ఉన్నాం. ఛత్తీస్‌గఢ్‌లో వాళ్లే ఎక్కువమంది ఉన్నారు..." అన్నారు రాజ్‌నాథ్.

అమిత్‌షా చేతిలో రెండు మ్యాపులు ఉన్నాయి. ఒకటి మిజోరాం, ఇంకోటి తెలంగాణ. "మోదీజీ! మిజోరాంలో మనకు ఒకటి తప్ప ఇంకొక్కటి కూడా లేదు. తెలంగాణాలో మూడు తప్ప మరింకేమీ లేవు..." అని చెప్పారు అమిత్‌షా.

"దీనిని బట్టి మీకేమనిపిస్తోంది నడ్డాజీ?" అని నన్ను ప్రశ్నించారు మోదీజీ.

పెద్దగా ఆలోచించే అవసరం లేకుండానే మోదీజీ ప్రశ్నకు నేను సమాధానం చెప్పగలిగాను.

"ఈ ఐదు రాష్ట్రాల్లోనూ మన గెలుపు పూర్తిగా మీ మీద తప్ప, ఓటర్ల మీద కూడా ఆధారపడి లేదని నేను నమ్ముతున్నాను మోదీజీ..." అన్నాను.

"నా మాట నాకే చెబుతున్నారు..." అని పెద్దపెట్టున నవ్వారు మోదీజీ.

మధ్యప్రదేశ్‌కు 12,600 కోట్ల రూపాయల ప్రాజెక్టులు, రాజస్థాన్‌కు 5,000 కోట్ల ప్రాజెక్టులు, ఛత్తీస్‌గఢ్‌కు 26,000 కోట్ల ప్రాజెక్టులు, తెలంగాణకు 13,500 కోట్ల ప్రాజెక్టులు ఇచ్చేశాక, మిజోరాంకి కొన్ని వేల కోట్ల ప్రాజెక్టులు ఇవ్వబోతున్నాక... ఓటర్లకు ఇవ్వడానికి ఇక ఏమీ మిగిలి లేనప్పుడు కూడా మోదీజీ ఏదో ఒకటి ఇవ్వగలరని మొన్న నిజామాబాద్‌లోనే రుజువైంది.

"కేసీఆర్ ఢిల్లీ వచ్చి మాతో కలుస్తాం అని అడిగితే మేము ఒప్పుకోలేదు..." అనే రహస్యాన్ని బట్టబయలు చేసిన విధంగానే... మిగతా నాలుగు రాష్ట్రాలలో ఎవరెవరు ఎన్డీయేతో చేతులు కలపడానికి ఢిల్లీ వచ్చారో వచ్చే ఎన్నికల ర్యాలీలలో మోదీజీ రట్టు చేయబోతున్నారని నేను ఊహించగలిగాను.

ఓటర్లను వేల కోట్ల ప్రాజెక్టులు మాత్రమే కాదు... రహస్యాలూ ఆకర్షిస్తాయి.

బ్రెయిన్ డెడ్ పార్టీకి సానుభూతి వైద్యం

జనతంత్రం



వర్ధెల్లి మురళి



వచ్చే ఫిబ్రవరి లోగా చంద్రబాబుకు బెయిల్ దొరికే అవకాశం లేదు! ఆయన మీద నమోదైన కేసులు, న్యాయస్థానాల్లో సీఐడీ చేస్తున్న వాదనలు పరిశీలించిన న్యాయ నిపుణులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం ఇది!! ఈ లోగానే ఆయనకు ఊరట లభించాలంటే ఏదైనా అద్భుతం జరగాలి. పూర్వాశ్రమంలో ఇటువంటి అద్భుతాలు చంద్రబాబు వల్ల సాధ్యమయ్యేవి. ఆ మేజిక్ ఇప్పుడేమైపోయిందని బాబు అనుచరగణం కలవర పడిపోతున్నది. కొన్ని దశాబ్దాలుగా ఆయన్ను ఆశీర్వదిస్తూ వస్తున్న 'అద్భుత' దీపాలు కొన్ని ఇప్పుడు వానప్రస్థం స్వీకరించి మిణుకుమిణుకుమంటున్నాయి. కనుక ఇప్పుడు పాత మేజిక్ మీద ఆశ పెట్టుకోవడం కుదరకపోవచ్చు.

చంద్రబాబు మీద నమోదైన నేర శిక్షాస్మృతి సెక్షన్లు ఆరు మాసాల్లోగా బెయిల్ లభించడానికి అనుమతించవు. కనుకనే చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఇదొక అక్రమ కేసుగా వాదిస్తూ విచారణే జరక్కుండా కొట్టివేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోపక్క చంద్రబాబు పార్టీ అనుయాయులు, యెల్లో మీడియా పెద్దలు సమష్టిగా 'అక్రమ కేసు' వాదాన్ని తీవ్రంగా ప్రచారంలో పెట్టే పనిలో నిమగ్న మయ్యారు. తప్పుడు సమాచారాన్ని అందజేసి కొందరు తటస్థుల చేత కూడా తమకు అనుకూలమైన ప్రకటనలు చేయించుకుంటున్నారు. యెల్లో మీడియా తనను తాను తాకట్టు పెట్టుకుంటూనే, బాబు సామాజిక వర్గాన్ని కూడా తాకట్టు పెడుతూ ఒక కృత్రిమ సానుభూతి వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నది.

ఇందుకోసం వారొక తప్పుడు వాదాన్ని తయారుచేసి అందుకు అనుగుణంగా లా పాయింట్లు లాగుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అవినీతి జరిగిందా లేదా అనే చర్చను వారు పక్కనబెట్టి సాంకేతిక అంశాలను ముందుకు తెస్తున్నారు. ఆ సాంకేతిక అంశాలు కూడా న్యాయస్థానాల పరిశీలన ముందు నిలబడేవి కావని న్యాయకోవిదులు ఘంటాపథంగా చెబుతున్నారు. 'అవినీతి నిరోధక చట్టం (సవరణ, 2018) సెక్షన్ 17ఏ ప్రకారం చంద్రబాబును అరెస్టు చేయాలంటే (మాజీ ముఖ్యమంత్రి కనుక) గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఇక్కడ గవర్నర్ అనుమతి తీసుకున్నట్టు రికార్డు చేయలేదు కనుక కేసు కొట్టేయండి' అని కోర్టులో వాదిస్తున్నారు. 'ఒకసారి కేబినెట్ ఆమోదించిన తర్వాత దీన్ని 'స్కామ్' అని ఎట్లా అంటారు? ఇచ్చేయండి బెయిల్' అని అభ్యర్థిస్తున్నారు. ఈ కేసులో దుర్వినియోగమైన డబ్బులు బాబు ఇంటికి చేరినట్టుగా సాక్ష్యాలు చూపలేదు గనుక ఆయన్నెట్లా బాధ్యుడిని చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇటువంటివే మరికొన్ని సాంకేతిక అంశాలను రూపొందించుకొని చంద్రబాబు అరెస్టు అక్రమమనే వాదాన్ని యెల్లో మీడియా ప్రచారం చేస్తున్నది. ఈ రకమైన ప్రచారంతో సానుభూతిని సృష్టించడానికి పడరాని పాట్లు పడుతున్నది. ఇది రాజకీయ దురుద్దేశంతో, కక్షపూరితంగా నమోదైన కేసుగా చిత్రిస్తున్నది. ఒకవేళ రాజకీయ కక్షే నిజమైతే ఆ కక్ష ఏ ప్రభుత్వానిది? కేంద్రానిదా... రాష్ట్రానిదా? ఎందుకంటే ఈ కేసు 2016లోనే వెలుగు చూసింది. వెలుగులోకి తెచ్చింది కేంద్ర ఏజెన్సీలు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వయంగా చంద్రబాబు నాయుడే!

పుణేలో ఉన్న కొన్ని డొల్ల కంపెనీలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కోసం జీఎస్టీకి దరఖాస్తు చేసుకున్నాయి. సరుకులను కొనుగోలు చేసినప్పుడు చెల్లించిన జీఎస్టీలో మళ్లీ వాటిని అమ్మేసినప్పుడు కంపెనీలు పన్ను రాయితీని క్లెయిమ్ చేస్తాయి. సరుకులను సొంతానికి కాకుండా వ్యాపారం కోసం ఉపయోగించడం వల్ల ఈ రాయితీ లభిస్తుంది. ఎన్నడూ లక్ష రూపాయల వ్యాపారం కూడా చేసినట్టు చూపని కంపెనీలు హఠాత్తుగా భారీ ప్రమాణంలో ట్యాక్స్ ఇన్‌పుట్‌ను క్లెయిమ్ చేయడంతో జీఎస్టీ అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో డొల్ల కంపెనీల బాగోతం బయటపడింది.

సరుకులు ఎక్కడా కొనకుండానే, అమ్మకుండానే బోగస్ ఇన్‌వాయిస్ (బిల్లులు)లు సృష్టించారని తేలిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోసం సరుకులు సరఫరా చేస్తున్నట్టుగా బోగస్ ఇన్‌వాయిస్‌లు ఉండడంతో ఆ రాష్ట్ర ప్రజాధనాన్ని ఎవరో ఈ రకంగా కొల్లగొడుతున్నారని జీఎస్టీ అధికారులకు అర్థమైంది. దాంతో వారు ఈ సమాచారాన్ని రాష్ట్ర సీఐడీకి అందజేశారు. ముఖ్యమంత్రిగా అప్పుడు చంద్రబాబు ఉన్న కారణంగా కేసు ముందుకు కదల్లేదు. తర్వాత ఈ వ్యవహారంలోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ) అధికారులు కూడా ప్రవేశించి కేసులు నమోదు చేశారు. ఈడీ, జీఎస్టీ అధికారులు కేంద్ర ప్రభుత్వంలో భాగం కనుక, ఈ కేసును వెలికితీసింది వారే కనుక రాజకీయ కక్ష, దురుద్దేశం నిజమైతే కేంద్రానికే ఉండాలి కదా!

ఇక అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ సంగతి చూద్దాం. దీని ప్రకారం నిందితుడి అరెస్టుకు అతని నియామక అధికారి (అపాయింటింగ్ అథారిటీ) ముందస్తు అనుమతి అవసరమని ఈ సెక్షన్ చెబుతున్నది. ముఖ్యమంత్రిగా నియమించేది గవర్నర్ కనుక ఆయన అనుమతి ముందస్తుగా ఉండాలని తెలుగుదేశం వాదన. అరెస్టయినప్పుడు ఆయన ముఖ్యమంత్రి కాదు, ఎమ్మెల్యే మాత్రమే అనే సంగతిని కూడా పక్కనపెడదాం. సీఐడీ చేస్తున్న వాదన ప్రకారం ఈ సెక్షన్ అమల్లోకి

సీమెన్స్‌తో ఒప్పందాన్ని కేబినెట్ ఆమోదించిన తర్వాత అమలులో జరిగిన దుర్వినియోగానికి ముఖ్యమంత్రి ఎలా బాధ్యత వహిస్తారు అనేది యెల్లో మీడియా అమాయకంగా అడుగుతున్న మరో ప్రశ్న. ఒకవేళ కేబినెట్ భేటీ జరిగిందనే అనుకున్నా అనంతరం వెలువడిన జీవోలో ఏమున్నది? ఈ స్కీమ్‌కు సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులను ఉచితంగా కేటాయించడానికి ముందుకు వచ్చింది. మిగిలిన పదిశాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే చాలని ఉన్నది. కేబినెట్ జరిగి ఉంటే ఇదే విషయాన్ని చెప్పి ఉంటారు. కానీ ఆచరణలో ఒప్పందం ఎలా జరిగింది? ఎవరి మధ్యన జరిగింది?

రాష్ట్ర ప్రభుత్వం తరఫున నైపుణ్యాభివృద్ధి సంస్థ సదరు ఒప్పందంలో భాగస్వామి కావాలి. కానీ, కాలేదు. డిజైన్‌టెక్ అనే ఓ ప్రైవేట్ సంస్థ భాగస్వామిగా మారింది. సీమెన్స్ సంస్థ తరఫున ఆ సంస్థ ఇండియా అధికారి దొంగ సంతకంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అది అతని రెగ్యులర్ సంతకం కాదనీ, దొంగ సంతకమనీ నిరూపణ అయింది. అతని ఉద్యోగం ఊడింది. ఒప్పందంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ అధికారిక ప్రకటన చేసింది. న్యాయస్థానానికి కూడా లిఖిత పూర్వకంగా చెప్పింది. ఇదంతా బోగస్ వ్యవహారమనీ, దురుద్దేశపూర్వకంగా జరిగిందని చెప్పడానికి ఇవన్నీ సరైన కారణాలు కావా?

వచ్చింది 2018లో! కానీ ఈ స్కామ్ జరిగిందీ, జీఎస్టీ, ఈడీలు కేసులు నమోదు చేసిందీ అంతకుముందే కనుక గవర్నర్ అనుమతి అవసరం లేదు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన మరో విశేషమేమిటంటే చంద్రబాబు మీద కేవలం అవినీతి నిరోధక చట్టం కేసులు మాత్రమే నమోదు కాలేదు. సీఆర్‌పీసీ సెక్షన్లయిన 120బి, 107, 409 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కూడా కేసులు పెట్టారు. అవినీతి నిరోధక చట్టానికి జరిగిన సవరణ సీఆర్‌పీసీ సెక్షన్ల కింది జరిగిన అరెస్టులకు కూడా వర్తిస్తుందా? అందుకు ఏదైనా ఉదాహరణ ఉన్నదా? 409 రెడ్ విత్ 34 కేసులో ఆరు నెలల వరకు బెయిల్ రావడం కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సీమెన్స్‌తో ఒప్పందాన్ని కేబినెట్ ఆమోదించిన తర్వాత అమలులో జరిగిన దుర్వినియోగానికి ముఖ్యమంత్రి ఎలా బాధ్యత వహిస్తారు అనేది యెల్లో మీడియా అమాయకంగా అడుగుతున్న మరో ప్రశ్న. ఒకవేళ కేబినెట్ భేటీ జరిగిందనే అనుకున్నా అనంతరం వెలువడిన జీవోలో ఏమున్నది? ఈ స్కీమ్‌కు సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులను ఉచితంగా కేటాయించడానికి ముందుకు వచ్చింది. మిగిలిన పదిశాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే చాలని ఉన్నది. కేబినెట్ జరిగి ఉంటే ఇదే విషయాన్ని చెప్పి ఉంటారు. కానీ ఆచరణలో ఒప్పందం ఎలా జరిగింది? ఎవరి మధ్యన జరిగింది?

రాష్ట్ర ప్రభుత్వం తరఫున నైపుణ్యాభివృద్ధి సంస్థ సదరు ఒప్పందంలో భాగస్వామి కావాలి. కానీ, కాలేదు. డిజైన్‌టెక్ అనే ఓ ప్రైవేట్ సంస్థ భాగస్వామిగా మారింది. సీమెన్స్ సంస్థ తరఫున ఆ సంస్థ ఇండియా అధికారి దొంగసంతకంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అది అతని రెగ్యులర్ సంతకం కాదనీ, దొంగ సంతకమనీ నిరూపణయింది. అతని ఉద్యోగం ఊడింది. ఒప్పందంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ అధికారిక ప్రకటన చేసింది. న్యాయస్థానానికి కూడా లిఖిత పూర్వకంగా చెప్పింది. ఇదంతా బోగస్ వ్యవహారమనీ, దురుద్దేశ పూర్వకంగా జరిగిందని చెప్పడానికి ఇవన్నీ సరైన కారణాలు కావా?

మరో కీలకమైన విషయం – జీవోలో చెప్పినదాని ప్రకారం సీమెన్స్ సంస్థ 90 శాతం నిధుల్లో ఒక్క పైసా విడుదల చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం వాటా మొత్తం రూ.371 కోట్లను విడుదల చేయడం! దాన్ని డిజైన్‌టెక్ అనే ప్రైవేట్ సంస్థ ఖాతాకు మళ్లించడం! ఇలా విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు నోట్ ఫైల్‌లో రాసినా చంద్రబాబు పట్టుబట్టి విడుదల చేయించారు. ఈ మేరకు నోట్‌ఫైళ్లలో ఆయన ఆదేశాలు జారీ చేశారు. 13 చోట్ల సీఎం సంతకాలు చేశారని సీఐడీ ఆధారాలు చూపెట్టింది. స్కామ్ పూర్తిగా సీఎం కనుసన్నల్లో దురుద్దేశ పూర్వకంగా జరిగిందనడానికి ఇంతకంటే రుజువులేం కావాలి?

ఈ మొత్తం వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన గంటా సుబ్బారావు అనే వ్యక్తి, డిజైన్‌టెక్ కంపెనీ అధిపతి, సీమెన్స్ ఇండియాలోని ఉద్యోగి– ఈ ముగ్గురితో కలిసి కుట్రపూరితంగా నాటి ముఖ్య మంత్రి పథక రచన చేశారనడానికి కావల్సిన ఆధారాలు ఇవన్నీ! ఇక్కడే సీఆర్‌పీసీ సెక్షన్ 409, సెక్షన్ 34 వర్తిస్తున్నాయి. సెక్షన్ 409 అంటే బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్! నమ్మక ద్రోహానికి పాల్పడటం! ప్రజలు నమ్మకంతో అప్పగించిన ముఖ్యమంత్రి పదవిని స్వార్థ ప్రయోజనాల కోసం గానీ, ఇతరుల ప్రయోజనాల కోసం గానీ వినియోగించడం!! ప్రజాధనానికి పరిరక్షకుడిగా ఆయన్ను ప్రజలు నియమించారు. ఆ నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఆ ధనాన్ని షెల్ కంపెనీలకు తరలించడంలో కీలకపాత్రను పోషించారు. సెక్షన్ 34 – ఈ స్కామ్ వెనుకనున్న దురుద్దేశానికి వర్తిస్తుంది. ఈ రెండు సెక్షన్లూ రుజువైతే కనీసం పదేళ్ల జైలుశిక్ష పడుతుంది.

'సదరు స్కామ్ డబ్బులు బాబు జేబులోకే వెళ్లాయనేందుకు రుజువేమిటి? అది రుజువు చేయకుండా ఎలా కేసు పెడతారు? ఎలా అరెస్టు చేస్తార'ని మరో ప్రశ్నను టీడీపీ వారూ, యెల్లో మీడియా వారూ సంధిస్తున్నారు. బాబు మీద నమోదు చేసిన సీఆర్‌పీసీ 120బి, 107 సెక్షన్లు ఏం చెబుతున్నాయి? కుట్రలో భాగస్వామి అయితే చాలు సెక్షన్ 120బి వర్తిస్తుంది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం ఉండనక్కర్లేదు. అందుకు అనుమానం, ఆస్కారం కలిగించే పరిస్థితులుంటే చాలు. అంటే సర్కమ్‌స్టెన్షియల్ ఎవిడెన్స్ చాలు. 107 అంటే ఒక నేరాన్ని ప్రోత్సహించడం. కనుక చంద్రబాబు జేబులోకి డబ్బులు వెళ్లాయా లేదా అనే విషయాన్ని అరెస్టుకు ముందో, రిమాండ్‌కు ముందో నిర్ధారణ చేయవలసిన అవసరం లేదు. ఇక్కడో ఉదాహరణ చెప్పుకోవచ్చు. 'ఏ' అనే వ్యక్తి కుట్రపూరితంగా, దురుద్దేశంతో 'బి' అనే వ్యక్తిని కిడ్నాప్ చేశాడు. 'బి' బంధువులకు ఫోన్ చేసి 'సి'అనే వ్యక్తికి డబ్బు చేరిస్తే విడుదల చేస్తానని చెప్పాడు. డబ్బు 'సి' చేతికి చేరుతుంది. డబ్బు నా చేతికి రాలేదు కనుక నేను నేరస్థుడిని కాదని 'ఏ' అనేవాడు బుకాయిస్తే చెల్లుతుందా?

షెల్ కంపెనీల ద్వారా డబ్బును చంద్రబాబు గూటికి చేర్చడంలో ఆయన పీఏ శ్రీనివాస్ ముఖ్య భూమికను పోషించాడని సీఐడీ భావిస్తున్నది. అతడికి నోటీసులు ఇవ్వగానే దేశం విడిచి పారిపోయాడు. కుట్ర జరిగిందనడానికి ఇది మరో బలమైన సాక్ష్యం. రెండు రోజుల క్రితం ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ తరఫున వాదించిన ఏఏజీ సుధాకర్‌రెడ్డి ఓ కొత్త విషయాన్ని చెప్పారు. స్కామ్ సొమ్ములో ఓ 27 కోట్లు విరాళంగా తెలుగుదేశం పార్టీ ఖాతాకు చేరాయని ఆయన చెప్పారు. 27 కోట్ల విరాళం విషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా నిర్ధారించారు. ఈ ఆరోపణకు సీఐడీ

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఒక జీవచ్ఛవంలా తయారైంది. రక్త ప్రసరణ దాదాపుగా నిలిచిపోయింది. సొంత పుత్రుడు, బావమరిది పార్టీని ఉద్ధరిస్తారనే నమ్మకాన్ని చంద్రబాబు కూడా కోల్పోయి ఉంటారు. వైసీపీ వారు దత్తపుత్రుడిగా అభివర్ణించే పవన్ కల్యాణ్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు పిలిపించుకున్నారు. చెవిలో ఏం చెప్పారో తెలియదు కానీ, బయటికి రాగానే పవన్ కల్యాణ్ ఆవేశంతో మాట్లాడారు. తెలుగుదేశం – జనసేన పార్టీలు వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ఆయన పక్కన మామాఅల్లుళ్ళు చేతులు కట్టుకొని అనుచరుల్లా నిలబడిపోయారు. తాను 'అలగా జనం'గా పరిగణించే వారి సమక్షంలో బాలయ్య బ్రాండ్ బ్లడ్డూ, బ్రీడూ తల వంచుకొని నిలబడాల్సి వచ్చింది.

ఆ పూటకు అలా గడిచిపోయింది. ఆ తర్వాత మూడు వారాలపాటు చినబాబూ లేడు, పవన్‌బాబూ లేడు. బాలయ్య బాబు పెద్దగా సందడి చేయలేదు. చినబాబు ఢిల్లీలో దాక్కు న్నారు. అరెస్టు భయంతో పారిపోయాడని పార్టీ శ్రేణులు భావించాయి. వారి నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతిన్నది. పార్టీలో కదలిక కోసం నానాతంటాలు పడవలసి వస్తున్నది.

వారు ఆధారాలు చూపగలిగితే తెలుగుదేశం పార్టీ ఆస్తులనూ, ఖాతాలనూ సీజ్ చేసే పరిస్థితి రావచ్చు. అదే జరిగితే మూలిగే నక్కపై తాటిపండు పడినట్టే!

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఒక జీవచ్ఛవంలా తయారైంది. రక్తప్రసరణ దాదాపుగా నిలిచిపోయింది. సొంత పుత్రుడు, బావమరిది పార్టీని ఉద్ధరిస్తారనే నమ్మకాన్ని చంద్రబాబు కూడా కోల్పోయి ఉంటారు. వైసీపీ వారు దత్తపుత్రుడిగా అభివర్ణించే పవన్ కల్యాణ్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు పిలిపించుకున్నారు. చెవిలో ఏం చెప్పారో తెలియదు కానీ, బయటికి రాగానే పవన్ కల్యాణ్ ఆవేశంతో మాట్లాడారు. తెలుగుదేశం – జనసేన పార్టీలు వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ఆయన పక్కన మామాఅల్లుళ్ళు చేతులు కట్టుకొని అనుచరుల్లా నిలబడిపోయారు. తాను 'అలగా జనం'గా పరిగణించే వారి సమక్షంలో బాలయ్య బ్రాండ్ బ్లడ్డూ, బ్రీడూ తల వంచుకొని నిలబడాల్సి వచ్చింది.

ఆ పూటకు అలా గడిచిపోయింది. తర్వాత మూడు వారాలపాటు చినబాబూ లేడు, పవన్‌బాబూ లేడు. బాలయ్య బాబు పెద్దగా సందడి చేయలేదు. చినబాబు ఢిల్లీలో దాక్కున్నారు. అరెస్టు భయంతో పారిపోయాడని పార్టీ శ్రేణులు భావించాయి. మొన్న రాష్ట్ర సీఎం ఢిల్లీకి వెళ్ళగానే చినబాబు రాజమండ్రికి తిరిగొచ్చారు. తీరా సీఎం రాష్ట్రానికి రాగానే, చినబాబు భార్యను తీసుకొని మళ్ళీ ఢిల్లీ బాట పట్టాడు. కార్యకర్తల నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతిన్నది. పార్టీలో కదలిక కోసం నానాతంటాలు పడవలసి వస్తున్నది. చివరికి బాబు సొంత సామాజిక వర్గంలో భావోద్వేగాలను రెచ్చగొట్టి నిరసన కార్యక్రమాలను మమ అనిపిస్తున్నారు. వారం రోజుల కిందనే మళ్లీ రంగప్రవేశం చేసిన పవన్ కల్యాణ్ కూడా తెలుగుదేశం పరిస్థితిపై బహిరంగ వ్యాఖ్యానాలు చేయవలసి వచ్చింది. ఆ పార్టీ పూర్తిగా బలహీన పడినందువల్లనే తాము యువరక్తం ఎక్కించవలసి వస్తున్నదని ఆయన సభలోనే ప్రకటించారు.

తెలుగుదేశం – జనసేన పార్టీలు ఉమ్మడిగా కృషిచేసినా పవన్ సభలు గతంతో పోలిస్తే బోసిపోతున్నాయి. రెండు పార్టీల పొత్తు పట్ల జనసేనలో వ్యతిరేకత, తెలుగుదేశం శ్రేణుల మనోధైర్యం దెబ్బతినడం ఈ పరిస్థితికి కారణం. జనస్పందన తగ్గడంతో పవన్ కూడా షాక్ తిన్నట్లున్నారు. గతంలో పదిహేను రోజులకో, నెలకో మాట మార్చేవాడు. ఇప్పుడు ప్రతిరోజూ మారుస్తున్నారు. ఒకరోజు ఎన్డీఏ నుంచి బయటకొచ్చానంటాడు. ఆ మరుసటి రోజే ఎన్డీఏలోనే ఉన్నానని అంటాడు. అవినీతి రెండు రకాలని ఓ కొత్త భాష్యాన్ని చెప్పుకొస్తున్నారు. చంద్రబాబు చేసిన అవినీతి 'ఆమోదయోగ్యమైన'దేనట! ఇదెక్కడి దౌర్భాగ్యం! పైగా ప్రజలే అవినీతిపరులంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఆయన పూర్తిగా బ్యాలెన్స్ కోల్పోయారు. జనం నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు ఆశలు పెట్టుకున్న అస్త్రాలన్నీ ఇలా విఫలమవుతున్నాయి. ఈ స్థితిలో ఆయన ఇంకో ఆరు నెలలు జైల్లోనే ఉంటే పార్టీ బ్రెయిన్ డెడ్ ఖాయం. బయటకు వచ్చి అవయవదానం చేయవలసిందే! ఈ స్థితిని తప్పించడానికి యెల్లో మీడియా తెగ ప్రయాస పడుతున్నది. 'ప్రజాస్వామ్యం కోసం' అనే ముసుగులో మేధావుల పేరుతో కావలసినవారిని కొందరిని సమీకరించి ఒక సానుభూతి వాతావరణాన్ని సృష్టించడానికి తంటాలు పడుతున్నారు. అధినేత అవినీతికి ఇప్పుడు పార్టీ మూల్యం చెల్లిస్తున్నది. అది పతనోన్ముఖాన వేగంగా జారిపోతున్నది. ఎలాగోలా బతికించాలని యెల్లో మీడియా తాపత్రయం. 'అక్క ఆరాటమే గాని బావ బతికేట్టు లేదు!'

vardhelli1959@gmail.com

జనుల కోసం తపించాడతడు!

సందర్భం



ఎం.డి. మునీర్

పుట్టిన ప్రతి జీవి జీవితం బాగుండాలని తపించారాయన. జీవించే హక్కు కోసం తన చివరి ఊపిరి వరకు ఆయన పోరాడారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించారాయన. చట్టాల ఉల్లంఘనను నిలదీశారు. ఆయనే కె. బాలగోపాల్! హింస ఏదైనా, ఎవరు చేసినా ఈ హక్కుల నేత, ప్రజల న్యాయవాది వ్యతిరేకించే వారు. అది రాజ్య హింస అయినా, ప్రైవేట్ వ్యక్తుల హింస అయినా దేనినీ సహించే వారు కాదు. అభివృద్ధి పథకాల పేరిట ప్రజల జీవించే హక్కును ప్రభుత్వాలు హరిస్తున్నాయనీ; నేల, నీరు, అడవులు వంటి ప్రకృతి ఇచ్చిన సంపదను కోట్లాదిమంది జీవనోపాధికి ఉపయోగించాలనీ సెజ్‌లను వ్యతిరేకిస్తూ పోరాటం చేశారు. భూ నిర్వాసితుల పక్షాన నిలబడ్డారు.

బాలగోపాల్ సర్ 2009 అక్టోబర్ 8న ఆకస్మికంగా హైదరాబాద్‌లో మరణించారు. ప్రముఖ జర్నలిస్ట్, ఆయన సహచరి వసంత లక్ష్మి, వారి కొడుకు కళ్ళ ముందే ఆయన ఊపిరి వదిలారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల నిజమైన ఉద్యమ గొంతు మూగబోయింది. సర్ ఇలా అకస్మాత్తుగా వెళ్ళిపోయి 14 ఏండ్లు దాటుతున్నా ఆయన ఎక్కడో ఇంకా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆయన చివరిసారిగా మంచిర్యాలలోని మా ఇంటికి భార్యాకుమారులతో కలిసి వచ్చి భోజనం చేసి శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించి నిర్వాసితులతో మాట్లాడిన విషయాలూ, ఆయన నింపిన మనోధైర్యం నేటికీ గుర్తుకు వస్తున్నాయి. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన మరణవార్త కలిచి వేసింది. హడావిడిగా మిత్రులతో హైదరాబాద్ వెళ్లి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నాను. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలనీ, పోలీసుల మీద హత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలనీ, సంఘటనా స్థలానికి వెళ్లి నిజనిర్ధారణ చేసి మరీ డిమాండ్ చేసే వారు బాలగోపాల్. లాయర్‌గా ప్రాక్టీస్ మొదలు పెట్టిన తర్వాత చాలా కేసులను ఆయన తీసుకుని వాదించారు. రాజ్యానికి ఆయనంటే గుబులు, ఆందోళన. అందుకే ఆయన్ని భౌతిక దాడులతో భయపెట్టే ప్రయత్నం చేశారు. కొత్తగూడెంలో పోలీసులు



బాల గోపాల్ మీద ప్రీ ప్లాన్డ్‌గా దాడి చేసి కొట్టి, గాయపరిచి చచ్చిపోయాడని భావించి కాలువలో పడేసి వెళ్లిపోయారు. అప్పుడు ఆయనను చూసిన కొందరు అభిమానులు కాపాడారు.

కష్టపడే వారికి కనీస వేతనాల కోసం, ఆదివాసీల హక్కుల కోసం; బొగ్గు గని కార్మికుల, కాంట్రాక్టు కార్మికుల జీవితాల మెరుగు కోసం; కాలుష్య రహిత సమాజం కోసం... మొత్తంగా మానవ హక్కుల కోసం ఆయన పోరాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగినపుడు బాలగోపాల్ వెంట వచ్చిన టీమ్‌తో నేనూ వెళ్లే వాడిని. ఆయన, నేను కలిసి కాగజ్ నగర్ నుంచి ఒక సంఘటనలో ఒకే సైకిల్ మీద నిజ నిర్ధారణకు వెళ్లిన సందర్భం ఇంకా గుర్తుంది. ఓపెన్ కాస్ట్ గనులు సృష్టించే విధ్వంసం మీద పోరాట సందర్భం అది. ఆ గనులు వద్దని ప్రజలు చేసిన ఉద్యమంలో బాలగోపాల్ పాత్ర కీలకంగా ఉండేది.


లాకప్ డెత్‌లకు వ్యతిరేకంగా కూడా ఆయన కేసులు వేశారు. రాజ్యంతో పోరాడారు. కార్మికుల న్యాయమైన సమ్మె పోరాటాలను కూడా సమర్థించి వాటిల్లో పాల్గొని మద్దతు ఇచ్చేవారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని ఆకాంక్షించే వారు. ఉద్యమానికి మద్దతు కూడా ఇచ్చారు. ఆయన లేని లోటు ఆయన మరణించి 14 ఏండ్లు దాటినా ఇంకా భర్తీ చేసేవారు రాలేదు. బాల గోపాల్ లాంటి మనుషుల కొరత ఈ సమాజానికి ఉంది. ప్రశ్నించే వారి మీద ఉపా లాంటి కేసులు పెరిగాయి. మానవ హక్కులు ఎక్కడికక్కడ హరించబడుతున్నాయి. దేశంలో ఒక వర్గానికి చెందిన వారిని కులం, మతం పేరు ఎమీద తీవ్ర అణచివేతకు గురి చేస్తున్నారు. లాకప్ లలో పెట్టి, పబ్లిక్‌గా చిత్రహింసలకు గురి చేస్తున్నారు. విద్వేషాలను రెచ్చగొట్టే ఉపన్యాసాలు, పెరుగుతున్న అమానవీయ చర్యలు, తద్వారా అధికారం నిలబెట్టుకునే ప్రయత్నం, దేశంలో పెరిగిన నిరుద్యోగం, అసమానతలు, ఆకలి, అధిక ధరలు, ఆర్థిక ఇబ్బందులు, దేశ ప్రజలను విడదీసి పాలించే విధానం... ఇన్నింటి మధ్య నలుగుతున్న జనం హక్కుల గురించి ప్రశ్నించేవారు కరవవుతున్నారు. బాల గోపాల్ మళ్ళీ రావడం కుదరదు. కాబట్టి బుద్ధిజీవులే అందుకు సిద్ధం కావాలి. అందుకు సమయం ఇదే, ఛలో ఛలో కాలం పిలుస్తోంది. బాల గోపాల్ పిలుపు ఎక్కడి నుంచో వినిపిస్తున్నట్లుంది. ఛలో ఛలో కహీఁన్ దేర్ న హోజాయే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు | 99518 65223

(నేడు హైదరాబాద్ ఎస్వీకేలో బాలగోపాల్ 14వ సంస్మరణ సభ)

సందేహం వద్దు!

సందేహంతో మొదలుపెట్టే ఏ పని కూడా సఫలం చెందే అవకాశం ఉండదు. 'చంచలాత్మకృతము సంకల్ప రహితంబునైన జపము లెల్ల హాని బొందు' అని కొఱవి గోపరాజు తన రచనయైన 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యంలో ఈ భావాన్నే సూత్రీకరించినట్లుగా చెప్పాడు. 'నిలకడ లేని స్వభావం కలవాడు మనసులో గట్టి పట్టుదల లేకుండా చేసే ప్రయత్నాలు విఫలమవుతాయి' అని ఆ మాటల అర్థం. అందువలన, ఏ ప్రయత్నానికైనా స్థిర చిత్తం, దృఢ సంకల్పం అనే రెండు లక్షణాలు ముఖ్యం. ఈ రెండూ ఒక మనిషిలో ఉండాలంటే ఆ మనిషికి తన మీద తనకు, అలాగే తాను చేసే ప్రయత్నం యొక్క ఔన్నత్యం మీద ప్రగాఢమైన విశ్వాసం ఉండడం ముఖ్యం. అందుకే దేవుడు, మంత్రం, ఔషధం, తీర్థం, నిత్యం పాటించే ధర్మ సంబంధమైన విధులు వంటివాటి యెడల ఒక వ్యక్తి భావన ఎంత నమ్మకంతో కూడినదై ఉంటుందో, వాటిని ఆచరించడంలో ఆ వ్యక్తికి సమకూరే ఫలం కూడా అంత సంతృప్తికరంగా ఉంటుంది అని పెద్దలు చెబుతారు. కాబట్టి, చేసే పని ఏదైనా ఆ పని మంచి చెడులను గురించి ముందుగానే క్షుణ్ణంగా ఆలోచన చేసుకుని, మంచిదని నిర్ణయించుకున్న పనిని సందిగ్ధం లేని చిత్తంతో చేయడం ముఖ్యం. సందేహం లేని కర్మాచరణమే సత్ఫలితానికి మూలం.



– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

సత్యదేవుని ప్రదక్షిణ ప్రత్యేక దర్శన టికెట్ రూ.300

ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుని ప్రదక్షిణ ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ధర నిర్ణయించినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ప్రకటించారు. ఈ నెల 15 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.200 టికెట్‌పై ప్రదక్షిణ దర్శనానికి అనుమతిస్తున్నారు. ఇక నుంచి రూ.200 టికెట్‌పై ప్రత్యేక దర్శనానికి మాత్రమే అనుమతిస్తామని.. అంతరాలయం లోపలకు అనుమతించరని స్పష్టం చేశారు. ఎప్పటిలాగానే ఉచిత దర్శనం కొనసాగుతుందని తెలిపారు. దసరా వేడుకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి స్వామివారి ప్రధానాలయంలోని ప్రదక్షిణ దర్శన మార్గంలో నాలుగు మూలలా బంగారు కల్పవృక్షం, బంగారు కామధేనువు, బంగారు హుండీ, బంగారు గంధపు గిన్నెలను ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ప్రధానాలయంలో ప్రదక్షిణ చేస్తూ వీటిని దర్శించిన అనంతరం సత్యదేవుని దర్శించే అవకాశం కల్పించనున్నారు. సత్యదేవునికి అభిషేకం చేసిన గంధం ఈ గిన్నెలో వేస్తారు. భక్తులు వీటిని నుదిటిన ధరించే అవకాశం కల్పించనున్నారు.

ఆశా వర్కర్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఆమె కుమార్తెకు ఉద్యోగాన్ని ప్రకటించిన ప్రభుత్వం



కృపమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : విధి నిర్వహణలో అనారోగ్యంతో మృతి చెందిన ఆశా వర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద విధి నిర్వహణలో ఉన్న కృపమ్మకు గుండె నొప్పి వచ్చింది. వెంటనే వైద్య సేవలు అందించినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.పది లక్షలతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు.. మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆమె కుమార్తెకు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలోనే కృపమ్మ కుటుంబానికి ఇంటి స్థలం కూడా మంజూరైంది. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కృపమ్మ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఇచ్చినట్టు ఎమ్మెల్సీ చెప్పారు.

వానరాల వధ

• తెలంగాణ

- బావిలో 74 కోతుల కళేబరాలు
- సిద్దిపేట జిల్లా మునిగడపలో కలకలం



జగదేవ్‌పూర్ (గజ్వేల్): సిద్దిపేట జిల్లా మునిగడప గ్రామంలోని ఓ వ్యవసాయ భూమిలో కుప్పలుగా కోతుల కళేబరాలు పడిఉండటం కలకలం రేపింది. శనివారం ఉదయం అటు వైపు వెళ్తున్న రైతులు.. 74 కోతుల కళేబరాలు చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. అటవీశాఖ రేంజ్ అధికారి కిరణ్, సెక్షన్ అధికారి షెకావత్ వచ్చి కళేబరాలను పరిశీలించారు. ఒకేసారి పెద్దఎత్తున కోతులు చనిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోతులకు విషం, విద్యుత్‌షాక్ ఇచ్చి చంపారా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు. పశువైద్యాధికారి రాకేష్ ఆధ్వర్యంలో కోతులకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే గుంత తీసి పాతిపెట్టారు.

కలుషిత ఆహారం తిని 70 మందికి అస్వస్థత

ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం మెండపల్లి గ్రామంలో కలుషిత ఆహారం తిని సుమారు 70 మంది అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలో కలకలం సృష్టించిన ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 5న గ్రామానికి చెందిన ముండే బలిరామ్ ఇంట్లో పెద్దల పేర్లతో పితృపక్ష పూజలు నిర్వహించి అన్నం, పప్పు, బూరెలతో కూడిన భోజనం ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి సాయంత్రం 5గంటల తర్వాత భోజనం చేసిన వారిలో కొందరు శుక్రవారం సాయంత్రం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిని మండల కేంద్రంలోని పలు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. మరో పక్క శనివారం తెల్లవారు జాము నుంచి ఒక్కొక్కరిగా సుమారు 70 మంది అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉన్న కసరే రాధాబాయి, ముండే సుగంధ, సింధుబాయి, బలిరామ్, అంజలి, యమున బాయి, మానే సునిత, ఊర్మిళ, ముండే జ్యోతిలను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

విశాఖ అభివృద్ధి మరింత వేగవంతం

నీతి ఆయోగ్ గ్రోత్ హబ్‌లో చోటు



- దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక నగరంగా గుర్తింపు
- దేశంలో ఎంపికైన మరో మూడు నగరాలు
- ఈ నేపథ్యంలోనే ఆర్థిక వృద్ధికి రోడ్ మ్యాప్
- ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభివృద్ధికి ఉన్న అవకాశాలపై నీతి ఆయోగ్ ప్రత్యేక అధ్యయనం
- అందుకనుగుణంగా ప్రత్యేక రాయితీలు ఇచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: దేశంలోనే అత్యంత శరవేగంగా వృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన విశాఖపట్నంలో అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుంది. కొద్దిరోజుల క్రితం దేశవ్యాప్తంగా నీతి ఆయోగ్ ఎంపిక చేసిన గ్రోత్ హబ్‌లో విశాఖ స్థానం దక్కించుకుంది. దేశం మొత్తం మీద నాలుగు నగరాలను నీతి ఆయోగ్ ఎంపిక చేయగా అందులో విశాఖ ఒకటి కావడం విశేషం. అందులోనూ దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక నగరంగా విశాఖ మరో ప్రత్యేకతను నమోదు చేసింది. విశాఖ కాకుండా ముంబై, సూరత్, వారణాసి కూడా ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. విశాఖ నగరాభివృద్ధికి ఉన్న అవకాశాలపై నీతి ఆయోగ్ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. ఈ క్రమంలో ఆయా రంగాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు ఇచ్చే విధంగా అభివృద్ధి ప్రణాళిక సిద్ధం కానున్నట్టు తెలుస్తోంది.

విశాఖ అభివృద్ధికి విస్తృత అవకాశాలు..

విశాఖ అభివృద్ధికి అపార అవకాశాలున్నాయి. నౌకాశ్రయం, విమానాశ్రయం, రహదారుల అనుసంధానం ఇలా మూడు ఉండటంతో పాటు తూర్పు నావికాదళానికి ప్రధాన కేంద్రంగా ఇప్పటికే నగరం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అంతేకాకుండా పలు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేంద్రంగా భాసిల్లుతోంది. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ మొదటగా ఈ ప్రాంతానికి సంబంధించి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలు, అభివృద్ధికి అవకాశం ఉన్న అంశాలను అధ్యయనం చేయనుందని తెలుస్తోంది.

నాలుగు కీలక అంశాలపై..

విశాఖ నగరాభివృద్ధిపై ఎస్‌డబ్ల్యూవోటీ అనాలసిస్ అంటే... స్ట్రెంత్ (బలం), వీక్‌నెస్ (బలహీనతలు), ఆపర్చునిటీస్ (అవకాశాలు), థ్రెట్స్ (ఇబ్బందులు).. ఈ నాలుగు అంశాలపై నీతి ఆయోగ్ బృందం అధ్యయనం చేయనుంది. ఇందుకనుగుణంగా ఆర్థిక వృద్ధికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుని.. వీటిని సాధించేందుకు ఒక పాలసీని రూపొందించనుందని సమాచారం. విశాఖ నగరంలో ప్రధానంగా ఎగుమతి ఆధారిత పరిశ్రమలతోపాటు ఫార్మా, ఆటో, పెట్రోకెమికల్స్, టెక్స్‌టైల్ రంగాల్లో అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాలతో పాటు ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు కూడా నగరం మంచి ఎంపిక అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ బృందం నిర్ణయాలను అమలు చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీలో జీవీఎంసీ కమిషనర్‌లు కీలకంగా వ్యవహరించనున్నారు.

ప్రత్యేక రాయితీలకు అవకాశం..

వాస్తవానికి నీతి ఆయోగ్ బృందం ఇప్పటికే తన పనిని ప్రారంభించింది. ఇప్పటికే ఒక దఫా విశాఖలో పర్యటించింది. ప్రధానంగా విశాఖ నగర అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌తో పాటు చేపడుతున్న పలు పనులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇప్పటికే ఉన్న పలు పరిశ్రమలతో పాటు నగర భౌగోళిక విస్తీర్ణం, అభివృద్ధికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసినట్టు సమాచారం. గ్రోత్ హబ్‌లో ప్రధానంగా నగరంలో ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల అభివృద్ధికి అవకాశం ఉందో.. అందుకనుగుణంగా ఆయా రంగాలకు ప్రత్యేక రాయితీలు ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే విశాఖ అభివృద్ధికి ప్రత్యేక రోడ్ మ్యాప్ సిద్ధమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రత్యేక రాయితీలు మంజూరు చేస్తే నగరంలో అన్ని రంగాలు ఇతోధికంగా అభివృద్ధి చెందుతాయని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

- ఆఫ్రికా దేశాల బృందం ప్రశంస
- యగ్నిశెట్టిపల్లి వద్ద పంటల పరిశీలన



యగ్నిశెట్టిపల్లి వద్ద రైతులతో మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధుల బృందం

చిలమత్తూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగు చాలా బాగుందని ఆఫ్రికా దేశాల ప్రతినిధుల బృందం ప్రశంసించింది. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని యగ్నిశెట్టిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు బృందం శనివారం పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయకుమార్ ఆధ్వర్యంలో సెనగల్, ట్యునీషియా, మడగాస్కర్, జాంబియా, బెనిన్, మలావాయి తదితర ఆఫ్రికా దేశాల నుంచి 27 మంది ప్రతినిధులు యగ్నిశెట్టిపల్లిలోని పంట పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తున్న నందీశ్వర, నరసింహప్ప అనే రైతులకు చెందిన వేరుశనగ, నవీన్‌కు చెందిన పత్తి పంటలను పరిశీలించారు. పంటల యాజమాన్యం, చీడపీడల నియంత్రణ, ఘన జీవామృతం, బీజామృతం తయారీ, 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పిచికారీ విధానం తదితర వాటిని రైతులు, అధికారులు సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామంలోని కల్పవల్లి గ్రామ సంఘం, మహేశ్వరి మహిళా సంఘ సభ్యులు ప్రధాన పంటలు ఐదు రకాలు వేయటం, 20 రకాల జీవ వైవిధ్య పంటల సాగు, 5శాతం విత్తనాలు వేసుకోవడం వల్ల వచ్చిన ఫలితాలు, మార్కెటింగ్ వంటి వాటిని విదేశీ బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో)కు చెందిన ఆన్నె సోఫియా, సీఐఆర్ఏడీకి చెందిన బ్రూనో, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్, అధికారులు విజయ్‌కుమార్, బాబు పాల్గొన్నారు.

విశాఖలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- భూమి కేటాయింపునకు సీఎం వైఎస్ జగన్ సానుకూలం
- ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి
- నేటి నుంచి విజయనగరంలో అండర్-19 మహిళా క్రికెట్ వన్డే టోర్నీ



విజయనగరం విజ్జీ స్టేడియంలో అఫీషియల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విశాఖపట్నంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి చెప్పారు. ఏపీలో 40 వేల నుంచి 50 వేల సిట్టింగ్ సామర్థ్యం ఉన్న క్రికెట్ స్టేడియం లేకపోవడం వల్లే ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వలేకపోయామని తెలిపారు. ఈ లోటును భర్తీ చేసేందుకు వీలుగా ప్రపంచస్థాయి సౌకర్యాలతో విశాఖపట్నంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని వివరించారు. స్టేడియం నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలత వ్యక్తంచేశారని తెలిపారు. విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో అంపైర్లు, స్కోరర్లు, టీవీ ఎనలిస్టుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన గది (అఫీషియల్స్ రూమ్)ని గోపీనాథ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయనగరంలో ఆదివారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు అండర్-19 మహిళా వన్డే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తామని చెప్పారు. లీగ్ దశలో అసోం, బీహార్, మధ్యప్రదేశ్, బరోడా, మిజోరాం, కేరళ జట్లు తలపడతాయని, తర్వాత ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని వివరించారు. ఇండియా, ఇంగ్లండ్ వన్డే క్రికెట్ మ్యాచ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించేందుకు బీసీసీఐ ఆమోదం తెలిపిందన్నారు. విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ జీవీ సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, సెలెక్టర్లు వర్మ, బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బాబుకు అరదండాలే సరి..

1,105వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని అణగారిన వర్గాలను అన్ని విధాలా అణగదొక్కిన అవినీతి చక్రవర్తి చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టిన చట్టానికి, న్యాయవ్యవస్థకు జేజేలు పలుకుతున్నామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. ఎంతోమంది పేదల నోళ్లు కొట్టి కులవాదాన్ని ప్రొత్సహించి తమ ఉసురు పోసుకున్న బాబుకు సరైన శాస్తే జరిగిందని చెప్పారు. గుంటూరు జిల్లాతుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,105వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. ప్రజాధనం దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశాడనేందుకు కుప్పలు తెప్పలుగా బయట పడుతున్న బాబు అవినీతే నిదర్శనమన్నారు. అమరావతి పేరుతో చేసిన దోపిడీ భారీగా బయట పడుతుండడంతో వ్యవస్థలను మేనేజ్ చేసేందుకు నానా తంటాలు పడుతున్న లోకేశ్, ఎల్లో గ్యాంగ్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని మండిపడ్డారు. అవినీతి కేసుల్లో జైలుకెళ్లిన బాబు కోసం రాష్ట్రంలో కులవాదులంతా చేరి దీక్షల పేరుతో పగటి వేషాలు వేసి డ్రామాలాడుతుండడం సిగ్గుచేటన్నారు. నాడు బాబు చేసిన తప్పులను సరిదిద్దేందుకు విశాఖ వేదికగా పరిపాలనా రాజధానికి అడుగులు వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బహుజన పరిరక్షణ సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు. నాయకులు, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

ఎటు చూసినా చెత్తే..!

రైళ్లు, స్టేషన్లలో ఇష్టారాజ్యంగా పడేస్తున్న ప్రయాణికులు

- టీ కప్పులు, భోజనం ప్యాకెట్లు, విస్తరాకులు, ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే అక్కడే..
- పక్షం రోజుల 'స్వచ్ఛతా పక్వారా'లో 544 టన్నులు పోగేసిన అధికారులు
- 857 మందికి రూ.4.5 లక్షల జరిమానా.. 21,685 మందికి కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: పారిశుధ్యానికి కేంద్రం ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది. స్వచ్ఛభారత్ పేరుతో దేశవ్యాప్తంగా ఈ మేరకు చర్యలు చేపట్టి అమలు చేస్తోంది. నిత్యం లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైళ్ల విషయంలోనూ 'స్వచ్ఛతా పక్వారా' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రయాణికుల్లోనే మార్పు రావటం లేదని, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పక్షం రోజుల పాటు రైళ్లు, రైల్వే స్టేషన్ల పరిసరాలు, వర్క్‌షాపులు, రైల్వే ఉద్యోగులు నివాసం ఉండే కాలనీల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. పక్షం రోజుల్లో ఏకంగా 544 టన్నుల చెత్త పోగవడం చూసి అధికారులు నివ్వెరపోయారు.



పారిశుధ్యంపై రైల్వే ప్రత్యేక దృష్టి

గత కొంతకాలంగా రైళ్లు, రైల్వే స్టేషన్లలో చాలా మార్పులు సంతరించుకుంటున్నాయి. అధునాతన రైళ్లతో పాటు స్టేషన్లలో అన్నిరకాల వసతులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటున్నాయి. రైళ్లు, స్టేషన్లు పరిశుభ్రంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా ఆదేశించారు. అంతేగాక స్వయంగా చీపురు పట్టి స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొంటుండటంతో రైల్వే అధికారులూ అప్రమత్తంగా ఉంటున్నారు. స్టేషన్లను శుభ్రపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించి క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా చూస్తున్నారు. రైళ్లలో కూడా శుభ్రపరిచే సిబ్బందిని ఉంచి, ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకముందే క్లీన్ చేసేలా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రయాణికుల నుంచి మాత్రం దీనికి ఎలాంటి సహకారం లభించడం లేదని రైళ్లు, స్టేషన్లలో దర్శనమిచ్చే చెత్త స్పష్టం చేస్తోంది.

పట్టించుకోని ప్రయాణికులు

కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, మిగిలిపోయిన తినుబండారాలు, కాఫీ/టీ కప్పులు, భోజన ప్యాకెట్లు, విస్తరాకులు.. ఇలాంటి వాటన్నిటినీ ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ విసిరేస్తున్నారు. దీంతో రైళ్లు, రైల్వే స్టేషన్లు, పరిసరాలు చెత్తతో నిండిపోతున్నాయి. సిబ్బంది ఎన్నిసార్లు శుభ్రం చేసినా మళ్లీ చెత్త పోగవుతోంది. ఇటీవల పక్షం రోజుల పాటు 639 రైల్వే స్టేషన్లు, 180 రైళ్లలో స్వచ్ఛతా పక్వారా కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో చెత్త వేసేందుకు ప్రత్యేకంగా డస్ట్‌బిన్‌లు ఉన్నా, విచ్చలవిడిగా చెత్త విసురుతున్నట్టు అధికారులు గుర్తించారు. మొత్తం 544 టన్నుల చెత్తను పోగేసిన అధికారులు.. చెత్తను విసురుతూ పట్టుబడ్డ 857 మంది నుంచి రూ.4.5 లక్షల జరిమానా వసూలు చేశారు. 21,685 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోగైన చెత్తలో 42 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలుండటం విశేషం. ఇక రైల్వే ప్రాంగణాల్లో 436 టన్నుల తుక్కును సేకరించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. 3,510 కి.మీ. నిడివిగల ట్రాక్‌ను కూడా ఈ సందర్భంగా శుభ్రం చేశారు. అయితే స్వచ్ఛతా పక్వారా పేరుతో ఎప్పుడో ఓసారి నిర్వహించే కార్యక్రమాలతో ఫలితం అంతగా ఉండదని, రైళ్లు, రైల్వే స్టేషన్లలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ చెత్త వేసే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, వారికి కౌన్సెలింగ్ ఇవ్వటం ద్వారా మార్పు తెచ్చేందుకు ప్రయత్నించాలనే సూచనలు వస్తున్నాయి.

మరిన్ని వ్యాపారాల్లోకి ఏపీ ఫైబర్‌గ్రిడ్

- దేశవ్యాప్తంగా టెలీకాం టెండర్లలో పాల్గొంటాం
- రాష్ట్రంలోని సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత
- మూలధనాన్ని పెంచుకోవడానికి బోర్డు ఆమోదం
- ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: కేబుల్ టీవీ, టెలికాం కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) మరిన్ని వ్యాపార రంగాల్లోకి అడుగు పెట్టనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పి.గౌతమ్ రెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశం నిర్ణయాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల కోసం ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల నిర్వహణను ఏపీఎస్ఎఫ్ఎల్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా దేశవ్యాప్తంగా టెలికాం సంస్థలు పిలిచే టెండర్లలో పాల్గొని ఆ ప్రాజెక్టులను కూడా చేపడతామన్నారు. వ్యాపార విస్తరణకు అనుగుణంగా మూలధనం పెంచుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపిందని, ప్రస్తుతం రూ. 7 కోట్లుగా ఉన్న మూలధనాన్ని రూ. 2,000 కోట్లకు పెంచుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఏపీఎస్ఎఫ్ఎల్ ఆస్తుల విలువ రూ. 3,586.22 కోట్లుగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్ ఫేజ్-2 ప్రాజెక్టును చేపట్టామని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రూ. 627 కోట్లను రుణ రూపంలో సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరం వరకు ఏపీఎస్ఎఫ్ఎల్ అకౌంట్లను ఇంటర్నల్/ఎక్స్‌టర్నల్ ఆడిటింగ్ తర్వాత కాగ్‌కు సమర్పించాలని బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సెట్‌టాప్ బాక్స్‌ల కొరత ఉండటంతో ఎంఎస్‌వోలు సొంతంగా వాటిని కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తే తొమ్మిది నెలల గడువులో ఆ మొత్తం చెల్లించడానికి నిర్ణయించినట్లు తెలిపారు.

యనమల పాత్ర గురించి అప్పట్లోనే చెప్పా..

ఫైబర్ గ్రిడ్ కుంభకోణంలో చంద్రబాబు, అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పాత్ర ఉందని గతంలోనే చెప్పానని గౌతమ్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ కుంభకోణంలో లోకేశ్ పాత్ర ఉందా లేదా అన్న విషయం దర్యాప్తులో తేలుతుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తనను ఎవరూ ఏమీ చేయలేరన్న అహంకారంతో చంద్రబాబు ఉండేవారని, ఇప్పుడు అడ్డంగా దొరికిపోయి జైల్లో ఉన్నారన్నారు. చంద్రబాబు బాధితుల్లో తానూ ఒకడినని, తనను కూడా జైలుకు పంపించారన్నారు. ఒక వ్యక్తిని అన్యాయంగా అరెస్ట్ చేస్తే ఆ కుటుంబం ఎంత వేదన చెందుతుందో ఇప్పుడు బాబు కుటుంబసభ్యులకు కూడా తెలుస్తుందన్నారు.

• తెలంగాణ

కొత్త ప్రాంతాలకు మూడు రైళ్ల పొడిగింపు

రేపటి నుంచి అమలులోకి..



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే మరిన్ని ప్రాంతాలకు నాలుగు రైళ్లను పొడిగించింది. కొత్త రైళ్లను వేయాల్సిన అవసరం లేకుండా, ప్రస్తుతం చివరి స్టేషన్‌కు సమీపంలో ఉన్న పట్టణాల వరకు వీటిని పొడిగించారు. ఆయా ప్రాంతాల నుంచి డిమాండ్ రావటంతో రైల్వే ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొన్ని రైళ్లు హైదరాబాద్ వరకు మాత్రమే నడుస్తున్నాయి. ఇప్పుడు అలాంటి వాటిని సమీపంలోని పట్టణాల వరకు నడిపించేందుకు రైల్వే ఏర్పాట్లు చేస్తోంది.

- పుణెలోని హడప్‌సర్ నుంచి హైదరాబాద్ వరకు వారంలో మూడు రోజులు (సోమ, గురు, శని/బుధ, శని, సోమ నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ (నెం.17013/17014) రైలును కాజీపేట వరకు పొడిగించారు. కాజీపేట నుంచి పుణె నగరానికి వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున దీన్ని కాజీపేట జంక్షన్ వరకు పొడిగించారు. • నాందేడ్ నుంచి తాండూరు వరకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ (నెం.17664/17663)ను రాయచూర్ వరకు పొడిగించారు. తాండూరు పరిసరాల నుంచి రాయచూర్, దాని సమీప ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.
- జైపూర్-కాచిగూడ మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం.19713/19714)ను కర్నూలు సిటీ స్టేషన్ వరకు పొడిగించారు. ఈ మార్గంలో ఇటీవలే డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తి కావటంతో రైలు సేవలను విస్తరించే క్రమంలో ఈ మార్పు చేశారు.
- కరీంనగర్-నిజామాబాద్ మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలు (07894/07893)ను బోధన్ వరకు పొడిగించారు. ఈ రైలులో సెకండ్ జనరల్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.
- అక్టోబర్ 9 నుంచి వీటి పొడిగింపు అమలులోకి వస్తుంది. ఈ పొడిగింపు ప్రాంతాలకు టికెట్ ముందస్తు రిజర్వేషన్‌ను ప్రారంభించారు. 9న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ కొత్త రైళ్ల పొడిగింపు సేవలను ప్రారంభించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సహకరించడం లేదు

'గుర్తింపు' ఎన్నికలపై హైకోర్టులో కేంద్రం పిటిషన్

సాక్షి, హైదరాబాద్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సహకరించేలా ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఎన్నికలకు సింగరేణి యాజమాన్యం సహకరించడంలేదని కేంద్ర కార్మిక శాఖ తరఫున డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 'గత నెల 27న సమావేశం ఏర్పాటు చేస్తే సింగరేణి యాజమాన్యం హాజరు కాలేదు. తుది ఓటరు జాబితా ఇప్పటివరకు ప్రకటించలేదు. కోర్టు ఆదేశాలతో ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశాం. అయితే యాజమాన్యం సహాయ నిరాకరణ కారణంగా ఎన్నికలపై ముందుకు వెళ్లలేకపోతున్నాం. ఎన్నికల నిర్వహణకు సహకరించేలా సింగరేణి యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో వాదనలు ఈనెల 11కు వాయిదా పడిన విషయం తెలిసిందే. కేంద్ర కార్మిక శాఖ పిటిషన్‌పై కూడా అదే రోజున సీజే ధర్మాసనం విచారణ జరపనుంది.

సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేసిన యాజమాన్యం..

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించలేమని, గడువు కావాలని యాజమాన్యం గత నెల హైకోర్టును ఆశ్రయించింది. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాశారని చెప్పింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గతంలో అక్టోబర్‌లో నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని ఆదేశించారు. దీంతో సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సింగరేణి యాజమాన్యం అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది.

హుక్కా సెంటర్ల పిటిషన్లపై తీర్పు వాయిదా

సాక్షి, హైదరాబాద్: పోలీసులు తమ వ్యాపార కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలు హుక్కా సెంటర్లు దాఖలు చేసిన పిటిషన్లలో హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. సిగరేట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం నిబంధనల మేరకు హుక్కా సెంటర్లు నిర్వహిస్తున్నా పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బందులు కలిగిస్తున్నారని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 60 హుక్కా సెంటర్ల యాజమాన్యాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి తీర్పు రిజర్వు చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ చట్టపరంగా నిర్వహిస్తున్న తమ వ్యాపారంలో అన్యాయంగా పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ 'హుక్కా సెంటర్, హుక్కా పార్లర్ అనే పదాలకు చట్టాల్లో చోటు లేదు. 'స్మోకింగ్ రూమ్'లను మాత్రమే చట్టప్రకారం గుర్తించింది. హుక్కా కేంద్రాలు మైనర్లను ఆకర్షిస్తూ, వారి జీవితాలు విచ్ఛిన్నం కావడానికి కారణం అవుతున్నాయి. స్మోకింగ్ రూమ్‌ల మధ్య అవసరమైన దూరానికి సంబంధించిన నియమాలు పాటించడంలేదు. హుక్కా కేంద్రాలలో బొగ్గును ఉపయోగించడం వివాదాస్పద అంశం. బొగ్గును కాల్చడం ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు కార్బన్ మోనాక్సైడ్ హుక్కా పొగతో పాటు పీలుస్తున్నారు. ఏదైనా ప్రాంగణంలో బొగ్గు నిల్వ చేయడానికి జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం లైసెన్స్ అవసరం. పిటిషనర్లు హుక్కా సేవలతోపాటు రెస్టారెంట్లు, బేకరీలు, స్నూకర్ పార్లర్లను నిర్వహించడం ద్వారా పక్కదారి పట్టిస్తున్నారు' అని చెప్పారు.


గాజాస్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్తున్న రాకెట్లు


హమాస్ మిలిటెంట్ల రాకెట్లతో ఇజ్రాయెల్‌లోని అష్కెలాన్‌లో చెలరేగిన మంటలు

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు

- దేశంలోకి భారీగా చొరబడ్డ మిలిటెంట్లు
- వీధుల్లో స్వైరవిహారం, విచ్చలవిడి కాల్పులు
- 20 నిమిషాల్లో 5 వేల రాకెట్ల ప్రయోగం
- వందకు పైగా మృతులు, భారీగా క్షతగాత్రులు
- గాజాపై భారీఎత్తున ఇజ్రాయెల్ ప్రతిదాడులు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య తీవ్ర యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాలస్తీనాకు చెందిన హమాస్ మిలిటెంట్లు శనివారం గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్‌పైకి వేలాది రాకెట్లు ప్రయోగించారు. ఆ వెంటనే గాజా గుండా భూ, వాయు, సముద్ర మార్గాల్లో పెద్ద సంఖ్యలో చొరబడ్డారు. పండుగ వేళ ఆదమరచిన ఇజ్రాయెలీలపైకి ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఎక్కడ పడితే అక్కడ కాల్పులకు, విధ్వంసానికి దిగారు. దాడుల్లో కనీసం 100 మందికి పైగా మరణించగా వెయ్యి మందికి పైగా గాయపడ్డట్టు చెబుతున్నారు. సరిహద్దుల ప్రాంతాల్లో పౌరులతో పాటు సైనికులను కూడా మిలిటెంట్లు బందీలుగా పట్టుకున్నారు. వారిని, చేజిక్కించుకున్న ఇజ్రాయెల్ సైనిక వాహనాలను గాజా వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఊహించని దాడితో బిత్తరపోయిన ఇజ్రాయెల్ తేరుకుని హుటాహుటిన సైన్యాన్ని రంగంలోకి దించింది. ఇరువర్గాల ఎక్కడికక్కడ మధ్య భీకర పోరు సాగుతోంది. కాల్పులు, మోర్టార్లు, రాకెట్ల మోతతో దేశం దద్దరిల్లుతోంది. తాము ముట్టడిలో ఉన్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ''ఇది దాడి కాదు, మాపై పూర్తిస్థాయి యుద్ధమే''అని పేర్కొన్నారు. దీనికి పాలస్తీనా అతి భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ''ముందుగా చొరబాటుదారులను ఏరేస్తాం. అనంతరం భారీ స్థాయిలో ప్రతీకారం తీర్చుకుని తీరతాం''అని ప్రకటించారు. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో ఎమర్జెన్సీ ప్రకటించారు. గత కొన్నేళ్లలో ఆ దేశంపై జరిగిన అతి తీవ్ర దాడి ఇదే. మరోవైపు ఇజ్రాయెల్ ప్రతి దాడిలో గాజాలో ఇప్పటికే 200 మందికి పైగా మరణించినట్టు, 2000 మంది దాకా గాయపడ్డట్టు పాలస్తీనా ఆరోగ్య శాఖ చెబుతోంది.

14 చోట్లనుంచి చొరబాటు...!

ఇజ్రాయెల్‌లోకి కనీసం 7 నుంచి 14 ప్రాంతాల గుండా మిలిటెంట్లు చొచ్చుకొచ్చినట్టు చెబుతున్నారు. తొలుత వివాదాస్పద గాజా స్ట్రిప్ నుంచి తెల్లవారుజామున రాకెట్ల వర్షం కురిపించారు. 20 నిమిషాల్లోనే 5 వేలకు పైగా రాకెట్లు ప్రయోగించారు. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు దేశమంతటా వాయుదాడి సైరన్లు మోగాయి. ఆ వెంటనే మిలిటెంట్లు దేశంలోకి చొచ్చుకొచ్చారని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. దక్షిణాన గాజా–ఇజ్రాయెల్ సరిహద్దుల్లో కంచెలను పేల్చేసి మోటార్ సైకిళ్లు, వాహనాల్లో, పారా గ్లైడర్ల ద్వారా కూడా దూసుకొచ్చి దాడులకు దిగారు. ప్రతిగా సైన్యం కూడా గాజాపైకి వేలాది రాకెట్లు ప్రయోగించింది. అల్ హక్సా మసీదుపై ఇజ్రాయెల్ అకృత్యాలకు, గాజాపై ఏళ్ల తరబడి అణచివేతకు ప్రతీకారంగా ఈ దాడికి దిగినట్టు హమాస్ మిలిటరీ వింగ్ నేత మొహమ్మద్ దెయిఫ్ పేర్కొన్నాడు. దీన్ని 'ఆపరేషన్ అల్ అక్సా ఫ్లడ్'గా అభివర్ణించాడు. తూర్పు జెరూసలేం నుంచి ఉత్తర ఇజ్రాయెల్ దాకా ఉన్న పాలస్తీనియన్లంతా యుద్ధంలో పాల్గొనాలని పిలుపునిచ్చాడు. ఈ దాడి నెతన్యాహూ నాయకత్వ సామర్థ్యంపై పలు సందేహాలు లేవనెత్తింది. న్యాయవ్యవస్థలో సంస్కరణల పేరుతో దేశ ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి, భారీ ఆందోళనలకు ఆయన కారకుడవడం తెలిసిందే. దాడి నేపథ్యంలో సైనిక ఉన్నతాధికారులతో ఆయన పరిస్థితిని సమీక్షించారు.

ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా అండ: మోదీ

ఇజ్రాయెల్‌పై దాడి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వెలిబుచ్చారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఆ దేశానికి అండగా ఉంటామని ప్రకటించారు. బాధిత పౌరులు, కుటుంబాల క్షేమం కోసం ప్రార్థిస్తున్నానంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడిని అమెరికా, పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఖండించగా. ఇరు దేశాలూ సంయమనం పాటించాలని పలు ఇతర దేశాలు కోరాయి.

అక్కడి భారతీయులకు అడ్వైజరీ

ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని కేంద్రం సూచించింది. అనవసరంగా ఇళ్ల నుంచి బయటికి రావద్దని పేర్కొంది. ఈ మేరకు అక్కడి భారత ఎంబసీ ఇంగ్లిష్‌తో పాటు హిందీ, మరాఠా, తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో అడ్వైజరీ జారీ చేసింది. ఇజ్రాయెల్‌లో 18 వేల మంది దాకా భారతీయులున్నారు.


ఇజ్రాయెల్ దాడులతో గాజా సిటీలోని బహుళ అంతస్తుల భవనాన్ని కమ్ముకున్న మంటలు, పొగ


జెరూసలేంలోని మాగెన్ డేవిడ్ ఆడమ్ ఎమర్జెన్సీ కేంద్రంలో రక్తదానం చేస్తున్న ఇజ్రాయెలీలు

ఇజ్రాయెల్ X పాలస్తీనా

వందేళ్ల కుంపటి..!

ఇజ్రాయెల్, పాలస్తీనా వివాదం ఇప్పటిది కాదు. దీనికి వందేళ్ల చరిత్ర ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం సమయం నుంచి ఇదొక రావణకాష్టంలా రగులుతూనే ఉంది. మొదటి ప్రపంచ యుద్ధంలో పాలస్తీనా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ఒట్టోవా సామ్రాజ్యం ఓటమి పాలైంది. బ్రిటన్ ఆ ప్రాంతాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకుంది. ఆ ప్రాంతంలో యూదులు తక్కువ సంఖ్యలోనూ, అరబ్బులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు. పాలస్తీనా ప్రాంతంలో యూదుల రాజ్యాన్ని ఏర్పాటు చేసే బాధ్యత ప్రపంచ దేశాలు బ్రిటన్‌కు అప్పగించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. పాలస్తీనా తమ పూర్వీకులకు చెందిన ప్రాంతమని తమకే హక్కు ఉందని యూదులు వాదిస్తే, అరబ్బులు అదే తమ మాతృభూమి అని దానిని వదల్లేమని కరాఖండీగా చెబుతూ వచ్చారు. 1920–40 సంవత్సరాల మధ్య పాలస్తీనాలో యూదుల శరణార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధం కాలంలో యూరప్‌లో యూదులపై ఊచకోతతో ఎందరో పాలస్తీనాకు పారిపోయి వచ్చి తలదాచుకున్నారు. పాలస్తీనా ప్రాంతంలో యూదులు సంఖ్య పెరిగిన కొద్దీ ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఆరంభమైంది. అదే సమయంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం ఎక్కువైంది.

ఐక్యరాజ్యసమితి ప్రతిపాదనలు

యూదులు, అరబ్బుల మధ్య సమస్య పరిష్కారానికి ఐక్యరాజ్య సమితి ఒక ప్రతిపాదన చేసింది. పాలస్తీనాను రెండుగా విభజించి యూదులకు, అరబ్బులకు పంచి ఇచ్చి జెరూసలేంను అంతర్జాతీయ నగరంగా ప్రకటించాలని ప్రతిపాదించింది. దీనికి యూదులు అంగీకరించినప్పటికీ, అరబ్బులు వ్యతిరేకించారు. దీంతో ఆనాటి ఐక్యరాజ్యసమితి ప్రతిపాదనలు అమల్లోకి రాలేదు.

ఇజ్రాయెల్ ఆవిర్భావంతో యుద్ధవాతావరణం

ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చలేని తెల్లదొరలు 1948లో ఆ ప్రాంతాన్ని వీడి వెళ్లిపోయారు. దీంతో యూదులు ఇజ్రాయెల్ ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టుగా ప్రకటించారు. దీనిని పాలస్తీనియన్లు తీవ్రంగా వ్యతిరేకంచడంతో యుద్ధం వచ్చింది. చుట్టుపక్కల ఉన్న అరబ్బు దేశాలు కూడా సైనిక చర్యలకు దిగాయి. ఫలితంగా లక్షలాది మంది పాలస్తీనీయులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని పారిపోయారు. అప్పట్నుంచి ఇరు ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతూనే ఉంది.

హమాస్ ఏర్పాటుతో సంక్షోభం


1987లో ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ హమాస్ సంస్థ ఆవిర్భావం తర్వాత సంక్షోభం మరింత ముదిరింది. పాలస్తీనాకు చెందిన మతాధికారి షేక్ అహ్మద్ యాసిన్ స్థాపించిన హమాస్ తొలుత రాజకీయ పార్టీగా ఉంది. ఆ తర్వాత ఇజ్రాయెల్‌పై దాడులే లక్ష్యంగా ముందుకు సాగింది. దీంతో చాలా దేశాలు దీనిని ఒక ఉగ్రవాద సంస్థగా ముద్ర వేశాయి. 2000 సంవత్సరంలో అమెరికాకు అధ్యక్షుడిగా ఉన్న బిల్ క్లింటన్ ఇరు ప్రాంతాల మధ్య ఉద్రిక్తతల నివారణకు క్యాంప్ డేవిడ్ శిఖరాగ్ర సదస్సును ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. 2006లో పాలస్తీనాలో జరిగిన ఎన్నికల్లో హమాస్ అత్యధిక స్థానాలు దక్కించుకోవడంతో ఇజ్రాయెల్, అమెరికా పాలస్తీనియన్లకు ఆర్థిక సాయాన్ని నిలిపివేశాయి. ప్రస్తుతం గాజా సిటీ హమాస్ ఆధీనంలో ఉంది. వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం ఇజ్రాయెల్ అధీనంలో ఉండడంతో తరచూ ఉద్రిక్తతలు రాజుకుంటూనే ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ హయాంలో మరోసారి ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య శాంతి స్థాపనకు ప్రయత్నాలు జరిగినా అవి ఫలవంతంకాలేదు. దీంతో సమస్య అలాగే ఉండిపోయింది.

–సాక్షి, నేషనల్ డెస్క్

కొలిక్కి రాని సమస్యలివే..!

ఇజ్రాయెల్ జెరూసలేం మొత్తాన్ని తన రాజధానిగా ప్రకటించుకుంటే, పాలస్తీనియన్లు తూర్పు జెరూసలేంను తమ భవిష్యత్ రాజధానిగా ప్రకటించుకున్నారు.

- 2005లో గాజా నుంచి ఇజ్రాయెల్ సేనలు వైదొలగినప్పటికీ ఐక్యరాజ్య సమితి ఇప్పటికీ ఆ ప్రాంతాన్ని ఆక్రమిత భూభాగంగానే చూస్తోంది.
- వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం ఇప్పటికి ఇంకా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉంది.
- ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య ఉద్రిక్తతలకు కేంద్రంగా తూర్పు జెరూసలేం, గాజా, వెస్ట్ బ్యాంక్ మారాయి.
- వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ అంతర్జాతీయ నిబంధనల్ని తోసిరాజని ఎన్నో అక్రమ కట్టడాలను నిర్మించింది. వాటిని తొలగించే అంశంలో వివాదం నెలకొంది.
- పాలస్తీనా శరణార్థుల భవిష్యత్‌పై ఆందోళనలతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.



టపాసుల దుకాణంలో ఘోర అగ్నిప్రమాదం

- 12 మంది మృతి.. మరో పది మందికి గాయాలు
- పలు వాహనాలు దగ్ధం
- తమిళనాడు– కర్ణాటక సరిహద్దుల్లో ఘటన



హోసూరు (తమిళనాడు): హోసూరు–బెంగళూరు జాతీయ రహదారిపై తమిళనాడు సరిహద్దులో ఉన్న అత్తిపల్లి వద్ద శనివారం సాయంత్రం ఓ బాణాసంచా దుకాణంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రెండు లారీలతో సహా పలు వాహనాలు బూడిదయ్యాయి. 12 మంది కార్మికులు మరణించారు. మరో పదిమంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లోని అత్తిపల్లి వద్ద శనివారం సాయంత్రం నవీన్ అనే వ్యక్తికి చెందిన టపాసుల గోదాములోకి లారీల్లో వచ్చిన స్టాక్‌ను 20 మందికి పైగా సిబ్బంది అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ సమయంలో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. బాణసంచా ధాటికి చెలరేగిన మంటలు పక్క పక్కనే ఉన్న దుకాణాలకు, వాహనాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లోని అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపు చేశారు. దుకాణంలో ఉన్న రూ.1.50 కోట్ల విలువైన బాణాసంచాతో పాటుగా ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం. దుకాణ యజమాని సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండులారీలతో పాలు పలు వాహనాలు దగ్ధమయ్యాయి. మొత్తం 12 మంది మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరంతా తమిళనాడు వాసులే. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. టపాసులను అన్‌లోడ్ చేసే సమయంలో విద్యుత్ తీగలు తగలడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన వారిలో 62 మంది సురక్షితం

- సిక్కిం ఆకస్మిక వరదల్లో 30కి చేరిన మరణాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న అన్వేషణ

గ్యాంగ్‌టక్/జల్పాయ్‌గురి: సిక్కింలో తీస్తా నదికి బుధవారం సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన వారిలో 62 మంది సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో, గల్లంతైన వారి సంఖ్య 143 నుంచి 81కి తగ్గిపోయింది. మరోవైపు, వరదల్లో మృతుల సంఖ్య 30కి చేరుకుంది. మరో వైపు, గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరదల్లో గల్లంతైన 22 మంది ఆర్మీ సిబ్బందిలో మరో రెండు మృతదేహాలు శనివారం బయటపడ్డాయి. దీంతో, ఇప్పటి వరకు 9 మంది జవాన్ల మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు చెప్పారు. నాలుగు జిల్లాల్లోని సుమారు 42 వేల మంది ప్రజలపై వరదలు ప్రభావం చూపగా, 1,320 నివాసాలు దెబ్బతిన్నాయని, 13 వంతెనలు కొట్టుకుపోయాయని రాష్ట్ర యంత్రాంగం శనివారం తెలిపింది. తీవ్రంగా గాయపడిన 26 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపింది. మంగన్ జిల్లాలోని లచెన్, లచుంగ్‌ల్లో వరద ముంపులో చిక్కుకున్న సుమారు 3వేల మంది పర్యాటకులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిని బయటకు తరలించేందుకు వైమానిక దళానికి చెందిన ఎంఐ–17 హెలికాప్టర్లతో ప్రయత్నించినప్పటికీ వాతావరణం అనుకూలించలేదని అధికారులు చెప్పారు. చుంగ్‌థంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయిన పర్యాటకులకు హెలికాప్టర్ ద్వారా అత్యవసరాలను సరఫరా చేశారు. సింగ్‌టమ్, బర్దంగ్, రంగ్‌పోల్లోని వారిని రక్షించే పనుల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు తలమునకలై ఉన్నాయి. అనూహ్య వరదలతో చుంగ్‌థంగ్ పట్టణం 80 శాతం మేరకు తీవ్రంగా దెబ్బతింది. వరద ప్రభావిత మాంగన్ జిల్లాను సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ శనివారం సందర్శించారు. సహాయక కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అన్ని శాఖల అధికారులతో కూడిన అధికారుల కేంద్ర బృందం ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాలకు పంపుతున్నట్లు కేంద్ర మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా చెప్పారు. ఇలా ఉండగా, వచ్చే అయిదు రోజులపాటు మంగన్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

ఆ 150 మంది తృటిలో తప్పించుకున్నారు

తీస్తా నదికి సమీపంలోని సిక్కిం– పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో రైల్వే సొరంగం పనుల్లో పాల్గొంటున్న సుమారు 150 మంది కార్మికులు ఆకస్మిక వరదల నుంచి వెంట్రుకవాసిలో తప్పించుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఎగువ నుంచి భారీగా వరద ముంచుకొస్తున్న సమాచారాన్ని అధికారులు కాలింపాంగ్ జిల్లా జీరో మైల్ ప్రాంతం వద్ద ఉన్న ప్రైవేట్ రైల్వే కాంట్రాక్ట్ సంస్థకు చేరవేశారు. సంస్థ అధికారులు వెంటనే ఒక సెక్యూరిటీ గార్డును హుటాహుటిన కార్మికులుండే క్యాంపునకు పంపించారు. పగలంతా పనులు చేసి, అలసిపోయి క్యాంపుల్లో నిద్రిస్తున్న కార్మికులను గార్డు అప్రమత్తం చేశారు. దాదాపు 150 మంది కార్మికులు ఉన్నఫళంగా విలువైన పత్రాలు, దగ్గరున్న డబ్బు, కట్టుబట్టలతో అక్కడి నుంచి అడ్డదారిన బయలుదేరారు. దాదాపు 20 నిమిషాల అనంతరం ప్రధాన రహదారికి వద్దకు చేరుకున్నారు. అప్పటికే వరద దిగువనున్న వారి క్యాంపును మింగేయడం కళ్లారా చూసి కార్మికులు షాక్ అయ్యారు. అప్పటికే అక్కడున్న ట్రక్కుల్లో 2 కిలోమీటర్ల దూరంలోని రాంబి బజార్‌లో ఏర్పాటు చేసిన క్యాంప్‌నకు చేరుకున్నారు. వీరంతా అస్సాం, బిహార్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు.

రాజస్తాన్‌లోనూ కులగణన: సీఎం గెహ్లోత్

జైపూర్: బిహార్ బాటలో రాజస్తాన్ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కులగణన చేపడతామని సీఎం అశోక్ గెహ్లోత్ ప్రకటించారు. బిహార్ ప్రభుత్వం చేపట్టిన విధానంలో రాష్ట్రంలో సైతం కుల గణన నిర్వహిస్తామని సీఎం చెప్పారు. భిన్న కులాలు ఉన్న మన దేశంలో ఏఏ కులం వారు ఎంతెంత మంది ఉన్నారో తేలితే సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేయవచ్చునని చెప్పారు. ఈసారి ఎన్నికల ప్రచారంలో 'కామ్ కియా దిల్‌సే, కాంగ్రెస్ ఫిర్‌సే' అన్నది తమ నినాదమని సీఎం వెల్లడించారు.

మిల్లెట్ల పిండిపై 5% పన్ను

జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: తృణ ధాన్యాల ఆధారిత పిండిపై 5 శాతం పన్ను విధించాలని జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. లూజుగా విక్రయించే కనీసం 70 శాతం తృణధాన్యాల పిండిపై ఎలాంటి పన్ను ఉండదని ఆమె తెలిపారు. అదే ప్యాకేజీ రూపంలో లేబుల్‌తో విక్రయించే పిండిపై మాత్రం 5 శాతం పన్ను ఉంటుందని వివరించారు. జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ)ప్రెసిడెంట్‌కు 70 ఏళ్లు, సభ్యులకైతే 67 ఏళ్ల గరిష్ఠ వయో పరిమితి విధించాలని కూడా 52వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించిందన్నారు. గతంలో ఇది వరుసగా 67, 65 ఏళ్లుగా ఉండేదన్నారు. మొలాసెస్‌పై ప్రస్తుతమున్న 28 శాతం జీఎస్‌టీని, 5 శాతానికి తగ్గించడంతోపాటు మానవ అవసరాల కోసం వినియోగించే డిస్టిల్డ్ ఆల్కహాల్‌కు జీఎస్‌టీ నుంచి మినహాయింపు కల్పించినట్లు మంత్రి చెప్పారు. ఒక కంపెనీ తన అనుబంధ కంపెనీకి కార్పొరేట్ గ్యారెంటీ ఇచ్చినప్పుడు, ఆ విలువను కార్పొరేట్ గ్యారెంటీలో 1 శాతంగా పరిగణిస్తారు. దీనిపై జీఎస్‌టీ 18 శాతం విధించాలని కూడా కౌన్సిల్ నిర్ణయించిందన్నారు.

కొత్తరూపుతో ఎయిరిండియా విమానాలు

న్యూఢిల్లీ: కొత్త, ఆకర్షణీయమైన రూపును సంతరించుకున్న ఎయిరిండియా విమానాలు త్వరలోనే సేవలందించనున్నాయి. ఫ్రాన్సులోని టౌలౌజ్‌లో ఉన్న వర్క్‌షాపులో ఉన్న ఏ350 విమానాల ఫొటోలు తాజాగా బయటకు వచ్చాయి. ఈ విమానాలు మరికొద్ది రోజుల్లోనే భారత్‌కు రానున్నాయని టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా శనివారం 'ఎక్స్'లో తెలిపింది. 2025కల్లా ఎయిరిండియాలోని మొత్తం విమానాలన్నీ కొత్త లోగో, కొత్త రూపుతో కనిపిస్తాయని పేర్కొంది. తమ విమానాలు ది విస్టా లోగోతో ఆబర్‌గిన్– గోల్డ్ లుక్‌తో కనిపించేందుకు ఎయిర్‌బస్– బోయింగ్‌తో రూ.3 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది.

అఫ్గాన్‌లో భూకంపం..15 మంది మృతి

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లో సంభవించిన భూకంపంలో 15 మంది చనిపోగా మరో 40 మందికి పైగా గాయాలపాలయ్యారు. భూకంపం తాకిడికి హీరట్ ప్రావిన్స్ జెందా జాన్ జిల్లాలోని నాలుగు గ్రామాల్లోని డజన్లకొద్దీ ఇళ్లు ధ్వంసమయినట్లు అఫ్గాన్ జాతీయ విపత్తు సంస్థ తెలిపింది. అఫ్గాన్–ఇరాన్ సరిహద్దులకు సమీపంలోని హీరట్ పరిసరాల్లో శనివారం మధ్యాహ్నం కనీసం ఏడుసార్లు భూమి కంపించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) పేర్కొంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైందని పేర్కొంది. భూకంప నష్టం, మృతులకు సంబంధించి తాలిబన్ ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు.

కెనడాలో కూలిన విమానం.. ఇద్దరు భారతీయ పైలట్లు మృతి

ముంబై: కెనడాలోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలో శనివారం సంభవించిన విమాన ప్రమాదంలో ఇద్దరు భారతీయ ట్రెయినీ పైలట్లు సహా ముగ్గురు మృతి చెందారు. డబుల్ ఇంజిన్ తేలికపాటి విమానం చిల్లివాక్ నగరంలోని ఓ హోటల్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముంబైకి చెందిన శిక్షణ పైలట్లు అభయ్ గద్రూ, యశ్ విజయ్ రాముగాడెతోపాటు మరో పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు.

భారత్–కెనడాల మధ్య ఉద్రిక్తతలు సమసిపోవాలి

రిషి సునాక్, జస్టిన్ ట్రూడో ఏకాభిప్రాయం

లండన్: భారత్–కెనడాల మధ్య విభేదాలు సమసిపోవాల్సిన అవసరం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అభిప్రాయపడ్డారు. భారత్–కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రిషి సునాక్, ట్రూడోలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది, భారత్‌లో మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల హస్తముందనేందుకు ఆధారాలున్నాయంటూ ట్రూడో చేసిన ప్రకటన ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. అదేవిధంగా, బ్రిటన్‌లోని ఓ గురుద్వారా కమిటీ సమావేశానికి వెళ్లిన భారత దౌత్యాధికారి విక్రమ్ దొరైస్వామిని ఖలిస్తానీ అనుకూలవాదులు అడ్డుకోవడం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఇరు దేశాల ప్రధానులు సంభాషించుకున్నారు. భారత్‌తో విభేదాలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, జెనీవా ఒప్పందం తోపాటు దేశాల సార్వభౌమాధికారాన్ని, చట్ట నియమాలను గౌరవించాలన్నారు. భారత్‌తో సంబంధాలు త్వరలోనే మెరుగుపడతాయని రిషి సునాక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నన్ను పోలీస్ లాకప్‌కు పంపొద్దు

ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ పిటిషన్

న్యూఢిల్లీ: ఈడీ ప్రధాన కార్యాలయం నుంచి తనను పోలీస్ లాకప్‌కు తరలించకుండా అడ్డుకోవాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ కోర్టును కోరారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో శనివారం ఈ మేరకు పిటిషన్ వేశారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ ఆయనను బుధవారం అరెస్టు చేయడం తెలిసిందే. కోర్టు ఆయనకు ఈనెల 10 దాకా రిమాండ్ విధించింది. దీంతో ఆయనను ఈడీ ప్రధాన కార్యాలయంలోని లాకప్ రూంలో ఉంచారు. అక్కడ పురుగు మందులు కొడుతున్నారనే నెపంతో తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారని సంజయ్ సింగ్ ఆరోపించారు. తనను టార్చర్ చేసేందుకు కుట్ర పన్నారన్నారు. తరలింపు ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో అమానవీయంగా వ్యవహరించారన్నారు.

మళ్లీ సీఎం కమ్మంటారా?

ప్రజలనే అడిగిన శివరాజ్

భోపాల్: అసెంబ్లీ ఎన్నికల ముంగిట బీజేపీ అధిష్టానం తనను పక్కన పెట్టజూస్తోందన్న వార్తల నేపథ్యంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను మంచి పాలనే అందిస్తున్నానా? మళ్లీ మామ (తనను ఉద్దేశించి) సీఎం కావాలనుకుంటున్నారా?' అని నేరుగా శనివారం దిండోరీలో ఎన్నికల ప్రచార ర్యాలీలో నేరుగా ప్రజలనే అడిగారు! అవునని వారినుంచి సమాధానాలు రాబట్టారు. కొద్దికాలంగా సమావేశాలు, ర్యాలీల్లో చౌహాన్ ఇలాగే భావోద్వేగాలు ప్రదర్శిస్తున్నారు. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ శాసనసభకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ ఇప్పటికే 79 మంది అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, ఫగ్గన్ సింగ్ కులస్తే, సీనియర్ నేత కైలాస్ విజయవర్గీయ వంటివారు స్థానం సంపాదించారు. అయితే రాష్ట్రానికి అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన శివరాజ్‌కు బీజేపీ అధిష్టానం మళ్లీ అవకాశం ఇవ్వడం లేదంటూ పుకార్లు షికారు చేస్తుండటంతో శివరాజ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

గగన్‌యాన్‌లో కీలక ప్రయోగానికి ఇస్రో సిద్ధం

ఈ నెలాఖరుకి క్రూ ఎస్కేప్ సిస్టమ్ పనితీరుని నిర్ధారించే మానవరహిత టీవీ–డీ1 పరీక్షలు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): అంతరిక్షంలోకి మనుషుల్ని పంపించే ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీలక పరీక్షలకు సిద్ధమైంది. ఈ మిషన్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి మానవరహిత ఫ్లైట్ టెస్ట్‌ల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఈ నెలాఖరుకి ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్–1(టీవీ–డీ1)ను ప్రయోగించనుంది. మానవ రహిత ప్రయోగాలతో సామర్థ్య నిర్ధారణ చేస్తే మానవసహిత ప్రయోగాలకు సోపానం కానున్నాయి. గగన్‌యాన్ మిషన్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థ అత్యంత కీలకమైనది. అంతరిక్షం నుంచి వ్యోమగాములను తిరిగి భూమిపైకి సురక్షితంగా దిగడానికి క్రూ ఎస్కేప్ వ్యవస్థ సాయపడుతుంది. టీవీ–డీ1ను ప్రయోగించడంతో పీడన రహిత క్రూ మాడ్యుల్ చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. క్రూ మాడ్యుల్, క్రూ ఎస్కేప్ వ్యవస్థలతో కూడిన పేలోడ్‌లను రాకెట్ సాయంతో నింగిలోకి ప్రయోగిస్తారు. తిరిగి వచ్చినప్పుడు భూమికి దాదాపు 17 కిలోమీటర్ల ఎత్తులో వ్యోమనౌక నుంచి క్రూ మాడ్యూల్ విడిపోతుంది. అక్కడ్నుంచి వ్యోమగాములు పారాచూట్ల సాయంతో శ్రీహరి కోటకు 10 కిలోమీటర్ల దూరంలో బంగాళఖాతం తీరంలో దిగేలా ఏర్పాట్లు చేశారు. ఎల్‌వీఎం3 రాకెట్ ద్వారా మొదటిసారిగా క్రూ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లి దానిని మళ్లీ బంగాళాఖాతంలోకి సురక్షితంగా దించే ప్రయోగాన్ని చేసేందుకు సిద్ధమవుతున్నారు. భారత నావికా దళం సాయంతో క్రూ మాడ్యుల్ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టనుంది. గగన్‌యాన్ సన్నద్ధతలో ఈ ప్రయోగం అత్యంత కీలకమైన ఘట్టంగా ఇస్రో పేర్కొంది.


సిద్ధంగా ఉన్న క్రూ ఎస్కేప్ సిస్టం

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం। 8। అక్టోబర్। 2023

నవంబరులో కుల గణన నివేదిక: సీఎం

మైసూరు: వెనుకబడిన వర్గాల కమిషన్ అధ్యక్షుడు కాంతరాజు నేతృత్వంలో గత సీఎం హెచ్‌డీ కుమారస్వామి రాష్ట్రంలో చేపట్టిన కుల గణన నివేదిక అమల్లోకి రాలేదని, తాజాగా కొత్త అధ్యక్షుని నేతృత్వంలో చేపట్టిన కులగణన నివేదిక ఈ నవంబర్‌లో వచ్చే అవకాశం ఉందని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. శనివారం మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నేడు ఏ సామాజికవర్గం ఏ స్థితిలో ఉందో కుల గణన ద్వారా తెలుస్తుందని చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అసమానతలను తొలగించేందుకు ఈ కులగణన నివేదిక ఎంతో అవసరమన్నారు.

న్యూస్‌రీల్

ఆస్తి కోసం మహిళ హత్య



తుమకూరు: ఆస్తి విషయంలో జరిగిన గొడవలో ఒక మహిళ దారుణ హత్యకు గురైంది. శివమ్మ అనే మహిళను నందీశ అనే వ్యక్తి హత్య చేశాడు. ఈ ఘటన తుమకూరు జిల్లా తురువేకెరె తాలూకా దండినశివ వద్ద ఉన్న డి.పాళ్యలో జరిగింది. నందీశ్, శివమ్మ మధ్య గత కొన్ని ఏళ్లుగా ఆస్తి గొడవ ఉంది. ఇదే విషయంపై తాజాగా మరోసారి గొడవ జరిగింది. మాట మాట పెరిగింది. తీవ్ర ఆగ్రహంతో శివమ్మపై నందీశ్ కత్తితో దాడి చేసి చంపేశాడు. తీవ్ర రక్తస్రావంతో శివమ్మ అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. హత్య అనంతరం నందీశ్ దండినశివర పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్డి శుభ్రం చేయించిన ఉపాధ్యాయుడు

- విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

దొడ్డబళ్లాపురం: మూడవ తరగతి విద్యార్థిని చేతికి యాసిడ్ ఇచ్చిన ఉపాధ్యాయుడు తన ఇంట్లో మరుగుదొడ్డి శుభ్రం చేయించగా విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మాగడి తాలూకా తూబినకెరె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న హేమలత అనే విద్యార్థిని చేత అదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తన ఇంటికి తీసికెళ్లి యాసిడ్ చేతికిచ్చి మరుగుదొడ్డి శుభ్రం చేయించాడు. అయితే ఇంటికి వెళ్లిన హేమలత తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే ఆస్పత్రికి తరలించిన తల్లితండ్రులు ఆరాతీయగా యాసిడ్ వాసనకు అస్వస్థతకు గురైనట్టు తెలిపింది. విద్యార్థిని చేత ఇలాంటి పనులు చేయించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండు చేస్తున్నారు.

పల్లకీ ఏసీ బస్సులు ప్రారంభం



శివాజీనగర: కేఎస్ ఆర్టీసీ ఏసీ స్లీపర్ పల్లకీ బస్సులను సీఎం సిద్దరామయ్య శనివారం విధానసౌధ ముందు జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. రవాణామంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ 4 ఆర్టీసీ కార్పొరేషన్‌లలో 24 వేల బస్సులు సంచరిస్తాయి. ప్రతి సంవత్సరం 10 శాతం బస్సులు పనికిరాకుండా పోతాయి, గత ఆరేళ్ల నుంచి కొత్త బస్సులను కొనుగోలు చేయలేదు. వచ్చే ఏడాది 1 వెయ్యి బస్సులను సిద్ధం చేస్తామన్నారు. జనాభాతో పోలిస్తే బస్సులు ఇంకా ఎక్కువగా ఉండాలన్నారు. పల్లకీ బస్సులో 30 స్లీపర్ బెర్త్ సీట్లు ఉంటాయి. ఇవి ప్రముఖ నగరాల మధ్య దూర ప్రాంతాలకు సంచరిస్తాయి.



శనివారం వివిధ వీరశైవ సంఘాల ఆధ్వర్యంలో మైసూరులో జరిగిన బసవ జయంతి ఊరేగింపు

టపాసుల గోదాములో మృత్యుకేళి

- ఆకస్మిక అగ్ని ప్రమాదంలో 13 మంది మృత్యువాత
- బెంగళూరు- హోసూరు సరిహద్దుల్లో ఘోర విషాదం



మంటల్లో కాలిపోతున్న టపాసుల షాపు కమ్ గోదాము


హోసూరు: హోసూరు- బెంగళూరు హైవేపై రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో అత్తిపల్లి (అత్తిబెలె) వద్ద శనివారం సాయంత్రం బాలాజీ టపాసుల షాపు కమ్ గోదాములో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల మేరకు త్వరలో దీపావళి వస్తుండడంతో టపాసుల అంగళ్లు వెలిశాయి. పై గోదాములో ఆకస్మికంగా మంటలు చెలరేగి టపాకాయలు విస్ఫోటం చెందాయి. పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు, మంటలతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. నవీన్ అనే వ్యాపారి తన గోదాములోకి కంటైనర్ నుంచి టపాసుల పెట్టెలను తరలిస్తుండగా అవి పేలి ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. టపాసుల గోదాములో 13 మంది వరకూ మృత్యువాత పడినట్లు సమాచారం. మరో 10 మంది వరకూ గాయపడ్డారు. గోదాము యజమాని నవీన్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

భీకరంగా మంటలు

ఇరు రాష్ట్రాలకు చెందిన ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ మంటలు చుట్టుపక్కల ఉన్న దుకాణాలకు కూడా పాకడంతో ఆర్పడం కష్టమైంది. కొన్నిగంటల పాటు ప్రయత్నించాక ఆర్పివేశారు. ఈ ప్రమాదంలోఓ కంటైనర్ లారీ, మూడు ద్విచక్రవాహనాలు, మరో రెండు లారీలు సహా 10 వాహనాలు ఆహుతయ్యాయి. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అర్ధరాత్రి వరకూ మృతదేహాల వెలికితీత కొనసాగింది. అత్తిబెలె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. గోదాములో మరో మూడు మృతదేహాలు ఉండవచ్చని భావిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. నగర పరిధిలో ఇంత ఘోర అగ్ని ప్రమాదం ఇటీవలి కాలంలో జరగలేదు.



భారీ ఎత్తున రేగిన పొగ, మంటలు, కాలుతున్న వాహనాలు



బెంగళూరు- హోసూరు హైవేపై నిలిచిపోయిన ట్రాఫిక్

ప్రొఫెసర్ కారు బీభత్సం



ప్రమాదానికి కారణమైన కారు

- ఇద్దరు విద్యార్థినులకు గాయాలు
- మహారాణి క్లస్టర్ కాలేజీలో ఘటన

శివాజీనగర: నగరంలో ఓ విద్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ కారు అదుపుతప్పి విద్యార్థుల మీదకు దూసుకెళ్లింది. శనివారం మహారాణి క్లస్టర్ కాలేజీ ఆవరణలో వద్ద ఈ దుర్ఘటన జరిగింది. వివరాలు... ఇంగ్లిష్ ప్రొఫెసర్ హెచ్.నాగరాజు కారు తీసుకొని వర్సిటీకి వచ్చారు, కారును పార్క్ చేస్తూ బ్రేక్‌కి బదులుగా యాక్సిలేటర్‌ను నొక్కడంతో కారు వేగంగా దూసుకెళ్లి దారిలో వెళ్తున్న ఇద్దరు యువతులను ఢీకొట్టింది, అలాగే మరో రెండు కార్లను ఢీకొని నిలిచిపోయింది. మొత్తం మూడు వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అశ్విని (19) అనే బీకాం విద్యార్థినికి తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉంది, మరో యువతి నందుప్రియకు స్వల్ప గాయాలు తగిలాయి, నాగరాజుకు కూడా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేరాడు. డీసీపీ ఘోర్పడే ఘటనాస్థలిని పరిశీలించి మాట్లాడుతూ, నిందితుడు నాగరాజుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ ప్రమాదంలో మరో ప్రొఫెసర్‌కు కూడా స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.



ఘటనాస్థలిలో ధ్వంసమైన కార్లు, రక్తపు మరకలు

టెక్కీ విషాదాంతం

- బలిగొన్న మాజీ ప్రియురాలి వేధింపులు



కృష్ణరాజపురం: మాజీ ప్రియురాలి వేధింపులను తట్టుకోలేక టెక్కీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు రామ్మూర్తినగరలో జరిగింది. అతని సోదరుని ఫిర్యాదు మేరకు ప్రస్తుత ప్రేయసి, మాజీ ప్రియురాలిపై రామ్మూర్తినగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక ప్రముఖ కంపెనీలో బీపీఓ విభాగంలో పని చేస్తున్న సంతోష్, అదే కంపెనీలో పని చేసే యువతిని ప్రేమించాడు. వీరిద్దరూ నాలుగేళ్లుగా షికార్లకు కూడా వెళ్లారు, అయితే కొన్ని నెలల క్రితం ఇద్దరి మధ్య గొడవలు వచ్చి విడిపోయారు. ఆ తర్వాత సంతోష్ అదే కంపెనీలో మరో యువతితో ప్రేమలో పడ్డాడు. కొత్త ప్రియురాలితో సంతోష్ సరదాగా తిరగడం చూసి పాత ప్రియురాలు సహించలేకపోయింది. ఇతర ఉద్యోగుల ముందే సంతోష్‌తో పాత ప్రియురాలి ఘర్షణ పడి కొట్టింది. అంతేకాకుండా తనతో ప్రేమలో ఉన్నప్పుడు తీసుకున్న ఫోటోలను సోషల్‌మీడియాలో పెడతానని బెదిరించింది. ఇదంతా చూసి కంపెనీ ఆమెను వేరే చోటికి బదిలీ చేసింది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

నీ కొత్త ప్రియురాలితో కలసి నన్ను బదిలీ చేయించావ్ కదా అని సంతోష్‌ను ఫోన్‌లో వేధించసాగింది. ఈ రగడపై కొత్త ప్రియురాలు కూడా సంతోష్‌ను గట్టిగా ప్రశ్నించింది. ఈ పరిణామాలతో విరక్తి చెందిన సంతోష్ 3వ తేదీన ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు, అయితే పరిస్థితి విషమించి మరణించాడు. ఆత్మహత్యకు ఆ ఇద్దరు యువతులే కారణమని అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

ఫైనాన్స్ వేధింపులతో.. మహిళా రైతు ఆత్మహత్య

యశవంతపుర: అప్పు చెల్లించాలనే ఫైనాన్స్ సిబ్బంది వేధింపులను తాళలేక మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా తంగలి గ్రామంలో జరిగింది. దేవీరమ్మ (64) అనే వృద్ధురాలు చిన్నపాటి పొలంలో సేద్యం చేసేది, ఇందుకోసం కడూరు గ్రామీణ కోట ఫైనాన్స్‌లో రూ.78 వేలు రుణం తీసుకుంది, వారానికి ఒకసారి కొంతమొత్తంను చెల్లించాలి. వానలు లేక పంట పండకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. కంతులు కట్టాలని ఫైనాన్స్ సంస్థ సిబ్బంది రోజూ ఇంటివద్దకు వెళ్లి ఆమెను ఒత్తిడి చేసేవారు. ఫైనాన్స్ ఆఫీసు వెళ్లి ఉన్నతాధికారులకు మొరపెట్టుకోగా.. ముందు డబ్బులు కట్టి బయటకు వెళ్లు అని దూషించారు. దీంతో విరక్తి చెందిన ఆమె ఇంటి వద్ద ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. కడూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువ వైభవం

- ఉత్సాహంగా మైసూరు యువ దసరా

మైసూరు: నాడ హబ్బ మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా ప్రారంభం అయిన యువ దసరా సంభ్రమ మానస గంగోత్రిలోని రంగమందిరంలో వర్ణరంజితంగా ప్రారంభమైంది. జిల్లా మంత్రి హెచ్‌సీ మహదేవప్ప, చిత్ర నటులు వశిష్ట- హరిప్రియ దంపతులు, ఎమ్మెల్యే తదితరులు డోలు వాయించి నాంది పలికారు. ఈ సందర్భంగా వివిధ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. భక్తి, జానపద, దేశభక్తి, సినిమా పాటలకు నృత్యాలతో అదుర్స్ అనిపించారు. దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ పాటలను గాయకులు ప్రత్యేకంగా ఆలపించారు.



యువ దసరా సంభ్రమలో బాలల నృత్య ప్రదర్శన



త్రిశూల నాట్య సంరంభం



దేవీ వైభవాన్ని చాటే నృత్య రూపకం

ఖాకీలపై బిట్‌కాయిన్ పంజా

- గతంలో దర్యాప్తు చేసిన పోలీసుల ఇళ్లలో సిట్ సోదాలు
- అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలే కారణం





గత మూడేళ్లుగా రాష్ట్ర రాజకీయాలపై బిట్‌కాయిన్ స్కాం నీడలు

బనశంకరి: గతంలో బీజేపీ సర్కారు హయాంలో వెలుగుచూసిన బిట్‌కాయిన్ స్కాం మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. శనివారం నగరవ్యాప్తంగా పలువురు పోలీసుల ఇళ్లలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించడంతో కలకలం నెలకొంది. గతంలో బిట్‌కాయిన్ కేసు విచారణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సోదాలను ప్రారంభించారు. సీసీబీ ఎస్ఐ శ్రీధర్ పూజార్ ఇంటిలో సిట్ పోలీసులు సోదాలు చేశారు. నగరంలో తుమకూరు రోడ్డు ప్రెస్టేజ్ జిందాల్ సిటీ అపార్టుమెంట్‌లోని ఆయన ఫ్లాటులో తనిఖీలు సాగాయి. బొమ్మనహళ్లి సలార్‌పురియా అపార్టుమెంట్‌లో నివసించే ఐటీ నిపుణుడు సంతోష్ ఫ్లాటులోనూ గాలింపు జరిగింది. రామమూర్తినగర లో నివాసం ఉంటున్న ఎస్ఐ చంద్రధర్, లక్ష్మీకాంత్ సహా ఐదుమంది ఎస్ఐల నివాసాలలో సోదాలు నిర్వహించారు. గతంలో వీరందరూ సీసీబీలో ఉంటూ బిట్‌కాయిన్ కేసును దర్యాప్తు చేసినవారు, ఆ సమయంలో అలసత్వం చూపడం వెనుక కారణాలేమైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. వారి ఇళ్లలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ తో పాటు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. బిట్‌కాయిన్ కుంభకోణం కాంగ్రెస్ సర్కారు సిట్ ద్వారా దర్యాప్తు చేయించడం తెలిసిందే.

ఇద్దరు హవాలా బ్రోకర్ల అరెస్టు

గతంలో బిట్‌కాయిన్ కేసు నిందితులు రాష్ట్ర ప్రభుత్వ ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ని హ్యాక్ చేసి రూ.11.5 కోట్లు కొట్టేసిన కేసులో ఇద్దరిని శనివారం పోలీసులు అరెస్ట్‌చేశారు. నగదు లావాదేవీలు చేశారని సీఐడీ, ఎస్ఐటీ పోలీసులు నాగపుర నితిన్ మేశ్రామ్, దర్శిత్‌పటేల్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. వీరు హవాలా ఏజెంట్లని సమాచారం. వీరికి ప్రధాన నిందితుడు హ్యాకర్ శ్రీకితో లింకులున్నట్లు చెబుతున్నారు. శ్రీకృష్ణ అలియాస్ శ్రీకి 2019లో రాష్ట్ర ప్రభుత్వ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ని హ్యాక్‌చేసి రూ.11.5 కోట్ల సొమ్ము దోచుకున్నట్లు కేసు ఉంది. శ్రీకి ఈ నగదును ఉత్తర భారతదేశంలోని కొందరు వ్యక్తుల అకౌంట్లలోకి జమచేశాడు. ఆపై అదే డబ్బును పై ఇద్దరు వ్యక్తులు బెంగళూరుకు హవాలా రూపంలో పంపించారు. పంజాబ్ కు చెందిన హర్వీందర్‌సింగ్ అనే హవాలా ఏజెంటు పేరు కూడా వచ్చింది, అతన్ని విచారించి బిట్‌కాయిన్లతో సంబంధం లేదని వదిలిపెట్టారు.

జులాయి భర్త కిరాతకం

- వీడియోలను నెట్లో పోస్ట్ చేస్తానని భార్యకు వేధింపులు



బనశంకరి: రూ.10 లక్షలు ఇవ్వకపోతే ప్రైవేటు వీడియోలను ఇంటర్నెట్లో పోస్ట్ చేస్తానని భార్యను ఓ కిరాతక భర్త వేధిస్తున్నాడు. బెంగళూరుకు చెందిన 28 ఏళ్ల మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అతని తల్లిదండ్రులపై బసవనగుడి మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. సదరు యువతికి 2022 నవంబరులో చిక్కమగళూరుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. పెళ్లయిన కొత్తలో హనీమూన్‌కు థాయ్‌లాండ్‌కు వెళ్లారు. భర్త ఆమెకు బలవంతంగా మద్యం తాగించి, పోర్న్ వీడియోలు చూపించి సతాయించాడు. తరువాత చిక్కమగళూరులో ఇంట్లో పడక గదిలో రహస్యంగా కెమెరాను అమర్చి రికార్డింగు చేసుకున్నాడు.

సొంత కంపెనీ అని అబద్ధాలు

సొంత భవన నిర్మాణ సంస్థ ఉందని అతడు చెప్పుకున్నాడు, కానీ పెళ్లయ్యాక నిరుద్యోగి అని, ఏ పనీ చేయకుండా తిరిగేవాడని ఆమెకు తెలిసింది. దీనిపై ప్రశ్నిస్తే పట్టించుకునేవాడు కాదు. ఆమె ఉద్యోగం చేస్తుండగా జీతం మొత్తం తన ఖాతాలోకి వేయాలని, పుట్టింటి నుంచి రూ.10 లక్షలు తీసుకురావాలని పీడించేవాడు. లేదంటే ప్రైవేటు దృశ్యాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడు. అతని పోరు భరించలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

కేజీ హళ్లి అల్లర్ల కేసుల రద్దు వద్దు

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: కేజీహళ్లి, డీజీహళ్లి అల్లర్ల కేసులను ఎట్టిపరిస్థితుల్లో ఉపసంహరించుకోరాదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాష్ట్రప్రభుత్వానికి సూచించారు. ధార్వాడలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో కోలారులో తల్వార్ ఝళిపించారు. ఆ తర్వాత శివమొగ్గలో అదే చేశారన్నారు. ఇళ్లలోకి జొరబడి ప్రజలను కొట్టారన్నారు. ఈ ధైర్యం ఎలా వచ్చింది, ఎంత అల్లర్లు చేసినా కాంగ్రెస్ అధికారంలో ఉంటే కేసులు వేయదన్న తెగింపు వారిలో ఉందన్నారు. ప్రజలకు వివిధ పథకాల ద్వారా చెల్లింపులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రణాళిక లేకుండా ఖర్చు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవాలన్న ఒకే ఒక్క ఆశతో కాంగ్రెస్ ఎంత ఖర్చు అవుతుంది. వనరులు ఎంత మేరకు కావాలనే విషయాలను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం వచ్చాక అన్ని సౌకర్యాలను బంద్ చేస్తోందన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రశస్తులను అందుకున్న విద్యార్థులు

కంప్లి: బళ్లారిలో నిర్వహించిన కలబురిగి విభాగ స్థాయి దసరా క్రీడోత్సవాల్లో కంప్లి యక్షయోగా కేంద్రం విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వైఎస్.యోగేష్ ప్రథమ స్థానంతో బంగారు పతకం పొందగా, సంప్రదాయక యోగాలో వెండి పతకం గెలుచుకున్నాడు. కళాత్మక, 8 దమక్ జంట యోగాసనలో ఎస్.గౌతమి, ఎస్.భూమిక బంగారు, 8 దమక్ యోగాసనలో మణికంఠ శశాంక్ వెండి పతకం గెలుచుకొని రాష్ట్ర స్థాయి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను యక్షయోగా కేంద్రం అభినందించింది.

రిజర్వేషన్లలో అన్యాయాన్ని సరిచేయరూ..

రాయచూరు రూరల్: తాలూకాలోని కల్మల జీపీ అధ్యక్ష పదవి రిజర్వేషన్లలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని వాల్మీకి నాయక్ సింహగర్జన సంఘం డిమాండ్ చేసింది. శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు రవి మాట్లాడారు. మొదటి విడత రిజర్వేషన్లలో అధ్యక్ష జనరల్, ఉపాధ్యక్ష స్థానం ఎస్సీలకు కేటాయించారన్నారు. రెండో విడతలో అధికారులు, రాజకీయ నేతలు అధ్యక్ష స్థానం ఎస్సీ, ఉపాధ్యక్ష స్థానం జనరల్‌కు కేటాయించి ఎస్టీలకు అన్యాయం చేశారని, దానిని సవరించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాది కావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సురేష్

రాయచూరు రూరల్: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాది కావాలని జిల్లా అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. శనివారం తాలూకాలోని సింగనోడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, పిల్లల సంక్షేమ కోసం వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. ప్రతిభకు అనుగుణంగా తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తాలూకా విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున గౌడ, జిల్లా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బసప్ప, రాఘవేంద్రలున్నారు.

ప్రామాణికంగా పని చేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయులు ప్రామాణికతతో విధులు నిర్వహించాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజ్ పేర్కొన్నారు. శనివారం కన్నడ భవనంలో ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూలు అతిథి ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిలో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు నాంది పలకాలన్నారు. సమావేశంలో ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత, ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూలు అతిథి ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నాగరాజ్, నరసింహులు, సుజాత తదితరులున్నారు.

సిరిధాన్యాల సాగుతో భూసార రక్షణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కంప్లి: భూసార రక్షణకు సిరిధాన్యాలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని టీపీ ఈఓ ఆర్‌కే శ్రీకుమార్ తెలిపారు. పట్టణంలోని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రంలో తాలూకా యోజన వ్యవసాయ మహోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం ఒకే రకమైన పంటను పండించడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. దీంతో రైతులు వివిధ ఉత్పత్తులను పండించేందుకు ఆసక్తి చూపాలన్నారు. అదే విధంగా భూమికి బయోమాస్ ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గదన్నారు.

బృందాలకు రైతుల కన్నీటి ఏకరువు

- పలు జిల్లాల్లో విస్తృతంగా కరువు అధ్యయన బృందాల పర్యటన
- దెబ్బ తిన్న పంటలు పరిశీలించి రైతుల గోడు ఆలకింపు



బళ్లారి జిల్లాలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న కేంద్ర కరువు అధ్యయన బృందం

సాక్షి, బళ్లారి: ఆరుగాలం కష్టపడి పని చేసిన రైతుల పరిస్థితి ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో దయనీయంగా మారిన నేపథ్యంలో పంటలను పరిశీలించేందుకు విచ్చేసిన కేంద్ర కరువు అధ్యయన బృందం రెండో రోజు పలు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. శనివారం కేంద్ర అధ్యయన కరువు బృందం ప్రతినిధులు బళ్లారి, విజయనగర, చిత్రదుర్గ, దావణగెరె, బాగల్‌కోటె తదితర జిల్లాల్లో వేర్వేరు బృందాలుగా ఏర్పడి రైతుల పంట పొలాలను ఆయా జిల్లాధికారులు, వ్యవసాయ, రెవిన్యూ, పోలీసు అధికారులు, రైతు సంఘం నేతలతో కలిసి పరిశీలించారు. రైతులు డాక్టర్ రాజశేఖర్ నేతృత్వంలోని కరువు అధ్యయన బృందంతో తమ పంటలు ఎండిపోయిన విషయాన్ని తెలియజేసి కన్నీళ్లు పెట్టుకుని ఆదుకోవాలని విన్నవించారు. బళ్లారి జిల్లాలోని సండూరు సుగ్గేనహళ్లి, కోడిహళ్లి, మిడగుర్తి గ్రామాల్లో రైతుల పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో నాగేంద్రప్ప, కుమార స్వామి తదితర రైతులకు చెందిన టమాటా, మొక్కజొన్న, రాగి తదితర పంటలను పరిశీలించి రైతుల గోడు ఆలకించారు.

ఆదుకుంటామని అధికారుల భరోసా

తప్పకుండా ఆదుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు. చిత్రదుర్గ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కరువు ఛాయలు ఏర్పడ్డాయని, ఖరీఫ్ సీజన్‌లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, సంబంధిత కేంద్ర అధ్యయన బృందం అధికారులు అశోక్ కుమార్ నేతృత్వంలో కరుణ్‌చౌదరి, సంగీత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులకు రైతుల సమస్యలను వివరించారు. చిత్రదుర్గ తాలూకాలోని విజాపుర గ్రామంలో మల్లికార్జునయ్య, తిప్పేస్వామి మొక్కజొన్న పంటలను, సౌభాగ్యమ్మ రాగి పంటను పరిశీలించారు. మొత్తం పంటలను ఎండిపోయిన దృశ్యాలను చూసి అధికారులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. బిరావర గ్రామానికి చెందిన వినయ్, పరమశివయ్య, హరీష్ తదితరుల పంట పొలాలను చూశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన రాగి, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఉదయం నుంచి,సాయంత్రం వరకు కేంద్ర అధ్యయన బృందం ముమ్మరంగా పర్యటించడంతో రైతులు తమ గోడును వివరించి ఏదైనా సహాయం వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నట్లు రైతులు చెప్పారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారానికి వినతి

చిత్రదుర్గ జిల్లాకు చెందిన రైతులు ఈశన్న, రవి నారాయణలు మాట్లాడుతూ జిల్లాలో ఒక వర్షం కూడా సరిగా రాలేదని, పంటలు పూర్తిగా ఎండిపోయాయని, ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. రైతుల పంటలకే కాకుండా పశువులకు మేత కూడా కరువుగా మారుతుందని గుర్తు చేశారు. ఆయా గ్రామాల్లో కేంద్ర కరువు బృందం వస్తుందని తెలుసుకున్న రైతులు పొలాల్లోకి పరుగులు తీసి తమ దయనీయమైన పరిస్థితులను వివరించారు. సమస్యలను తెలుసుకున్న అధికారులు పంట నష్టపరిహారంపై చర్చిస్తామని తెలియజేశారు. బాగల్‌కోటె జిల్లా చిటిగినకొప్ప, హొసూరు, హునగుంద తదితర తాలూకాల్లోని నందనూరు, రక్కసి తదితర గ్రామాల్లో రైతుల పొలాల్లో విస్తృతంగా పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో చూసినా ఈసారి తీవ్రంగా పంటలు నష్టపోయి రైతులు కూడా కూలీలుగా మారే ప్రమాదం ఉన్నందున ఉపాధీ హామీ పని దినాలు పెంచి రైతులను ఆదుకోవాలని విన్నవించారు.

లోక్‌సభకు పోటీ చేయను: శ్రీరాములు

మైసూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని బీజేపీ మాజీ మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. చామరాజనగర పర్యాటక మందిరంలో మీడియాతో శ్రీరాములు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఎలాంటి ఆలోచన లేదని, తన పోటీపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఒకవేళ ఇతరులకు టికెట్ ఇస్తే వారి గెలుపునకు కృషి చేస్తానన్నారు. జేడీఎస్‌తో మైత్రిపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

విజేతలకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీతకు స్కౌట్స్ అండ్స్ గైడ్స్ సంస్థ వేదికను కల్పిస్తోందని సంస్థ ముఖ్య కమిషనర్ కె వి శంకరప్ప తెలిపారు. శనివారం స్కౌట్స్ భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి దేశభక్తి గీతాలాపన పోటీల విజేతలకు సర్టిఫికెట్లను అందించి ఆయన మాట్లాడారు. సంస్థ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు వారిని అన్ని రంగాల్లో రాణించేలా చేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ సంస్థ కార్యకలాపాలకు ప్రతి పాఠశాలలో అవకాశం కల్పించాలన్నారు. సంస్థ విద్యార్థుల్లో క్రమశిక్షణను అలవరుస్తుందన్నారు. సంస్థ పదాధికారులు సురేష్, నారాయణ స్వామి, ఉమాదేవి, స్కౌట్‌బాబు పాల్గొన్నారు.

10న తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని మత్తికెరె హెచ్‌ఎంటీ లేఔట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో ఈ నెల 10న మంగళవారం కర్నాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరుగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజమిన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్ పాల్, డాక్టర్ రెవరెండ్ జే.డీ.మోజస్ దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

తుమకూరు: భార్యను హత్య చేసిన కేసులో పోలీసులు భర్తను అరెస్ట్ చేశారు. తుమకూరు తాలూకా మల్లసంద్రలో మంజునాథ్ వాణిశ్రీ (32)లు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో వాణిశ్రీ చనిపోయింది. ఈ విషయంపై వాణిశ్రీ కుటుంబ సభ్యులు భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసుకున్న గ్రామీణ పోలీసులు దర్యాప్తు జరిపి మంజునాథ్‌ను అరెస్టు చేశారు. వాణిశ్రీ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. దీంతో తరచూ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించడం కష్టం కావడంతో మంజునాథ్ ఆమెను చంపేసినట్లు తెలుస్తోంది.

హంపీలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బృందం తనిఖీ



హంపీలో పర్యటిస్తున్న అడ్వకేట్ జనరల్ శశికుమార్ శెట్టి, ఇతర అధికారుల బృందం

హొసపేటె: రాష్ట్ర అడ్వకేట్ జనరల్ శశికుమార్ శెట్టి నేతృత్వంలోని అధికారుల బృందం శనివారం హంపీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హంపీతో పాటు పరిసర ప్రాంతాల్లో గంజాయి, అనైతిక కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపించడంతో కోర్టు హంపీలో ఉన్న హోంస్టేలను నిలిపివేయాలని తీర్పు ఇచ్చింది. ఈ విషయంపై హంపీ వాసులు మాజీ లోక్‌సభ సభ్యుడు వీఎస్ ఉగ్రప్ప ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసి తమకు హోంస్టేలను నడిపించేందుకు అనుకూలం కల్పించాలని కోరారు. ఈ విషయంపై అడ్వకేట్ జనరల్ బృందం హంపీతో పాటు చుట్టుపక్కల ఉన్న కడ్డిరాంపురతో సహా పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను ఆరా తీశారు. మాజీ ఎంపీ ఉగ్రప్ప, విజయనగర జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ కమనీయ భక్తి



సంగీత కచేరి నిర్వహిస్తున్న కోనసీమ జిల్లా సత్యసాయి భక్తులు



సాయికుల్వంత్ సభామందిరంలో ప్రదర్శించిన సాయి ప్రేమ నాటికలో ఒక ఘట్టం

- సాయి సన్నిధిలో ప్రదర్శనలు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో సత్యసాయి సన్నిధిలో కోనసీమ సత్యసాయి భక్తులు సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కోనసీమ జిల్లా సత్యసాయి భక్తులు సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి పూజలు చేశారు. తరువాత బాలవికాస్ చిన్నారులు చక్కని ప్రదర్శన నిర్వహించారు. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు సత్యసాయి సందేశాలను, ఆయన బోధించిన విలువలను చాటే ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. సాయి ప్రేమ నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది.

పెయింటింగ్స్‌లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన చిత్రకారిణి అనుపమ

బనశంకరి: తన మదిలోని భావాలు, ఆలోచనలతో నవ్యమైన పెయింటింగ్స్ గీస్తూ పలు అవార్డులు దక్కించుకుని అందరి మన్ననలు పొందుతూ ప్రశంసలు అందుకుంటున్న వర్ధమాన చిత్రకారిణి అనుపమ మరో పురస్కారాన్ని అందుకున్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలబుర్గిలోని కన్నడ భవన్‌లో ఈనెల 2న ఇండియన్ రాయల్ అకాడమి ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ ఏర్పాటు చేసిన 19వ వార్షికోత్సవంలో ఇండియన్ రాయల్ అకాడమి జాతీయ పురస్కారం, బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా అనుపమ మాట్లాడుతూ... జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. కొత్తదనం, నవ్యమైన చిత్రాలు గీయడమే తన లక్ష్యమన్నారు.

అల్లం పంట చోరీ

మైసూరు: దుకాణాలు, వాహనాలు, ఇళ్లల్లో దొంగతనాలు చేసే దొంగలు కొత్తగా పొలాల్లో రైతులు సాగు చేసే పంటలను దొంగతనం చేస్తున్నారు. తెల్లవారేలోగా చొరబడి దొంగలు లక్షలాది రూపాయల విలువైన పంటలను చోరీ చేయడంతో రైతులు గొల్లుమంటున్నారు. మొన్నటివరకు టమాటా, దానిమ్మ పంటలను ఎత్తుకెళ్లడం తెలిసిందే. జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా టిబెటన్ శిబిరంలో అల్లం సాగు చేశారు. దొంగలు ఆ పొలంలోకి చొరబడి అల్లం సాగును దొంగతనం చేశారు. బైలుకుప్పే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

కరువు పీడిత తాలూకాల్లో భారీ నష్టం

కంప్లి: విజయనగర జిల్లాలోని హూవినహడగలిని కరువు పీడిత తాలూకాగా ప్రకటించగా, హూవినహడగలి, హరపనహళ్లి తాలూకాల్లో సంభవించిన వ్యవసాయ, ఉద్యానవన పంటల నష్టం వివరాలు ఇలా ఉన్నాయి. హూవినహడగలి తాలూకాలో మొత్తం 52,083 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లగా రూ.277.98 కోట్ల నష్టం కల్గింది. హరపనహళ్లి తాలూకాలో 83,986 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లగా రూ.440.446 కోట్ల మేర నష్టం కల్గినట్లు అంచనా వేశారు.

వైద్యుడికి భారీ జరిమానా

యశవంతపుర: గర్భిణి మృతి కేసులో వైద్యుడికి రూ.11 లక్షల జరిమానా విధిస్తూ వినియోగదారుల ఫోరం తీర్పు ఇచ్చింది. వివరాలు... సకలేశపుర తాలూకా ఆనెమహల్‌కు చెందిన మోహన్‌కుమార్ భార్య ఆషా 2021 మార్చిలో ప్రసవం కోసం హాసన జిల్లా సకలేశపుర క్రాఫర్డ్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం స్కానింగ్ చేసి కడుపులో బిడ్డ చనిపోయిందని చెప్పారు. వెంటనే ఆపరేషన్ చేయడంలో వైద్యుడు పురుషోత్తం నిర్లక్ష్యం చేయడంతో ఆషా కూడా చనిపోయింది. దీంతో బాధితుడు మోహన్‌కుమార్ ఆస్పత్రి స్త్రీరోగ వైద్యుడు పురుషోత్తంపై జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన ఫోరం గర్భిణి మృతికి నిర్లక్ష్యమే కారణమని గుర్తించి వైద్యుడు పురుషోత్తంకు రూ.11 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

డ్రగ్స్ పెడ్లర్ అరెస్ట్

మత్తు పదార్థాలను అమ్ముతున్న విదేశీ పౌరుడిని బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిస్టోఫర్ (20)ను చిక్కబాణావర కెరెగుడ్డ వద్ద డ్రగ్స్ అమ్ముతుండగా సీసీబీ సీఐ మోహమ్మద్ ముకురమ్ నేతృత్వంలో పోలీసులు దాడి చేసి రూ.50 లక్షలు విలువగల ఎండీఎంఎ క్రిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు క్రిస్టోఫర్ వీసా ముగిసినా బెంగళూరులో నివసిస్తున్నట్లు బయట పడింది. సోలదేవనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కావేరి విషయంలో మౌనం దురదృష్టకరం

మండ్య: కావేరి నీటి పంపిణీ విషయంలో కర్ణాటకకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమని బేబి బెట్ట శ్రీరామయోగేశ్వర మఠాధిపతి శివబసవస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సర్ ఎంవీ విగ్రహం ఎదుట జిల్లా రైతు హితరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం ప్రభుత్వాలు ఉన్నాయని, అయితే కర్ణాటకకు అన్యాయం జరుగుతున్నా సిద్దరామయ్య సర్కార్ మౌనం వహిస్తూ తమిళనాడుకు నీటిని పంపిణీ చేయడం దురదృష్టకరమని చెప్పారు.

గంజాయి విక్రేతలకు జైలు

శివమొగ్గ: గంజాయి విక్రయం కేసులో ఇద్దరికి ఇక్కడి కోర్టు రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. శివమొగ్గ బాపూజీ నగరకు చెందిన రాహీల్ ఖాన్, వినోబనగరకు చెందిన రోహన్‌లకు కోర్టు శిక్ష విధించింది. గత నెల 5న శివమొగ్గ గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలోని గురుపుర గ్రామంలో మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో డీఎస్పీ ఉమేశ్ ఈశ్వర్ నేతృత్వంలో పోలీసులు దాడి చేసి రాహీల్, రోహన్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి కేజీ గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో దోషులకు కోర్టు శిక్ష విధించింది.

చెలరేగిన సైబర్ నేరగాళ్లు

- ఇద్దరికి రూ.31.50 లక్షల టోకరా

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగంతో అధిక లాభమని ఒక వ్యక్తికి, ఏటీఎం కార్డు కాల వ్యవధి తీరిపోయిందని మహిళకు సైబర్‌నేరగాళ్లు టోపీ వేసి మొత్తం రూ.31.50 లక్షలు దోచుకున్నారు. వివరాల మేరకు హోసూరు నేతాజీ నగర్‌కు చెందిన కుమరేషన్ (58) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి, గత నెల 18వ తేదీ అతని వాట్సాప్ నంబర్‌కు వచ్చిన మెసేజ్‌పై స్పందించి సంప్రదించాడు. యూట్యూబ్, సోషల్ మీడియాలో పార్ట్ టైం ఉద్యోగం కల్పిస్తామని, దీంతో అధిక లాభం పొందవచ్చునని, ఖాతా పరివర్తన కోసం రూ.21.17 లక్షలు చెల్లించాలని మోసగాళ్లు చెప్పారు. వారి మాటలు నమ్మిన కుమరేషన్ వారందజేసిన ఖాతాలకు నగదును జమ చేశాడు. తరువాత ఆ నంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయిన అతడు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులను ఆశ్రయించాడు. హోసూరు పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన రేఖ (60)కు ఈనెల 4వ తేదీన ఓ వ్యక్తి బ్యాంకు మేనేజర్‌నని ఫోన్ చేశాడు, మీ ఏటీఎం కార్డు కాలవ్యవధి తీరిపోయిందని, రెన్యువల్ కోసం ఓటీపీ తెలియజేయాలన్నాడు, ఆమె చెప్పగా, ఖాతాలోని రూ.10.49 లక్షల నగదును కాజేశాడు. బాధితులు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్త్ విద్యార్థులకు కోచిముల్ సౌకర్యాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

కోలారు: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల కోసం 1.5 లక్షల విలువ చేసే స్మార్ట్ బోర్డులను అందించాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మాలూరు ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కెవై నంజేగౌడ తెలిపారు. శనివారం నగరంలోని చెన్నయ్య రంగ మందిరంలో జిల్లాలోని 137 ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు కోచిముల్ ముద్రించిన సంపన్మూల పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలప్పుడు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసారి జిల్లాలో 100 శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఐఏఎస్, కేఏఎస్ కోచింగ్‌కు వెళ్లే విద్యార్థుల కోసం కోచిముల్ రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. యలహంకలో పాడి రైతుల ఆడపిల్లల కోసం ఉచిత హాస్టల్ వ్యవస్థను కల్పించారన్నారు. జిల్లాధికారి అక్రం పాషా, సీఈఓ పద్మ బసవంతప్ప, కోచిముల్ డైరెక్టర్ కాడేనహళ్లి నాగరాజ్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సీఐకు ఆటో డ్రైవర్ల సన్మానం



సీఐ నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: నగర త్రిచక్ర వాహన సంఘం ఆధ్వర్యంలో రాబర్ట్‌సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఐ నవీన్ కుమార్‌ను సత్కరించారు. ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలోని ఆటో డ్రైవర్లకు ఎదురైన సమస్యలను అందరం కలిసికట్టుగా ఉండి పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ఆటో డ్రైవర్ల సమస్యలపై స్పందించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాలని 11న ముట్టడి



సమావేశమైన రైతు సంఘం పదాధికారులు

శ్రీనివాసపురం: ఆగిపోయిన అటవీ భూముల ఆక్రమణల తొలగింపును కొనసాగించాలని, అటవీ భూములకు కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు అందించిన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేయాలని రైతు సంఘం పదాధికారులు తీర్మానించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో సమావేశమైన రైతు సంఘం పదాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా అటవీ భూములకు సృష్టించిన నకిలీ దాఖలాలతో దరఖాస్తు సమితి ద్వారా ఒకే కుటుంబానికి చట్టవ్యతిరేకంగా వందలాది ఎకరాలను మంజూరు చేశారన్నారు. ఇంతవరకు 1550 ఎకరాలను అటవీశాఖ అధికారులు ఇంతవరకు స్వాధీనం చేసుకున్నారన్నారు. మిగిలిన ఆక్రమిత భూమిని కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ అటవీశాఖ కార్యాలయం ముందు ఈ నెల 11న ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. రైతు సంఘం పదాధికారులు నరసింహయ్య, మంగసంద్ర నాగేష్, కదిరినత్త అప్పోజిరావ్ పాల్గొన్నారు.

జీపీల్లో అక్రమాలపై తనిఖీకి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: బంగారుపేట తాలూకాలోని 21 జీపీల్లో జరిగిన అక్రమాలపై తనిఖీ చేయించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక దళిత రైతు సేన కార్యకర్తలు శనివారం టీపీ ఈఓ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సేన సంస్థాపక అధ్యక్షుడు హుణసనహళ్లి వెంకటేష్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం–1993 ప్రకారం జీపీలకు వచ్చే నిధుల వినియోగానికి గ్రామ, వార్డు, సామాన్య సభలను నిర్వహించి అమోదం పొందాలన్నారు. అయితే ఎక్కడా నియమాలు పాటించలేదన్నారు. పీడీఓలు ప్రజాప్రతినిధుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారని ఆరోపించారు. ఇలా దాదాపు అన్ని జీపీల్లోను అక్రమాలు చోటు చేసుకుని కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సేన గౌరవ అధ్యక్షుడు హుళదేనహళ్లి వెంకటేష్, తాలూకా అధ్యక్షుడు హిరేకరపనహళ్లి మునిరాజ్ పాల్గొన్నారు.

28న వాల్మీకి జయంతికి అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: నగరంలో ఈ నెల 28న మహర్షి వాల్మీకి జయంతి ఆచరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాధికారి అక్రంపాషా సూచించారు. శనివారం తన కార్యాలయ సభాంగణంలో వాల్మీకి జయంతి ఆచరణపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి ఆచరణకు జిల్లా యంత్రాంగంతో ప్రజలు సహకరించాలన్నారు. అఖిల కర్ణాటక వాల్మీకి మహాసభ డైరెక్టర్ సంచికె నారాయణప్ప మాట్లాడుతూ జయంతి రోజున వాల్మీకి చిత్రపటాలను ఊరేగించాలన్నారు. ఆరోజున సాధకులను ఘనంగా సన్మానించాలన్నారు. మాలూరులోని వాల్మీకి భవనానికి మరమ్మతులు చేసి ప్రజల వినియోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో ఏడీసీ శంకర వణిక్యాల్, సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు , దీపాలను మోసుకుని గుడికి వెళుతున్న మహిళలు

వైభవంగా దీపోత్సవం

మాలూరు: తాలూకాలోని లక్కూరులో వెలసిన దుర్గాదేవి ఆలయంలో శనివారం అమ్మవారికి దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో గ్రామంలోని మహిళలు తంబిట్టు దీపాలను తలపై మోసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. అదేవిధంగా సప్తమాత మారికాంబ, ముత్యాలమ్మ, గంగమ్మ, మద్దూరమ్మ, యల్లమ్మ, సఫలాంబ, కోటి యల్లమ్మ, రేణుకా యల్లమ్మ దేవి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవార్లకు పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

క్లుప్తంగా

యూట్యూబర్ అరెస్ట్

బనశంకరి: మెట్రోస్టేషన్ ఎస్కలేటర్, రైలులో మూర్ఛవచ్చినట్లు రీల్స్ చేసిన యూట్యూబర్ ప్రజ్ఞను శనివారం విజయనగర పోలీసులు అరెస్ట్ చేశారు. బీఎంఆర్‌సీఎల్ సహాయక భద్రతా అధికారి విజయనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలించి ప్రజ్ఞను శనివారం అరెస్ట్ చేసి అతడికి రూ.500 జరిమానా విధించారు. భవిష్యత్‌లో ఇలాంటి రీల్స్ చేయనని హామీ ఇచ్చినట్లు సమాచారం.

సినిమా పోస్టర్ చింపివేత

శివమొగ్గ: తమిళ సినిమా ప్రదర్శనను ఖండిస్తూ కన్నడ కార్మికుల రక్షణ వేదిక కార్యకర్తలు శనివారం శివమొగ్గ నగరంలోని వీరభద్రేశ్వర చిత్రమందిరం వద్ద ఆందోళన చేశారు. కొన్ని రోజులుగా వీరభద్రేశ్వర థియేటర్‌లో నటుడు విజయ్ ఆంటోని నటించిన రత్తం తమిళ సినిమా ప్రదర్శిస్తున్నారు. ఈ సమయంలో శనివారం కార్యకర్తలు అక్కడికి చేరుకుని ఆ చిత్రం పోస్టర్లను చింపేశారు. కావేరి వివాదం పరిష్కారం అయ్యే వరకు తమిళ సినిమాలు ప్రదర్శించకూడదని వారు డిమాండ్ చేశారు.

కారు ప్రమాదం కేసులో నివేదిక

బనశంకరి: కన్నడ నటుడు నాగభూషణ్ కారు ప్రమాదంలో మహిళ మృతి కేసుకు సంబంధించి రవాణాశాఖ అధికారులు నివేదికను కుమారస్వామి లేఔట్ పోలీసులకు అందజేశారు. ప్రమాదానికి కారణమైన కారును పరిశీలించిన ఆర్టీఓ అధికారులు, కారుటైర్, కారు ధ్వంసమైన విధానం, స్పీడామీటరు, ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు పరిశీలించారు. ప్రమాద సమయంలో కారు వేగం గురించి అధికారులు అందించిన నివేదికను పోలీసులకు అందించారు.

వేతనాలు పెంచాలి

తుమకూరు: అసంఘటిత కార్మికులకు వేతనాలు పెంచాలని సీపీఐ డిమాండ్ చేసింది. నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి ఎంజీ రోడ్డు, ఫ్రీడం చౌక్ మీదుగా ఊరేగింపుగా సీపీఐ కార్యకర్తలు జిల్లాధికారి కార్యాలయం చేరుకుని అక్కడ వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ. 15 వేలు, సహాయకులకు రూ.10 వేలు, అక్షర దాసోహ మధ్యాహ్న భోజనం కార్యకర్తలకు రూ. 6 వేలు, ఆశా కార్యకర్తలకు రూ. 8 వేల గౌరవ ధనం పెంచాలని సీపీఐ డిమాండ్ చేసింది. మొత్తం 18 డిమాండ్లను జిల్లాధికారికి అందించారు.

సంగీతం నేర్పించే సాకుతో..

దొడ్డబళ్లాపురం: సంగీతం నేర్పించే సాకుతో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ సంఘటన మాగడి తాలూకా కుదూరు పట్టణంలో చోటుచేసుకుంది. కుదూరులో 15 సంవత్సరాల బాలిక పాఠశాలకు వెళ్లిన సమయంలో కడుపునొప్పి అంటూ కిందపడిపోయింది. బాలికను ఆస్పత్రికి తరలించగా ఆమె గర్భవతి అని వైద్యులు చెప్పారు. కుదూరులో సంగీతం నేర్పించే రామాంజనేయ (48) అనే వ్యక్తి వద్ద బాలిక సంగీతం నేర్చుకుంటోంది. తల్లితండ్రులు ఏం జరిగిందని విచారించగా సంగీతం నేర్పించే రామాంజనేయ తనపై చాలా రోజులుగా లైంగికదాడి చేసినట్టు బాలిక వివరించింది. దీంతో తల్లితండ్రులు కుదూరు పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు




మండ్య: వచ్చే లోకసభ ఎన్నికల్లో మండ్య ఎంపీ స్థానం అభ్యర్థి ఎంపిక బాధ్యత ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడిదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... లోకసభ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఆయా విభాగాల అధ్యక్షులు, ముఖ్యులతో మంత్రి సమావేశమై చర్చించారు. గత విధాన సభ ఎన్నికల్లో అందరూ కలసికట్టుగా కలసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినట్లు లోకసభ ఎన్నికల్లోనూ పని చేయాలని వారికి మంత్రి సూచించారు. అభ్యర్థి గురించి ఇంకా చర్చ జరగలేదని, పార్టీ పెద్దలు ఆ విషయాన్ని చూసుకుంటారని తెలిపారు.

చెక్‌పోస్టు సిబ్బందికి నోటీసులు

మైసూరు: జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకా అంతరసంతె చెక్‌పోస్టు సిబ్బందికి ఏసీఎఫ్ రంగస్వామి నోటీసులు జారీ చేశారు. కేరళకు భారీ స్థాయిలో అక్రమంగా పశువులను వాహనాల్లో తరలిస్తున్న కేసులో ఈ నోటీసులు జారీ అయ్యాయి. రెండు వందలకు పైగా గోవులను వాహనాల్లో అక్రమంగా కేరళకు తరలించారనే కచ్చితమైన సమాచారం మేరకు బెంగళూరుకు చెందిన గో గ్యాన్ ఫౌండేషన్, ప్రాణి దయా సంఘం అంతరసంతె పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఐదు కంటైనర్ల లారీల్లో, ఐదు గూడ్స్ వాహనాల్లో ఈ గోవులను తరలిస్తుండగా దానిని అడ్డుకుని 11 మందిని అరెస్టు చేశారు. రక్షించిన పశువులను మైసూరు పింజరాపూల్‌కు తరలించారు. ఇంత భారీ స్థాయిలో అక్రమంగా పశువులు, గోవులను తరలిస్తుండగా చెక్‌పోస్టులో ఎందుకు పరిశీలించలేదని, విధుల్లో నిర్లక్ష్యం కారణంగా అంతరసంతె చెక్‌పోస్టు సిబ్బందికి నోటీసులు జారీ అయ్యాయి.

అమ్మో... ఔటర్ రింగ్‌రోడ్డు

- బెంగళూరు వలయ రహదారిలో తరచూ యాక్సిడెంట్లు
- 19 బ్లాక్‌స్పాట్లు గుర్తింపు
- నివారణ చర్యలపై ఉదాసీనత





ఔటర్ రింగ్‌రోడ్డులో వాహనాల రద్దీ

బనశంకరి: బెంగళూరు శివార్లలో ఒకప్పుడు నిర్మించిన అవుటర్‌రింగ్ రోడ్డు నగరం విస్తరించడంతో సిటీలోకి కలిసిపోయింది. దీంతో వాహనాలు, మానవ సంచారం మితిమీరి పెరిగిపోవడంతో తీవ్ర రద్దీ ఏర్పడి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఔటర్ రోడ్డులో ప్రయాణమంటే భయడాల్సి వస్తోంది. ఉదయం సమయంలో విపరీతమైన ట్రాఫిక్, రాత్రి సమయంలో అతి వేగంతో వాహనాలు సంచరించడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. జంక్షన్లు ప్రమాదాలకు కూడళ్లుగా మారిపోయాయి.

ఇందులోనే అధిక బ్లాక్‌స్పాట్లు

60 కిలోమీటర్ల పొడవు గల ఔటర్ రింగ్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు జరిగే మొత్తం 19 బ్లాక్ స్పాట్స్‌లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. రాజధానిలో 59 బ్లాక్ స్పాట్‌లు ఉంటే, అందులో 19 ఔటర్‌లోనే ఉండడం గమనార్హం. బెల్లందూరు, వైట్‌ఫీల్డ్, కేజీ.హళ్లి, బాణసవాడి, కృష్ణరాజపురం, మహాదేవపుర, కామాక్షీపాళ్యలో ఉండే ఔటర్ రింగ్ రోడ్డులో గత మూడేళ్లలో మొత్తం 132 ప్రమాదాలు సంభవించగా 76 మంది మృతిచెందారు.

రాజధానిలో మొత్తం 59 బ్లాక్‌స్పాట్లు

బెంగళూరు నగరవ్యాప్తంగా ఉండే 59 బ్లాక్ స్పాట్స్‌లో గత మూడేళ్లలో మొత్తం 755 ప్రమాదాలు సంభవించగా 326 మంది మృతి చెందారు. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం కల్పించే ఎక్స్‌ప్రెస్ హైవేలో అత్యధిక బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయి. మొత్తం 13 ప్రమాద వలయాలను గుర్తించారు. హెబ్బాళ నుంచి విమానాశ్రయం రోడ్డు జంక్షన్ వరకు 26 కిలోమీటర్ల రోడ్డులో 2020 నుంచి 2022 వరకు 131 ప్రమాదాలు సంభవించగా 62 మంది మృతిచెందారని ట్రాఫిక్ ఉన్నతాధికారులు తెలిపారు.





అతివేగంతోనే ప్రమాదాలు

రాత్రయితే చాలు.. ప్రమాదాల గోల

ఔటర్ ఇప్పుడు నగరం మధ్యలోకి చేరిపోయింది. ఈ రోడ్లలో ప్రతిరోజు లక్షలాది వాహనాలు సంచరిస్తుంటే రోజులో అనేకసార్లు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఔటర్ నుంచి వాహనాలు బయటకు వెళ్లే లోపలికి వెళ్లే వ్యవస్థ సక్రమంగా లేదు. ప్రమాదాలు పెరగడానికి ఇదేకారణమని అధికారులు తెలిపారు. ఔటర్‌రింగ్‌రోడ్డులో ఉదయం సమయంలో ప్రమాదాలు తక్కువనే ఉండగా, వాహనాల రద్దీ, నమ్మ మెట్రో రైల్ పనులు చేపడుతుండటంతో వాహనాలు వేగం కూడా తక్కువగా ఉంటుంది. కానీ రాత్రి అయ్యే సరికి అంతా మారిపోతుంది, వాహనదారులు వాయువేగంతో వెళ్తుంటారు, ఆ సమయంలో ఇతర వాహనాలను ఢీకొనడం, పాదచారులపైకి దూసుకెళ్లడం, లేదా పల్టీలు కొట్టడం వంటి దుర్ఘటనలు ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. ఇందులో మరణాలు, గాయాలపాలు కావడం ఎక్కువగా జరుగుతున్నాయి. అందులో కెంపేగౌడ విమానాశ్రయంరోడ్డులో పాలనహళ్లి గేట్, ఎయిర్‌పోర్ట్ జంక్షన్, హుణసమారనహళ్లి జంక్షన్, కొడిగేహళ్లిగేట్‌తో పాటు పలుచోట్ల యాక్సిడెంట్ల ప్రాంతాలుగా మారాయి. ఇక ఔటర్‌లోని హోసూరు రోడ్డులోనూ అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో మడివాళ నుంచి ఎలక్ట్రానిక్‌సిటీ వరకు మొత్తం 8 స్పాట్‌లు ఉన్నాయి. ఔటర్‌లో ఇప్పటి వాహన రద్దీకి అనుగుణంగా మార్పులు చేర్పులు చేయడమే సమస్యకు పరిష్కారమని అధికారులు తెలిపారు.

బసవ జయంతిని ప్రారంభించిన సీఎం

శివాజీనగర: అఖిల భారత వీరశైవ-లింగాయత్ సంఘ సంస్థలు, మైసూరు బసవ బళగల ఒక్కూట మైసూరు కళామందిరంలో ఏర్పాటు చేసిన బసవ జయంతిని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. శివరాత్రి దేశీకేంద్ర స్వామి దివ్య సాన్నిధ్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి బీ.ఈశ్వర ఖండ్రె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ హెచ్.సీ.మహాదేవప్ప 12వ శతమానపు శరణ దంపతుల పుస్తకాన్ని విడుదల చేశారు. బసవేశ్వర విగ్రహం దాత చేసిన నైస్ సంస్థ అధ్యక్షుడైన అశోక్ ఖేణి, ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్, కే.హరీశ్ గౌడ, దర్శన్ ధృవనారాయణ్, జీ.డీ. హరీశ్ గౌడ, హెచ్.ఎం.గణేశ్ ప్రసాద్, టీ.ఎస్.శ్రీవత్స, విధాన పరిషత్ సభ్యులు మరితిబ్బేగౌడ, డీ.తిమ్మయ్యతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

మహిష దసరాకు ఏర్పాట్లు

మైసూరు: వ్యతిరేకతల మధ్య మహిష దసరా కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దసరా ఆచరణ సమితి, మైసూరు విశ్వవిద్యాలయం పరిశోధకుల సంఘం నుంచి మహిష దసరా ఆచరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించి ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ ఆహ్వాన పత్రికపై మహిషాసుర ఫోటోను ప్రచురించారు. అలాగే '50వ వార్షిక మహిష దసరా' అని పత్రికపై ప్రచురించారు. ఈ ఆహ్వాన పత్రిక ప్రస్తుతం కొత్త వివాదానికి దారితీసింది. 2015లో ప్రారంభమైన మహిష దసరా ఆచరణకు 50 ఏళ్ల చరిత్ర ఉంది. ఈసారి 50వ వార్షిక మహిష దసరాను నిర్వహిస్తున్నారు. దసరా నిర్వహణ కమిటీ ఈ పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఆహ్వాన పత్రిక, పోస్టర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

ఫ్రీడం పార్కులో కాంగ్రెస్ ధర్నా

శివాజీనగర: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అవమానకర పోస్టులు పెట్టి, తప్పుడు వార్తలు ప్రకటించి దుష్ప్రచారం చేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు శనివారం నగరంలో ఫ్రీడం పార్కులో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాహుల్ గాంధీ గురించి మాట్లాడకపోతే ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీ వారికి నిద్ర రాదు, రాహుల్ గాంధీపై ప్రస్తుతం బీజేపీ వారికి భయం పట్టుకుంది. భారత్ జోడో యాత్ర తరువాత రాహుల్ గాంధీ పేరు దేశ, విదేశాల్లో చర్చకు వచ్చింది. సమర్థత కలిగిన నాయకుడనే భావం వచ్చిందని తెలిపారు. నీచమైన రాజకీయాన్ని బీజేపీ ప్రదర్శిస్తున్నదని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ధర్నాలో కేపీసీసీ కార్యాధ్యక్షులు రామలింగారెడ్డి, విధాన పరిషత్ చీఫ్‌విప్ సలీమ్ అహమ్మద్, పరిషత్ సభ్యుడు నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బలిజలు రాజకీయంగా ఎదగాలి



ప్రదీప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: బలిజలు రాజకీయంగా ఎదగాలని, సమాజ సేవలో పాలుపంచుకోవాలని బలిజ యువ గర్జన రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున అన్నారు. శనివారం బలిజ యువ గర్జన కార్యాలయంలో తాలూకా అధ్యక్షుడు ప్రదీప్‌కు జిల్లా అధ్యక్షునిగా పదవీ బాధ్యతలను అప్పగించి మాట్లాడారు. నగరసభలో బలిజ వర్గానికి చెందిన 8 మంది సభ్యులున్నారని, అది సంతోషించదగ్గ విషయమన్నారు. బలిజ యువ గర్జన జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నేతృత్వంలో కైవారం తాతయ్య జయంతి, శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ఆచరించడానికి సన్నాహాలు చేసుకోవాలన్నారు. మన వర్గంలోని పేదలకు సహాయ హస్తం అందించాలన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హోటల్ రమేశ్ బాబు, వెంకటాద్రి, అనిల్, శివకుమార్, పరమేశ్వర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మహిష దసరా నిర్ణయం జిల్లా యంత్రాంగానిదే

మైసూరు: మహిష దసరా ఆచరణను మైసూరులో ప్రభుత్వం నిర్వహించడం లేదని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో మీడియాతో సీఎం మాట్లాడుతూ... మహిష దసరాను తాము గతంలో నిర్వహించలేదని, ఇప్పుడు కూడా చేయడం లేదన్నారు. చాముండిబెట్టలో నిర్వహించే మహిష దసరాపై జిల్లా పాలన యంత్రాంగం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

ప్రతాప్‌ను అరెస్టు చేయాలి..

మైసూరులో మహిష దసరా ఆచరణ ముగిసే వరకు ఎంపీ ప్రతాప్ సింహను అరెస్టు చేయాలని మహిష దసరా ఆచరణ కమిటీ ముఖ్యులు, పాలికె మాజీ మేయర్ పురుషోత్తమ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ మహిష దసరా ఆచరణ కమిటీ ఆధ్వర్యంలో 13న ఆ వేడుకను నిర్వహించి తీరుతామన్నారు. ఘర్షణలు జరగకుండా ఆయన్ను అరెస్టు చేయాలన్నారు.

పాడి పశువులే ఆసరా



నోటిపుండు వ్యాధికి టీకాల శిబిరం



ఓ రైతు ఇంట ఆవులు

- గౌరిబిదనూరు తాలూకాలో విస్తృతంగా పాల సహకార సంఘాలు

గౌరిబిదనూరు: తాలూకాలో రైతుల జీవనాడిగా పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతూ వుంది. తాలూకాకు శాశ్వత నీటి వనరులు లేవు. పంటలు బాగా పండుతాయని, పండినా గిట్టుబాటు ధర లభిస్తుందనే గ్యారంటీ లేక పోవడంతో రైతులు కుటీర పరిశ్రమగా పాడి పరిశ్రమను ఎంచుకొన్నారు. సీమ (జెర్సీ) ఆవులను ఎక్కువగా కొనుగోలు చేసి పోషిస్తున్నారు, కొందరు రైతులు దేశీ ఆవులే కలిగి ఉన్నారు. తాలూకాలో ఎనుములతో పాలు తీయడం చాలా తక్కువ.

రోజుకు 74 వేల లీటర్ల సేకరణ

తాలూకాలో 135 వరకూ పాడి రైతుల సహకార సంఘాలున్నాయి. ఇందులో మహిళా రైతులు అధికంగా ఉండడం విశేషం. ఈ సంఘాల ద్వారా ప్రతి రోజూ 74,793 లీటర్ల పాల సేకరణ జరుగుతున్నట్లు కొచిముల్ డైరెక్టర్ తొండేబావి కాంతరాజు తెలిపారు. 38 సంఘాలకు సొంత భవనాలున్నాయి. 21 చోట్ల బల్క్ మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేసి పాల సేకరణ చేయడం వల్ల రైతులు దూరప్రాంతాలకు వెళ్లి పాలను విక్రయించే బాధ తప్పింది. ఈ నేపథ్యంలో పశువులు ఆరోగ్యంగా ఉండి అధిక పాల దిగుబడి ఇచ్చేలా వాటికి తరచూ ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇటీవల 55,900 పశువులకు నోటిపుండు వ్యాధికి టీకాలు వేశారు. పాడి రైతులకు లబ్ధి కలిగేలా ప్రభుత్వం పాల సేకరణ ధరను పెంచాలి. దాణా ధరలు తగ్గించి పంపిణీ చేయాలని డిమాండ్లు ఉన్నాయి.

కేంద్రం అనుమతిస్తే తక్షణం మేకెదాటు పనులు

- మంత్రి ఎన్. చెలువరాయస్వామి

మండ్య: మేకెదాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే తక్షణం పనులు ప్రారంభిస్తామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.చెలువ రాయస్వామి స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇటీవలే మేకెదాటు విషయాన్ని సుప్రీంకోర్టులో తాము ప్రస్తావించినట్లు, సముద్రంలో కలిసి వృథా అయ్యే నీటి విషయంలో మీ అభ్యంతరాలు ఏంటని తమిళనాడును న్యాయస్థానం ప్రశ్నించిందని తెలిపారు. సుప్రీం కోర్టు, కావేరి నది యాజమాన్య బోర్డు ముందు మేకెదాటు విషయంలో తాము పోరాడుతామని చెప్పారు. జేడీఎస్ పార్టీ, బీజేపీలు ఎన్నికల రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. అఖిలపక్ష భేటీ పిలిస్తే లోపలి చెప్పేది ఒకటి, బయటకు వచ్చి మాట్లాడేది ఒకటని ఆ రెండు పార్టీలను ఆయన విమర్శించారు. రాష్ట్ర కరువు పరిస్థితులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన సమయం ఇవ్వలేదని చెప్పారు. తమ విజ్ఞప్తి మేరకు మూడు ప్రత్యేక కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపించారని తెలిపారు. బీజేపీ-జేడీఎస్ మైత్రిని స్వతహాగా హెచ్‌డీ దేవెగౌడకే ఇష్టం లేదని, అందుకే ఇప్పుడు ఆ పార్టీలో వినిపిస్తున్న భిన్నస్వరాలు అని చెప్పారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో 25 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా 15కు పైగా స్థానాలను దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. కావేరి సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని, తమ రైతులను తామే కాపాడుకుంటామని మంత్రి తెలిపారు. మైసూరు-బెంగళూరు అభివృద్ధి కోసం రూ. 110 కోట్లను కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. మండ్య జిల్లాలోని అన్ని రోడ్ల అభివృద్ధికి రూ. 250-300 కోట్లు అవసరం అవుతాయని చెప్పారు.

మద్యం వ్యసనం వీడండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తదితరులు

గౌరిబిదనూరు: మద్యం వ్యవసనాన్ని వీడి జీవితాలను సుఖమయం చేసుకోవాలనే నినాదంతో శనివారం నగరంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువకులు జాతా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం డా హెచ్ఎన్ కళా భవనంలో ప్రజా సంక్షేమానికి సామూహిక వరలక్ష్మీ పూజలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ధర్మస్థల సంస్థ ముఖ్యులు డాక్టర్ వీరేంద్ర హెగ్డె సమాజానికి ఎంతో ప్రయోజనకరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తు చేశారు. మత్తు దుష్పరిణామాలకు దారి తీస్తుందని, వ్యసనాన్ని వీడి కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. స్వసహాయ సంఘాల ద్వారా మహిళల్లో ఆర్థిక క్రమశిక్షణ తెస్తున్నారని అన్నారు. సంస్థ ప్రాజెక్ట్ అధికారి నాగరాజ నాయ్క, సంస్థ కార్యక్రమాలను వివరించారు. సంస్థ అధికారి ప్రశాంత్, మాజీ ఎమ్మెల్యే జ్యోతిరెడ్డి, మార్కెట్ మోహన్, గీతా, చంద్రశేఖర్, సప్తగిరి, ప్రభానారాయణగౌడ, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత తిరుగుతోంది.. అప్రమత్తంగా ఉండండి



ఇస్లాంపురం ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని ప్రైవేట్ రిసార్ట్‌లో వారం రోజులుగా చిరుత సంచరిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. డెంకణీకోట సమీపంలోని ఇస్లాంపురం ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందజేశారు. అటవీ శాఖ సిబ్బంది రెండు రోజుల క్రితం ఆ ప్రాంతంలో పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చిరుత ఆ ప్రాంతంలో సంచరిస్తూ మేకలను లాక్కెళ్లి రిసార్ట్‌లోకి ప్రవేశించినట్లు రికార్డ్ కావడంతో శనివారం జిల్లా అటవీశాఖాధికారిణి కార్తికేయిణి, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుతను బంధించే వరకు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

హోసూరు: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని భారీ మెజారీతో గెలిపించుకోవాలని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని శనివారం హోసూరులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం. నాగరాజ్ సూచించారు. కేంద్రంలో నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలన్నారు. వెంకటేష్, నారాయణన్, విజయ్ కుమార్, మనోహర్, అన్నురసన్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని నగనూరు, ఉచ్చనపల్లి గ్రామపంచాయతీల్లో రూ. 32.80 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ శనివారం భూమిపూజ చేశారు. నగనూరు, ఉచ్చనపల్లి గ్రామపంచాయతీల్లో ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో సీసీరోడ్డు ఏర్పాటు, డ్రైనేజీలు, తాగు నీటి వసతి తదితర మౌలిక వసతులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ భూదట్టియప్ప, కుమార్ పాల్గొన్నారు.

ఫుడ్ డెలివరీ బాయ్ దుర్మరణం

బనశంకరి: రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన ఎలక్ట్రానిక్‌సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఫుడ్ డెలివరీబాయ్ రమేశ్‌నాయక్ (37) శనివారం కస్తమర్లకు బైక్‌లో ఫుడ్ ఆర్డర్ తీసుకెళుతుండగా ఎలక్ట్రానిక్‌సిటీ వద్ద లారీ ఢీకొంది. దీంతో నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న పాఠశాల బృందం

హోసూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఉన్నతి కోసం పాఠశాలకు ఆర్థిక సాయం చేసిన వెబ్‌టిక్ పరిశ్రమ అధ్యక్షురాలిని పాఠశాల యంత్రాంగం ఘనంగా సన్మానించింది. హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో సుమారు రెండువేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల యంత్రాంగం, పీటీఏ తీవ్ర కృషి చేస్తోంది. అందులో భాగంగా పాఠశాలలో రోబోటిక్ కేంద్రం ప్రారంభించేందుకు వెబ్‌టిక్ పరిశ్రమ ద్వారా రూ. 40 లక్షలు ఆర్థిక సాయం అందజేసింది. రెండు రోజుల క్రితం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెబ్‌టిక్ పరిశ్రమ భారత మండల అధ్యక్షురాలు సుజాత నారాయణన్ పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సాయం అందజేసిన ఆమెను పాఠశాల యంత్రాంగం పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇచ్చి ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, కార్పొరేటర్ అశోక్ రెడ్డి, విద్యా కమిటీ అధ్యక్షులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత





శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు

హోసూరు: డెంకణీకోట తాలూకా కుంటుకోట ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ శిబిరానికి పాఠశాల ఉపప్రధానోపాధ్యాయుడు దివాకర్‌బాబు అధ్యక్షత వహించారు. డెంకణీకోట విద్యా జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ కార్యదర్శి సంపత్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో డెంకణీకోట విద్యా జిల్లాకు చెందిన 46 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. క్రమశిక్షణ, యోగ, వ్యాయామం, పర్యావరణ పరిరక్షణ, అగ్నిప్రమాదాల నివారణతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో డెంకణీకోట విద్యా జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయులు సుధాకర్, ప్రభాకర్, సంపంగిరామయ్య, మాదేవ, సెందిల్, చంద్రశేఖర్, మునమిరాజ్, మాదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నారాయణ గురు జయంత్యుత్సవం





నారాయణ గురు చిత్రపటానికి పూజలు, కళాబృందాల ఊరేగింపులో గజరాజు

తుమకూరు: అసహాయకులు, అసంఘటితులు బ్రహశ్రీ నారాయణ గురు పేరిట సంఘటితం కావాల్సిన అవసరం ఉందని సహకార మంత్రి కేఎన్ రాజణ్ణ తెలిపారు. నగరంలోని డాక్టర్ గుబ్బి వీరణ్ణ కళాక్షేత్రంలో తుమకూరు జిల్లా ఆర్య ఈడిగర సంఘం, జేపీ నారాయణ స్వామి ప్రతిష్టాన, బ్రహ్మశ్రీ నారాయణ గురు జిల్లా జయంతోత్సవ సమితి, తుమకూరు జిల్లా వెనుకబడిన వర్గాల ఒక్కూట భాగస్వామ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రహ్మశ్రీ నారాయణ గురు 169వ జయంతోత్సవం కార్యక్రమాన్ని మంత్రి రాజణ్ణ ప్రారంభించి మాట్లాడారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, అంటరానివారుగా పిలవబడుతున్న వారు స్వాభిమానంతో బతకాలని నారాయణ గురు ఆశయంగా జీవించారని గుర్తు చేశారు. దౌర్జన్యం, దోపిడీలను కళ్లార చూసి నారాయణ గురు సమాజంలో వెనుకబడిన వారి కోసం వందలాది దేవాలయాలను కట్టించారని చెప్పారు. నిమ్న వర్గాల కోసం అనేక ఇళ్లు, పాఠశాలలు నిర్మించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ జీఎస్ బసవరాజు, ఆర్య ఈడిగర మహాసంస్థాన మఠాధిపతి శ్రీవిఖ్యాత మహాస్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/కట్న ప్రసక్తి లేదు/M.Tech, IIT/ C.Govt.సైంటిస్ట్/ఇస్రో/1.25 Lakhs. PM /6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-14785]

గౌడ/ M.Tech / C.Govt. సైంటిస్ట్/ DRDO /85000/-PM / 5'11"ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14785]

ముదిరాజ్/కట్న ప్రసక్తి లేదు/B.Tech/ Govt.AE/మున్సిపల్ Dept/10 Lakhs. PA/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14785]

యాదవ/ B.Tech / Govt.Jr. Asst./ 50,000/-PM / 5'9"ఎత్తు / 30 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9963757612 [HA-14785]

కాపు/B.Tech / C.Govt. సైంటిస్ట్/ ఇస్రో/ 1,50,000/-PM / 5'8"ఎత్తు/ 30 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618579861 [HA-14785]

హిందూ మాదిగ/ B.Tech / Govt. డిప్యూటీ మేనేజర్ /SBI/ 60,000/-PM/ 5'8"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7032058695 [HA-14785]

రెడ్డి/ఆస్ట్రేలియా 28. *సాఫ్ట్‌వేర్, దేశ, విదేశీ Matches. *డివోర్స్ 40. *రెడ్డి డాక్టర్స్, బిజినెస్, NRI, రిచ్ వాళ్ళు ఉన్నారు. WhatsApp for రిజిస్ట్రేషన్ 9392023911 [HA-11788]

కమ్మ/48y/5'9"/Business/ 2 లక్షలు నెలకు/ 100 Cr ప్రాపర్టీ కల్గిన వరుడికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8897213126, 7396608019 [H-793406]

రెడ్డి/40y/5'10"/ G. Employ/ 80 వేలు నెలకు/5 Cr ప్రాపర్టీ/Divorce/ పిల్లలులేని వరుడికి అందమైన Degree చదివిన G. Employee / Private Employee వధువు కావలెను. డైరెక్ట్ Ph: 8019468462, 8897213126 [H-793406]

కాపు/33y/5'8"/ సాఫ్ట్‌వేర్/42,000/-M (HYD) కు తగిన వధువు కావలెను. Ph: 9014477788, (W) 8179496129 [HA-30154]

26/5'8", MBA, GENPACT లో పనిచేస్తున్న జొన్నలగడ్డ శ్రీకరికి వైదిక బ్రాహ్మణ కులములో వధువు కావలెను. Ph: 9701060771 [HA-29668]

గౌడ 30/5'10" SWE JOB 30-L P/A WELL SETTLED OWN HOUSE / LANDS గల వరుడికి తగిన వధువు కావలెను: 6281925716 [HA-11789]

గంగపుత్ర (బెస్త) 30/5'9" B.TECH IIT MBA SWE JOB TCS 20-L P/A WELL SETTLED వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 6301621607 [HA-11789]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ Govt.AEE/ట్రాన్స్‌కో/14 Lakhs. PA/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14788]

బ్రాహ్మణ/2వ పెళ్లి/గుడ్ లుకింగ్ & ఫ్యామిలీ / 45/5'10"/MBA, BE/SWE/8L PM/Hyd/ కోట్ల ఆస్తి వరునికి 1st మ్యారేజ్ బ్రాహ్మణ వధువు కావలెను. Ph: 8367619529, 9515349877 [HA-14788]

లేట్ మ్యారేజ్ 50 yrs/Hyd/ వెల్ సెటిల్డ్ వరుడునకు ఇంటర్ క్యాస్ట్ లేట్ వధువు కావలెను. సంప్రదించండి: ఫోన్ : 9618050335 [H-788692]

కుల ప్రసక్తి లేదు/ 5'9"/B.Tech/MBA/ 30yrs in Hyd, 15Cr ఆస్తి గల ఉన్నత కుటుంబానికి. ఆర్యవైశ్య వరునికి సంప్రదాయమైన, సరి అగు అందమైన వధువు కావలెను. Ph: 9032006001 [HA-11792]

ఆర్యవైశ్య/ 46yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అంద మైన అమ్మాయి కావలెను. (డైరెక్ట్ కాంటాక్ట్, నో బ్రోకర్స్), 9182161015, 7680872085. [T-2232]

కాపు, CNB, 31, 5'9", M.Tech, 200 Cr. ఆస్తి, సొంత వ్యాపారం గల అందమైన వరునకు Any PG డాక్టర్ / Any PG ఇంజినీర్ వధువు గా కావలెను. డైరెక్ట్. 96429 57888 [B-788038]

కుల ప్రసక్తి లేదు. రిచ్, డైవర్స్‌డ్, 33Y, 5.8, MBBS, MD డాక్టర్ @ Own హాస్పిటల్ Hyd / 70 లక్షలు PM / వరుడుకి డాక్టర్ వధువు కావలెను. 78939 71953 [B-1206208]

★

బ్రాహ్మణ వరుడు/43y/ డిగ్రీ/SWE/ 6L per year, Hyd, 2nd మ్యారేజ్ గల వరుడికి 35-40y ఇంటర్ మధ్యతరగతి బ్రాహ్మణ సాంప్రదాయ కుటుంబ గల వధువు కావలెను. డైరెక్ట్. Ph: 9290758336 [H-793362]

బ్రాహ్మణ: 54 Yrs / 5'5" ఫేర్ కలర్ వరుడికి లేట్ మ్యారేజ్, కుల పట్టింపులు లేవు. Govt జాబ్. నెలకు 1 లక్ష సాలరీ. సొంత ఇల్లు గల వరుడికి 1వ, 2వ వధువు కావలెను. రాధ-7730883543, 7095392432. [W-189187]

పద్మశాలి: 54 Yrs / 5'5", విడో వరుడు, Govt జాబ్ (హెల్త్) నెలకు సాలరీ 1 లక్ష గల వరుడికి విడో, డైవర్సీ వధువు కావలెను. రాధ – 7730883543, 7095392432. [W-189187]

★★

నో క్యాస్ట్, 36 నుండి 42 y. మధ్య వున్న పేద అమ్మాయి కావలెను. చదువుతో పనిలేదు. మారీసుపేట, తెనాలి-2. డైరెక్ట్. ఫోన్ : 63015 54541 [B-1210188]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రోపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి డిగ్రి చదివిన వధువు కావలెను. Cont: 94932 42896 [G-786001]

డైరెక్ట్ :40/ 5.5/ M.com, B.Ed/ ఓన్ షాప్ ఉన్న వరుడికి కుల, వయస్సు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి కొరకు కావలెను. ఇల్లరికం అయిన OK. 85199 34926 [L-781028]

నో బ్రోకర్స్, రజక, 33Y/ 5'8", B.Tech, Govt Job (సచివాలయం-పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్) వైజాగ్ అబ్బాయికి తగిన ఏదైనా డిగ్రీ, జాబ్ ఉన్న Any Cast అందమైన అమ్మాయి కావలెను. Ph : 96187 19566 [V-797425]

Name: D.Prasad (5.8) D.O.B : 30-08-1986. Caste-SC (Mala) - M.Pharmacy, D.Ed, Designation : Sanitation Secretary, Rajamandry Dist. Cell: 87901 35437 [P-772914]

వరుడు కావలెను



2వ పెళ్లి 35 Ys Govt ఎంప్లాయ్, 1,75,000/- (pm) కోట్ల ప్రాపర్టీ కలిగి బాగా స్థిరపడి కుల ప్రసక్తి లేని అందమైన వధువుకు వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) సంప్ర: 7386550413 [H-788692]

CNB Age:25, Ht: 5'5" B.com ప్రాపర్టీ 50cr well settled వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 9182772639 [H-788692]

No Caste Bar/1వ, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా మానుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-793463]

క్రిస్టియన్ మాల/ఏకైక కుమార్తె/B.Tech/ C.Govt. బ్యాంక్ P.O/SBI / 49000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14785]

వడ్డెర/ B.Tech /C.Govt.స్టెనోగ్రాఫర్/ రైల్వే/45000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14785]

SC మాల/B.Tech/Govt.Asst. ఇంజినీర్ /ట్రాన్స్‌కో/70,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14785]

SC మాల/BE/C.Govt.టెక్నికల్ ఇంజినీర్ /DRDO/ 50,000/-PM/ 5'3"ఎత్తు/27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-14785]

Divorce 36, 38, 45, 51 years. *విడోస్ 46, 48, 51 years. *హై/రిచ్ రెడ్డి 51. *Whatsapp 6304826162 * తోడు/ పార్టనర్ కోసం. (Confidential, Trusted సర్వీస్). [HA-11788]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తిలేదు/ A: 30, Qly: డిగ్రీ/ బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం Ok). Ph: 9515673252 [HA-11788]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', Microsoft, 200 K, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 31, 5' 11", Cloud & Developer, 180 K, H1. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, MBA, 30, 6' 1", Deloitte, 180 K, H1, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి CA, 28, 6'2", Associate, 15 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 24, 5' 10", Data Analyst, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 6", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 27, 5' 7", Deloitte, 10 L P/A, Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", Qualcomm, 120 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

AVINASH REDDY MARRIAGES
రెడ్డి Texas, USA, BE, MS, 25, 5'4", Rich Family, Fair & Slim వధువుకి వరుడు కావలెను.
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp Colony) Hyderabad
www.avinashreddy.com
98480 11818, 93933 11818

రెడ్డి Business, MBA, 29, 5' 11", Hyd, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Detroit, BE, MS, 27, 5' 10", 105 K, 30 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 30, 5' 10", 22 L P/A, Rich, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pittsburgh, M Tech (IIT), MS, 30, 6' 2", Sr Engineer, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, Residency Doctor, 28, 5' 7", 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 29, 5' 4", SWE, 72 K, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 2", Sr Consultant, 12 L P/A, 7 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 32, 5' 4", SWE, 11 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రజక/కట్న ప్రసక్తిలేదు/33/5'4"/ B.Tech/ C.Govt. టాక్స్ ఆఫీసర్/ ఇన్‌కమ్‌టాక్స్ Dept./60,000/-pm గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7013449343 [HA-11788]

రెడ్డి/60 yrs/ 5'4", సొంత ఇల్లు, రెంట్స్, పెన్షన్, 10 ఎకరాల పంట పొలం గల వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7730088968 [HA-11788]

Vysyas/ 48y/5'4"/G. Employee/ 60 వేలు నెలకు/Own House/ 2 Cr ప్రాపర్టీ పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8019484384, 7396608019 [H-793406]

కమ్మ/38y/5'6"/ బిజినెస్/ 80 వేలు నెలకు/ 6 కోట్ల ప్రాపర్టీ కల్గిన Widow వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7396608019, 8019484384 [H-793406]

రెడ్డి/30y/5'5" / Degree/ Employee/50K pm/ వధువుకు/IT/G. Employee/Business/ Well Settled వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8897213126, 7396608019 [H-793406]

FC / విడో/39y/5'4"/Very Fair/ పెన్షనర్/ సొంత ఇల్లు/ రెంట్స్/ వ్యవసాయ భూములు ఏబాదర బంధీలేని సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 9676949745 [H-793363]

వైశ్య/59y/5'4"/ విడో/ సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/80,000/- pm/ 2 సొంత ఇల్లులు ఆంధ్రాలో పొలాలు యాక్సిడెంట్‌లో ఫ్యామిలీని కోల్పోయిన వధువుకి వరుడు కావలెను. Ph: 7780355650 [H-793363]

కమ్మ/విడో/58y/5'5"/ V.Fair/ Govt. Teacher/ బిజినెస్/ సొంత ఇల్లు & రెంట్స్/ 25 ఎకరాల పొలం/2 L /pm గల సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7287079096 [H-793363]

బ్రాహ్మణ/ విడో/ 56y / తెల్లని ఛాయ/ Pensioner 2 ఇల్లులు/సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9121509718 [H-793363]

రెడ్డి/60y/ విడో/ పెన్షనర్/ ఆంధ్రాలో వ్యవసాయ భూములు మరియు Hydలో సొంత కమర్షియల్ కాంప్లెక్స్‌పై మంచి ఆదాయం కలిగిన వధువుకు కుల, ఆస్తి పట్టింపులేని ఇల్లరికం వరుడు కావలెను. Ph: 9542445581 [H-793363]

CNB II[nd] Match కాపు 42/5'4 సెంట్రల్ Govt JOB 10-L P/A OWN HOUSE అందమైన వధువుకు అర్థము చేసుకునే వరుడు కావలెను. ఫోన్: 7702195227 [HA-11789]

మాదిగ 27/5'4 B.TECH Govt JOB. 12-L P/A (OWN HOUSE) కలదు WELL SETTLED అందమైన వధువుకు వరుడు కావలెను.ఫోన్: 9581616774 [HA-11789]

2వ పెళ్లి: కాపు./48Y, Govt.ఎంప్లాయి, 75000/-PM, సొంత ఇల్లు, 40,000/– రెంట్స్ గల వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 8340059430 [HA-14788]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/M.Sc, B.Ed/Govt. స్కూల్ టీచర్/ 50,000 /-PM/ 5'4" ఎత్తు/39 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-14788]

ఆర్యవైశ్య/ 28y & 23y&25y&27y&28y& 29y&31y& 33y&35y&37y& 39Y&40y&42y&44y&46y& 48y& 49y & 51y& 53y& 54y& 55y & 57y& 59y& 59y...సువర్ణ గుప్తా "మా సేవా" (Since: 1998) Ph/WA: 9391937789 [HA-14788]

మున్నూరు కాపు/విడో/52/5'3" / డిగ్రీ/ Govt. జాబ్/ఎడ్యుకేషన్ Dept/1 Lakh.PM తెలంగాణ/Any Govt. బిజినెస్, జాబ్ వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 7036964474 [HA-14788]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్ * 29yrs/ 5'4"/ డిగ్రీ *25yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను/ఆర్కేర్/Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా OK. Ph: 6304338432 [HA-14788]

కాపు, బలిజ/34, 5'2", 2nd మ్యారేజ్ ఫెయిర్, B.టెక్, 100Cr. ప్రాపర్టీ సాంప్రదాయ వధువుకి India/Abroad బిజినెస్ వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 7036964474 [HA-14788]

రెడ్డి/విడో/ 27y/ 5'6"/ BBA/ కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని వధువుకి తగిన వరుడు కావలెను. Ph:9553652167 [HA-793505]

కుల ప్రసక్తి లేదు/విడో/47y/ ఎంప్లాయిమెంట్ & పబ్లిక్ రిలేషన్ (Dept) 1L P/m / Own House/ 25 ఎ॥ ల్యాండ్ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8019641527 [HA-793505]

కాపు/లేట్ మ్యారేజ్/33y/5'5/MBA/11 LP/A/Own House, ల్యాండ్స్, కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను (1వ, 2వ OK) Ph:6309344166 [HA-793505]

రెడ్డి/విడో/55y/Fair/Own House (Rents), Business /1. పాప U.S.A సెటిల్డ్/Well Settled/ఏ భారం బంధీలని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (సపోర్ట్ ఉండును) ఫోన్: 8519803423 [HA-793505]

రెడ్డి/ డైవర్సీ/ 30y/5'4"/ B.Tech/ 2LP/m/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9848226983 [HA-793505]

రెడ్డి 2వ పెళ్లి 45yrs B.Tech/Govt ఆఫీసర్ ఎలక్ట్రిసిటీ Dept (DE) 3 లక్షలు (pm) పిల్లలు లేని సొంత ఇల్లు +కార్ ఏ బాధ్య బంధీలేని V. ఫెయిర్‌వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. సంప్ర: 8341454870 [H-788692]

రెడ్డి/53y/రెండవపెళ్ళి/విడో Govt Job / పిల్లలు లేరు/ సొంత ఇల్లులు/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). ఫోన్: 7799083500, 7386660643 [HA-793463]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4" MBA *30/5'3"/ B.Sc *27/5'2"/ఇంటర్ *32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/పురోహితులకు మ్యారేజ్ త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14788]

కుల, ఆస్తి పట్టింపులేదు/బిజినెస్, జాబ్, 2L pm, 6 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించబడును. ఇల్లరికం Ok. అభిరుచి మేరకు కుదుర్చబడును. Ph: 9704477206 [H-793456]

ఆదర్శవంతమైన ఆధ్యాత్మికమైన కాపు వరుడు కావలెను. అందమైన విద్యావంతురాలైన ఐశ్వర్య వంతురాలైన 26 సం॥ విశాఖపట్నం మాగ వధువుకి. Cell: 7032375388, 8341014640 [S-771189]

కమ్మ/31/ ఇంటర్/కమ్మ/33 లేట్ మ్యారేజ్ వధువులకు సాంప్రదాయ కుటుంబం గల కమ్మ వరులు కావలెను. సంప్రదించండి: 89855 87754. [L-798829]

★

పద్మశాలి: 25 Yrs / 5'4", ఫేర్ కలర్, B.Pharmacy చదివిన వధువుకి తగిన వరుడు కావలెను. సంప్రదించండి: రాధ – 7730883543, 7095392432. [W-189187]

పద్మశాలి: 26 Yrs / 5'5", ఫేర్ కలర్, B.Tech, డైవర్సీ వధువు, వెల్ సెటిల్ గల వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. సంప్రదించండి: రాధ – 7730883543, 7095392432. [W-189187]

★★

బ్రాహ్మణ మరియు రెడ్డి విడో/58yrs సొంత ఇల్లు గల Govt. ఉద్యోగి పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. 7207591349, 7989041603. [T-4646]

పద్మశాలి, క్రిస్టియన్, డైవర్సీ (BPT, MIAP) 30 yrs, 5'.1", Good Look, ఇన్‌కం, 35,000/-(PM), Property : 50 Lakhs, Girl. 5 Yrs, No Caste, No Brokers, VJA ✆ 94946 50753 [B-1210228]

వేదికలు



కాపు 30y 70K, వరునికి క్రిస్టియన్ కాపు అమ్మాయి కా" 28y అమ్మాయికి క్రిస్టియన్ కాపు వరుడు కా" 27y కాపు క్రిస్టియన్ అమ్మాయికి కాపు వరుడు కా" Ph: 9063855739 [H-788692]

ఫాస్ట్ సెటిల్‌మెంట్. కుల పట్టింపులేని అన్ని కులముల వారికి 1[st], 2[nd] సంబంధములు చూడబడును. Pvt, SWE, Govt, AP+TS సంబంధములు చూడబడును. ఫోన్: 8897091964 [HA-11789]

ఫ్రీ రిజిస్ట్రేషన్ కాపు, మున్నూరు కాపు, రెడ్డి, కమ్మ, గౌడ, ముదిరాజ్ & ఇతర కులాల 1వ, 2వ, లేటు, డాక్టర్స్, ఇంజినీర్స్, SWE, GOvt, Pvt, NRI సంబంధాల ఫాస్ట్ సెటిల్మెంట్‌కై సంప్ర. Ph: 9247217621 [HA-14788]

నూర్‌బాషా ముస్లిం (దూదేకుల) ఆంధ్ర, తెలంగాణ, దేశ, విదేశాలలో జాబ్‌చేయు 1వ, 2వ, డైవర్స్, SWE, డాక్టర్స్, బిజినెస్, Banking, Govt, Pvt వధూవరుల సంబంధాలకై సంప్ర: 9948820402 [HA-793463]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130/ 8555980066 [HA-793463]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్–I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10275]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విడోస్ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదగౌడ్, Ph: 8790690809 [H-788919]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189422]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP, TS 15 సం॥ Exp. Ph: 8712384555 [H-30503]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14791]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14791]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14791]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14791]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14791]

18 సం.ల అనుభవం. జాతక లగ్నంలో వివాహ సమస్య-పరిష్కారములతో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI,Govt., రిచ్ వార్కి పెళ్లి సంబంధాలు ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ఒక నమ్మకం. నమో వెంకటేశాయ. 7093722724. [T-1953]

★

అన్ని కులాల వారికి కట్నం ఇవ్వలేని, నిరుపేద వధువులకు & 1వ, 2వ వివాహము వధువులకు (అమ్మాయిలకు) సంబంధాలు కుదుర్చబడును. రాధ – 7730883543, 7095392432. [W-189187]

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-546]

★★

హిందూ, క్రైస్తవ, మాలల వివాహ పరిచయ వేదిక కళ్యాణ మాల 14-10-2023 శనివారం ఉ. 10 గం. నుండి 2 గం. వరకు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, రామారావుపేట, కాకినాడ. ✆ 9440545049 [B-788195]

1వ, 2వ, తోడు, ఒంటరి, రిటైర్డ్ సంబంధాలు కలవు. అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. సంప్ర : 83095 25477 [V- 797424]

అందరికీ అందుబాటులోకి స్వచ్ఛ ఇంధనం

గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్, చార్జీలకు నూతన మార్గదర్శకాలు

డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ రూపొందించిన విద్యుత్ నియంత్రణ మండలి

ఈ నెల 21 నుంచి అమలులోకి కొత్త మార్గదర్శకాలు




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అందరికీ కాలుష్యం లేని స్వచ్ఛ ఇంధనం అందించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగానికి పెద్ద పీట వేస్తోంది. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. సౌర, పవన, జల విద్యుత్ వంటి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని ప్రోత్సహించి, వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు విద్యుత్ చట్టంలో మార్పులు చేస్తూ గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్, ఛార్జీలు, బ్యాంకింగ్ నిబంధనలను రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నియంత్రణ 2023 పేరుతో డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌ను తయారు చేసింది. ఈ నెల 21 నుంచి నూతన మార్గదర్శకాలు రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వస్తాయి. దేశంలో 2070 నాటికి కర్బన ఉద్గారాలను నెట్ జీరో స్థాయికి తేవాలని, దాని కోసం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి కూడా ఈ మార్గదర్శకాలు దోహదపడతాయని ఏపీఈఆర్‌సీ వెల్లడించింది.

గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 2022లో నిబంధనలు జారీ చేసింది. వాటిని అనుసరించి పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, వినియోగదారులు విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 181 (1) ప్రకారం నడుచుకోవడానికి రాష్ట్ర కమీషన్లు చట్ట ప్రకారం నిబంధనలను రూపొందించవచ్చు. ఈ నేపథ్యంలోనే తాజా డ్రాఫ్ట్‌ను తీసుకువచ్చినట్లు ఏపీఈఆర్‌సీ పేర్కొంది. ఈ నియంత్రణ రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్తును ఓపెన్ యాక్సెస్ చేయడానికి, ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌లు (సరఫరా వ్యవస్థలు), విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వర్తిస్తుంది.

కొత్త నిబంధనలివీ..

- గ్రీన్ ఎనర్జీ నిబంధనల ప్రకారం.. దివాలా తీసిన సంస్థలు, డిస్కంలకు రెండు నెలల కంటే ఎక్కువ కాలం బకాయిలు ఉన్న సంస్థలు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న సంస్థలు, విద్యుత్ దొంగతనం కేసు పెండింగ్‌లో ఉన్న సంస్థలకు ఓపెన్ యాక్సెస్‌ను పొందడానికి అర్హత లేదు. అర్హులైన వారికి స్వల్పకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌ను మంజూరు చేయడానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోడ్ డెస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.
- దీర్ఘకాలిక, మధ్యకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ మంజూరు కోసం స్టేట్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ(ఏపీ ట్రాన్స్‌కో) నోడల్ ఏజెన్సీగా ఉంటుంది.
- గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ దరఖాస్తులన్నీ నేరుగా సంబంధిత రాష్ట్ర నోడల్ ఏజెన్సీలకు సింగిల్ విండో ద్వారా వెళతాయి.
- సెంట్రల్ నోడల్ ఏజెన్సీ పోర్టల్‌లో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ సమాచారం మొత్తం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.
- అన్ని కొత్త గ్రీన్ ఎనర్జీ జనరేటర్లకు కనెక్టివిటీ మంజూరు చేస్తారు
- వినియోగదారులు, జనరేటర్‌ల మధ్య ప్రస్తుతం ఉన్న ఒప్పందాలు యధావిధిగా కొనసాగుతాయి. ప్రభుత్వ విధానం ప్రకారం ఓపెన్ యాక్సెస్‌ను కొనసాగించవచ్చు. వారికి సంబంధిత ఒప్పందాలలో పేర్కొన్న విధంగానే ఛార్జీలు వర్తిస్తాయి.
- గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ట్రాన్స్‌మిషన్, వీలింగ్, క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీలు, స్టాండ్‌బై ఛార్జీలు, బ్యాంకింగ్ ఛార్జీలు, రియాక్టివ్ ఎనర్జీ ఛార్జీలను నిబంధనల మేరకు విధిస్తారు. అయితే ఇవన్నీ అందరికీ వర్తించవు. ఉదాహరణకు 2032 డిసెంబర్‌లోగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి, ఓపెన్ యాక్సెస్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆఫ్‌షోర్ విండ్ ప్రాజెక్ట్‌ల నుంచి జరిగే విద్యుత్ ఉత్పత్తికి అదనపు సర్‌ఛార్జి వర్తించదు. దీర్ఘకాలిక, మధ్యకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ప్రాసెసింగ్ ఫీజు రూ. 1 లక్ష కాగా, స్వల్పకాలానికి రూ.25 వేలు కడితే సరిపోతుంది.
- రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ప్రకారం డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీ వినియోగదారులకు వార్షిక ప్రాతిపదికన గ్రీన్ సర్టిఫికేట్ అందించాలి.



ఓపెన్ యాక్సెస్ అంటే..

విద్యుత్తు వినియోగదారులు ఎవరైనా వారికి నచ్చిన పునరుత్పాదక ఉత్పత్తి సంస్థ నుంచి నేరుగా కరెంటును పొందే వెసులుబాటు. ఇందుకు ఈ వినియోగదారులు నోడల్ ఏజెన్సీ అనుమతి పొంది తగిన చార్జీలు చెల్లించి ఈ విద్యుత్తును పొందవచ్చు.

సచివాలయాల వద్ద సంక్షేమ సమాచార బోర్డులు

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంతమందికి, ఎంతమేర లబ్ధి జరిగిందో వివరాలు వెల్లడి
- స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో బోర్డులు ఆవిష్కరణ
- ఆ తర్వాత ఇంటింటి ప్రచారం



సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక సమాచార బోర్డులను ప్రభుత్వం ఏర్పాటుచేయనుంది. ఏ పథకంలో ఎంతమంది లబ్ధిదారులకు.. ఎంత మొత్తం లబ్ధిచేకూరిందన్న వివరాలను ఆ సమాచార బోర్డులలో ప్రదర్శిస్తారు. నెలరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 11,162 గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని 3,842 వార్డు సచివాలయాల వద్ద ఎక్కడిక్కడ నగర, పట్టణ, జిల్లా, మండల, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో ఈ 'ప్రగతి సమాచార బోర్డు'లను ఆవిష్కరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యాచరణ సిద్ధంచేసింది. రెండు మూడ్రోజుల్లోనే ఏ సచివాలయానికి సంబంధించిన సమాచార బోర్డును ఆయా సచివాలయానికి పంపేందుకు అధికారులు ఏర్పాటుచేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు తగిన సూచనలు చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

వాట్సాప్ ద్వారా ప్రజలకు సమాచారం..

ఇక ఈ సంక్షేమ పథకాల సమాచార బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక ప్రజలను విస్తృతంగా భాగస్వాములను చేయనున్నారు. సచివాలయాల వారీగా ప్రతి కుటుంబానికి ముందుగానే వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయ శాఖాధికారులు చెప్పారు. వీటి ఆవిష్కరణ అనంతరం ఓ పది రోజులపాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివిధ పథకాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఎంతమేర లబ్ధిచేకూరుస్తోంది తెలియజేసి, ఆ కుటుంబంలో ఒక సభ్యుని నుంచి ఈ–కేవైసీ రూపంలో ధ్రువీకరణ తీసుకుంటారు.

'సివిల్ అసిస్టెంట్ సర్జన్' మెరిట్ జాబితా విడుదల



సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీలో భాగంగా ప్రాథమిక మెరిట్ జాబితాను ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శనివారం విడుదల చేసింది. https://dme.ap.nic.in/ వెబ్‌సైట్‌లో జాబితాను అందుబాటులో ఉంచినట్టు మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 11వ తేదీ రాత్రి 12 గంటల్లోపు cas04recruitment2023@gamil.com కు అభ్యర్థులు మెయిల్ చేయాలని స్పష్టం చేశారు. గడువు ముగిశాక వచ్చిన మెయిల్స్‌ను పరిగణనలోకి తీసుకోమని తెలిపారు.

కళాశాలలకు ఇంటర్ సర్టిఫికెట్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితాల పంపిణీ మొదలైంది. శనివారం ఎన్టీఆర్ జిల్లాలోని పలు కళాశాలల్లో పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆదివారం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు సర్టిఫికెట్లు చేరతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థులు సర్టిఫికెట్లు పొందొచ్చన్నారు.

2వేల టన్నుల గోధుమలకు 11న ఈ-వేలం



సాక్షి, అమరావతి: బహిరంగ మార్కెట్‌లో గోధుమల ధరలను స్థిరీకరించడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్–డొమెస్టిక్ ద్వారా కేంద్రం నిర్ణయించిన సబ్సిడీ ధరలకు ఆహార ధాన్యాలను (గోధుమలు) ఈ నెల 11వ తేదీన ఈ–వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు శనివారం ఎఫ్‌సీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. గోధుమ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసే వారు, గోధుమ పిండి మిల్లర్లకు మాత్రమే గోధుమలను విక్రయిస్తున్నట్లు తెలిపింది. కనీసం 10 మెట్రిక్ టన్నుల నుంచి గరిష్టంగా 100 మెట్రిక్ టన్నులకు బిడ్ వేయడానికి అర్హులని, ఈ–వేలంలో పాల్గొనదలచిన బిడ్డర్ తప్పనిసరిగా ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ లైసెన్స్, జి.ఎస్.టి. / ట్రేడ్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్, పాన్ కలిగి ఉండాలని స్పష్టం చేసింది. అమరావతిలోని ఎఫ్‌సీఐ ప్రాంతీయ కార్యాలయంలో 2వేల మెట్రిక్ టన్నుల విక్రయానికి.. క్వింటా రూ. 2150 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

జపాన్‌పై విజయంతో భారత మహిళల హాకీ జట్టుకు కాంస్యం

సెమీఫైనల్లో ఎదురైన ఓటమి నుంచి తేరుకున్న భారత మహిళల హాకీ జట్టు ఆసియా క్రీడలను కాంస్య పతకంతో ముగించింది. శనివారం జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో సవితా పూనియా నాయకత్వంలోని టీమిండియా 2-1 గోల్స్ తేడాతో జపాన్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున దీపిక (5వ ని.లో), సుశీలా చాను (50వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... జపాన్ జట్టుకు యురీ నగాయ్ (30వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. ఈ విజయంతో భారత మహిళల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో ఏడోసారి పతకం సాధించింది. 1982 ఏషియాడ్‌లో స్వర్ణం నెగ్గిన భారత్... ఆ తర్వాత కాంస్యం (1986లో), రజతం (1998లో), కాంస్యం (2006), కాంస్యం (2014), రజతం (2018) సాధించింది. సొంతగడ్డపై సత్తా చాటుకున్న చైనా మహిళల జట్టు నాలుగోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని హస్తగతం చేసుకుంది. దక్షిణ కొరియాతో జరిగిన ఫైనల్లో చైనా 2-0 గోల్స్ తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలిచింది.





పసిడి పతకాలతో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి



మూడు స్వర్ణాలతో జ్యోతి సురేఖ

జయహో భారత్ 107

'వంద' పతకాల లక్ష్యంతో చైనా గడ్డపై ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత క్రీడా బృందం అనుకున్నది సాధించింది. శనివారంతో భారత క్రీడాకారుల ఈవెంట్స్ అన్నీ ముగిశాయి. చివరిరోజు భారత్ ఆరు స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలతో మెరిసి ఏకంగా 12 పతకాలు సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో తొలిసారి 'పతకాల సెంచరీ' మైలురాయిని దాటింది. అంతేకాకుండా ఈ క్రీడల చరిత్రలోనే 107 పతకాలతో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. అంతర్జాతీయ క్రీడల్లో భారత్‌కిదే గొప్ప ప్రదర్శన కావడం విశేషం. 2010లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ 101 పతకాలు సాధించింది. ఈ ప్రదర్శనను భారత్ అధిగమించింది. శనివారం భారత్‌కు ఆర్చరీలో రెండు స్వర్ణాలు.. కబడ్డీల్లో రెండు పసిడి పతకాలు... పురుషుల టి20 క్రికెట్‌లో, పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఒక్కో బంగారు పతకం లభించాయి. ఆదివారం కేవలం కరాటే, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ ఈవెంట్స్ జరగనున్నాయి. అనంతరం సాయంత్రం ముగింపు వేడుకలతో హాంగ్జౌ ఆసియా క్రీడలకు తెరపడుతుంది.

- ఆసియా క్రీడల్లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన నమోదు
- తొలిసారి 'సెంచరీ'ని దాటిన భారత క్రీడా బృందం
- 107 పతకాలతో నాలుగో స్థానం
- శనివారం 12 పతకాలు గెలిచిన భారత క్రీడాకారులు
- ఆర్చరీలో జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్‌లకు పసిడి పతకాలు
- బ్యాడ్మింటన్‌లో తొలిసారి స్వర్ణం
- కబడ్డీలోభారత జట్ల 'పసిడి కూత'
- క్రికెట్‌లోనూ బంగారు పతకం

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	200	111	71	382
జపాన్	51	66	69	186
దక్షిణ కొరియా	42	59	89	190
భారత్	28	38	41	107
ఉజ్బెకిస్తాన్	22	18	31	71
చైనీస్ తైపీ	18	20	28	66
ఇరాన్	13	21	19	53
థాయ్‌లాండ్	12	14	32	58
బహ్రెయిన్	12	3	5	20
ఉత్తర కొరియా	11	18	10	39

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

హాంగ్జౌ: చైనా గడ్డపై భారత్ తమ పతకాల వేటను దిగ్విజయంగా ముగించింది. ఆసియా క్రీడల్లో ఎవరూ ఊహించని విధంగా 107 పతకాలతో అదరగొట్టింది. ఇందులో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి. తమ పోటీల చివరిరోజు భారత్ 12 పతకాలు గెలిచి పతకాల పట్టికలో నాలుగో స్థానాన్ని ఖరారు చేసుకుంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ 16 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలతో కలిపి 70 పతకాలతో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

సురేఖ, ఓజస్ 'స్వర్ణ' చరిత్ర

శనివారం ముందుగా ఆర్చరీలో భారత్ బాణం 'బంగారు' లక్ష్యాన్ని ఛేదించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణం గెలిచింది. ఫైనల్లో జ్యోతి సురేఖ 149-145తో చేవన్ సో (దక్షిణ కొరియా)ను ఓడించింది. జ్యోతి సురేఖ 15 బాణాలు సంధించగా అందులో 14 పది పాయింట్ల లక్ష్యంలో... ఒకటి 9 పాయింట్ల లక్ష్యంలో దూసుకెళ్లడం విశేషం. ఓవరాల్‌గా జ్యోతి సురేఖకు ఈ ఆసియా క్రీడలు చిరస్మరణీయమయ్యాయి. ఈ క్రీడల్లో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ 3 స్వర్ణాలు సాధించింది. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌తోపాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సురేఖ బంగారు పతకాలు గెలిచంది. తద్వారా దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష (1986 సియోల్ గేమ్స్; 4 స్వర్ణాలు, 1 రజతం) తర్వాత ఒకే ఆసియా క్రీడల్లో కనీసం 3 స్వర్ణ పతకాలు గెలిచిన భారతీయ క్రీడాకారిణిగా జ్యోతి సురేఖ గుర్తింపు పొందింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతకం కూడా భారత్ ఖాతాలోనే చేరింది. ప్రపంచ చాంపియన్ అదితి స్వామి (భారత్) 146-140తో ఫాదిలి జిలిజాటి (ఇండోనేసియా)పై గెలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కే లభించాయి. ఫైనల్లో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే 149-147తో అభిషేక్ వర్మ (భారత్)పై గెలిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ క్రీడల్లో ఓజస్‌కిది మూడో స్వర్ణం. పురుషుల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ విభాగంలో ఓజస్ పసిడి పతకాలు గెలిచాడు.



రజత, స్వర్ణ పతకాలతో అభిషేక్ వర్మ, ఓజస్

సాత్విక్-చిరాగ్ జోడీ అద్భుతం

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు 'పసిడి' కల నెరవేరింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ చాంపియన్‌గా అవతరించి ఈ క్రీడల చరిత్రలో భారత్‌కు తొలిసారి బంగారు పతకాన్ని అందించింది. శనివారం జరిగిన ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-16తో చోయ్ సోల్‌గు-కిమ్ వన్‌హో (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. సెమీస్‌లో మలేసియాకు చెందిన ప్రపంచ మాజీ చాంపియన్ జోడీని బోల్తా కొట్టించిన భారత జంట తుది పోరులోనూ దూకుడుగా ఆడింది. కళ్లు చెదిరే స్మాష్‌లతో, చక్కటి డిఫెన్స్‌తో కొరియా జోడీకి కోలుకునే అవకాశం ఇవ్వకుండా విజయాన్ని దక్కించుకుంది. 1982 ఆసియా క్రీడల్లో లెరాయ్-ప్రదీప్ గాంధే భారత్‌కు పురుషుల డబుల్స్‌లో కాంస్య పతకాన్ని అందించారు. ఆసియా క్రీడల్లో విజేతగా నిలవడంతో వచ్చే వారం విడుదల చేసే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి సాత్విక్-చిరాగ్ జోడీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనుంది.





భారత జట్ల 'పసిడి' కూత

గత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలను చేజార్చుకున్న భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు ఈసారి తమ ఖాతాలోకి వేసుకున్నాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 33-29తో డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్ జట్టును ఓడించగా... భారత మహిళల జట్టు 26-25తో చైనీస్ తైపీపై విజయం సాధించింది. ఆసియా క్రీడల కబడ్డీ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు ఎనిమిదోసారి స్వర్ణ పతకం నెగ్గగా... మహిళల జట్టు మూడోసారి పసిడి పతకం సాధించింది.

దీపక్ 'రజత' పట్టు



ఆసియా క్రీడల పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ ఈవెంట్‌ను భారత్ రజత పతకంతో ముగించింది. 86 కేజీల విభాగంలో దీపక్ పూనియా భారత్‌కు రజత పతకాన్ని అందించాడు. ఇరాన్ దిగ్గజ రెజ్లర్ హసన్ యజ్దానితో జరిగిన ఫైనల్లో దీపక్ 3 నిమిషాల 31 సెకన్లలో 0-10తో 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో ఓడిపోయాడు. రెజ్లింగ్ నిబంధనల ప్రకారం బౌట్‌లో పది పాయింట్ల ఆధిక్యం సాధించిన వెంటనే ఆ రెజ్లర్‌ను విజేతగా ప్రకటిస్తారు. అంతకుముందు దీపక్ తొలి రౌండ్‌లో 3-2తో షరిపోవ్ (ఖతర్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 11-0తో రియాన్‌డెస్టా (ఇండోనేసియా)పై, క్వార్టర్ ఫైనల్లో 7-3తో షోటా సిరాయ్ (జపాన్)పై, సెమీఫైనల్లో 4-3తో షపియెవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన యశ్ (74 కేజీలు), విక్కీ (97 కేజీలు), సుమిత్ మలిక్ (125 కేజీలు) ఆరంభ రౌండ్‌లలోనే ఓడిపోయారు.

చెస్‌లో డబుల్ ధమాకా



హంపి, హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీ

వ్యక్తిగత విభాగంలో త్రుటిలో పతకాలు కోల్పోయిన భారత చెస్ క్రీడాకారులు టీమ్ ఈవెంట్‌లో సత్తా చాటుకొని రజత పతకాలు నెగ్గారు. పెంటేల హరికృష్ణ, ఇరిగేశి అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్‌లతో కూడిన భారత పురుషుల జట్టు నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత 15 మ్యాచ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్‌తో జరిగిన చివరి రౌండ్‌లో భారత్ 3.5-0.5తో గెలిచింది. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీలతో కూడిన భారత మహిళల జట్టు కూడా 15 మ్యాచ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో భారత్ 4-0తో దక్షిణ కొరియాను ఓడించింది.

క్రికెట్‌లో కనకం...



స్వర్ణాలతో వాషింగ్టన్ సుందర్, రుతురాజ్, తిలక్

తొలిసారి ఆసియా క్రీడల క్రికెట్ ఈవెంట్‌లో పోటీపడ్డ భారత క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. టి20 ఫార్మాట్‌లో జరిగిన ఈ పోటీల్లో శనివారం భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. అఫ్గానిస్తాన్ 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసిన దశలో వచ్చిన వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. మెరుగైన ర్యాంక్ కారణంగా భారత్‌ను విజేతగా ప్రకటించి స్వర్ణ పతకాన్ని అందించగా... అఫ్గానిస్తాన్ జట్టుకు రజతం లభించింది. స్వర్ణం నెగ్గిన భారత జట్టులో హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు.

అసలు సమరానికి సై!

నేడు భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్
- తొలి విజయంపై ఇరు జట్ల గురి
- మ్యాచ్ రోజున వర్ష సూచన!
- మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: వన్డే క్రికెట్‌లో మరోసారి జగజ్జేతగా నిలిచే లక్ష్యంతో భారత జట్టు తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది. అభిమానుల భారీ అంచనాలను మోస్తూ ఈ మెగా ఈవెంట్‌లో టీమిండియా నేడు మొదటి మ్యాచ్‌లో మరో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాను ఎదుర్కొంటుంది. టోర్నీ ప్రారంభమైన తర్వాత తొలి నాలుగు రోజుల్లో అంతంతమాత్రమంగా ఉన్న అభిమాన ప్రదర్శన ఈ మ్యాచ్‌తో ఆకాశాన్ని తాకనుంది. ఇటీవలే ఇరు జట్ల మధ్య జరిగిన వన్డే సిరీస్ తర్వాత ప్రత్యర్థి గురించి ఇరు జట్లకూ తగిన అవగాహన ఉండటంతో ఆసక్తికర పోరు ఖాయం. రెండు పెద్ద జట్ల మధ్య జరిగే ఈ సమరం సహజంగానే ఆసక్తి రేకెత్తిస్తోంది.

బరిలో ఇషాన్ కిషన్...

వరల్డ్ కప్ గెలిచిన కెప్టెన్‌గా ప్రపంచ క్రికెట్‌లో తనకు ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాలని కోరుకుంటున్న రోహిత్ శర్మకు ఇది కీలక మ్యాచ్. పటిష్ట జట్టును తొలి పోరులో ఓడిస్తే టోర్నీ తర్వాతి మ్యాచుల్లో ఆ ఆత్మవిశ్వాసం కొనసాగడం ఖాయం. అయితే రోహిత్‌కు జోడీగా ఓపెనింగ్ చేసే గిల్ 'డెంగీ' కారణంగా మ్యాచ్‌కు దూరం కావడం కాస్త నిరాశపర్చే అంశం. కానీ ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న ఇషాన్ కిషన్ ఓపెనింగ్ కోసం సిద్ధంగా ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, శ్రేయస్, కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఫామ్ విషయంలో ఎలాంటి ఆందోళన లేదు. వీరంతా కలిసి జట్టుకు భారీ స్కోరు అందించగల సమర్థులు. బౌలింగ్‌లో ముగ్గురు స్పిన్నర్లను తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని రోహిత్ ఇప్పటికే చెప్పాడు. కుల్దీప్‌తో పాటు సొంతగడ్డపై అశ్విన్ బరిలోకి దిగడం ఖాయం. మూడో స్పిన్నర్‌గా జడేజా తనవంతు పాత్ర పోషిస్తాడు. ఇద్దరు పేసర్లు బుమ్రా, సిరాజ్‌లు ఆరంభంలో ప్రభావం చూపిస్తే జట్టుకు తిరుగుండదు.

ఆత్మవిశ్వాసంతో ఆసీస్...

ప్రపంచకప్‌కు ముందు భారత్‌తో రెండు మ్యాచ్‌లు ఓడి వన్డే సిరీస్ కోల్పోయినా... చివరి మ్యాచ్‌లో గెలుపు జట్టుకు ఉత్సాహాన్ని అందించింది. ముఖ్యంగా స్పిన్ విభాగంలో మ్యాక్స్‌వెల్ ప్రదర్శన జట్టు బలం పెంచింది. రెగ్యులర్ స్పిన్నర్ ఆడమ్ జంపా కూడా రాణించాల్సి ఉంది. అటు అనుభవం, ఇటు రికార్డులపరంగా కూడా ఆసీస్ పేస్ దళం చాలా పటిష్టంగా ఉంది. స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్ ఏ పిచ్‌పైనైనా ప్రభావం చూపగలరు. స్టొయినిస్, గ్రీన్ రూపంలో జట్టులో మంచి ఆల్‌రౌండర్లు ఉన్నారు. స్టొయినిస్ ఇంకా గాయం నుంచి కోలుకోలేదు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ బృందం కూడా చాలా పటిష్టంగా ఉంది. భారత గడ్డపై అపార అనుభవం ఉన్న వార్నర్‌కు దూకుడైన మిచెల్ మార్ష్ జత కలిస్తే శుభారంభాలు ఖాయం. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను నడిపించేందుకు స్మిత్, లబుషేన్ ఉన్నారు. లోయర్ ఆర్డర్‌లో క్యారీ, మ్యాక్స్‌వెల్ దూకుడుగా ఆడగల సమర్థులు. భారత్‌లాగే ఆసీస్ కూడా వరల్డ్ కప్ ఫేవరెట్‌లలో ఒకటి. ఆ జట్టు స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిస్తే భారత్‌కు గెలుపు అంత సులువు కాదు.

> ప్రపంచకప్ గెలిచే వరకు మన పని పూర్తి కాదని గొప్పవాళ్లు తరచుగా చెబుతుంటారు. అది వాస్తవం కూడా. అందుకే మేమూ దానిని గెలవాలని కోరుకుంటున్నాం. అయితే దానికో పద్ధతి ఉంది. దానిని పాటించాలి. ఎలాగైనా గెలవాలని మొండిగా వెళితే తప్పులు జరగవచ్చు. వరల్డ్ కప్ గెలవాలనే కోరిక, ఆశ ఉండటంతో తప్పు లేదు. కానీ అన్నీ కలిసి రావాలి. 99 శాతం మన శ్రమ తర్వాత ఆ ఒక్క శాతం అదృష్టం దేవుడి చేతుల్లో ఉంటుంది. భారత క్రికెటర్లపై ఒత్తిడి ఎప్పుడైనా ఉండేదే. అది సహజం. అయితే దానిని అధిగమించగల అనుభవం జట్టులో చాలా మందికి వచ్చేసింది.
> -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

12 ప్రపంచకప్ టోర్నీల్లో భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటి వరకు 12 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. భారత్ 4 మ్యాచ్‌ల్లో... ఆస్ట్రేలియా 8 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. చెన్నైలో ఈ రెండు జట్లు మూడుసార్లు పోటీపడ్డాయి. భారత్ ఒక మ్యాచ్‌లో, ఆసీస్ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, హార్దిక్, జడేజా, అశ్విన్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, మార్ష్, స్మిత్, లబుషేన్, గ్రీన్, క్యారీ, మ్యాక్స్‌వెల్, స్టార్క్, హాజల్‌వుడ్, జంపా.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ పిచ్. అయితే మరీ భారీ స్కోర్లకు అవకాశం లేదు. మ్యాచ్‌కు వాడబోయే పిచ్ నల్లరేగడి మట్టిది కావడంతో కాస్త నెమ్మదిగా ఉంటుంది. స్పిన్‌కు అనుకూలిస్తుంది కూడా. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. మ్యాచ్ ఆసాంతం కాకపోయినా కొద్దిసేపు ఆటకు అంతరాయం కలిగించవచ్చు. శనివారం సాయంత్రం చెన్నైలో భారీ వర్షం కురిసింది.

సఫారీ... రికార్డుల సవారీ

- 428 పరుగులతో చెలరేగిన దక్షిణాఫ్రికా
- డసెన్, మార్క్‌రమ్, డి కాక్ సెంచరీలు
- 102 పరుగులతో శ్రీలంకపై విజయం



డి కాక్



డసెన్



మార్క్‌రమ్

న్యూఢిల్లీ: ప్రపంచకప్ తొలి మూడు మ్యాచ్‌లలో అంతంతమాత్రం ప్రదర్శనతో నిరాశ చెందిన అభిమానులకు నాలుగో మ్యాచ్ అసలైన వినోదాన్ని అందించింది. దక్షిణాఫ్రికా, శ్రీలంక మధ్య ఫిరోజ్‌షా కోట్లా స్టేడియంలో జరిగిన పోరు కొత్త రికార్డులకు వేదికగా నిలిచింది. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయిన దక్షిణాఫ్రికా అసాధారణ స్కోరు సాధిస్తే... ఓటమి ఎదురైనా పూర్తిగా చేతులెత్తేయకుండా లంక కూడా ఆఖరి వరకు పోరాడింది. చివరకు 102 పరుగుల తేడాతో విజయం దక్షిణాఫ్రికా సొంతమైంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 428 పరుగులు సాధించింది. వాన్ డర్ డసెన్ (110 బంతుల్లో 108; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎయిడెన్ మార్క్‌రమ్ (54 బంతుల్లో 106; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్వింటన్ డి కాక్ (84 బంతుల్లో 100; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకాలతో చెలరేగారు. అనంతరం శ్రీలంక 44.5 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. చరిత్ అసలంక (65 బంతుల్లో 79; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 76; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు), దసున్ షనక (62 బంతుల్లో 68; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

మ్యాచ్‌లో నమోదైన రికార్డులివీ...

428/5 వరల్డ్ కప్‌లో ఒక జట్టు సాధించిన అత్యధిక స్కోరు ఇదే. ఓవరాల్‌గా వన్డేల్లో 9వ అత్యధిక స్కోరు.

1 ప్రపంచకప్‌లో ఒక ఇన్నింగ్స్‌లో ముగ్గురు సెంచరీలు చేయడం ఇదే మొదటిసారి. ఓవరాల్‌గా వన్డేల్లో ఇది నాలుగో సారి. ఇందులో మూడు దక్షిణాఫ్రికావే.

49 బంతులు మార్క్‌రమ్ ప్రపంచకప్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి గతంలో కెవిన్ ఓబ్రైన్ (50 బంతులు) పేరిట ఉన్న రికార్డును సవరించాడు.

బంగ్లాదేశ్ సునాయాస విజయం

6 వికెట్ల తేడాతో ఓడిన అఫ్గానిస్తాన్

ధర్మశాల: ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ గెలుపు బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లోనే అఫ్గానిస్తాన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి 2 పాయింట్లు తమ ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆరు వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 37.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. రహ్మానుల్లా గుర్బాజ్ (62 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ మిరాజ్ (3/25), షకీబ్ అల్ హసన్ (3/30) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. అనంతరం బంగ్లాదేశ్ 34.4 ఓవర్లలో 4 వికెట్లకు 158 పరుగులు చేసింది. నజ్ముల్ హొస్సేన్ శాంటో (83 బంతుల్లో 59 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెహదీ హసన్ మిరాజ్ (73 బంతుల్లో 57; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 97 పరుగులు జోడించి విజయాన్ని అందించారు. 2015, 2019 వరల్డ్‌కప్‌లతో కలిపి అఫ్గానిస్తాన్‌కు ఈ మెగా టోర్నీలో ఇది వరుసగా 13వ పరాజయం.



మిరాజ్

విజేత రష్మిక



న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి రష్మిక శ్రీవల్లి చాంపియన్‌గా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్లో రష్మిక 6-4, 4-6, 7-6 (7/5)తో డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ వైదేహి చౌధరీ (గుజరాత్)పై విజయం సాధించింది. రష్మికకు విన్నర్స్ ట్రోఫీతోపాటు రూ. 3 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. డబుల్స్ విభాగంలో రష్మిక-వైదేహి జోడీ టైటిల్ సాధించింది. ఫైనల్లో రష్మిక-వైదేహి ద్వయం 6-2, 6-2తో షర్మదా బాలు (కర్ణాటక)-వైష్ణవి (మహారాష్ట్ర) జంటపై గెలిచింది.

ఆయుష్‌కు పతకం ఖాయం

వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు ఆయుష్ షెట్టికి పతకం ఖాయమైంది. బాలుర సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ ప్లేయర్ అయిన ఆయుష్ అమెరికాలోని స్పోకెన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అతను 21-16, 21-17 స్కోరుతో జపాన్‌కు చెందిన యుదై ఒకిమొటోపై విజయం సాధించాడు. దాంతో అతను కనీసం కాంస్య పతకాన్ని గెలుచుకునే అవకాశం కలిగింది. సెమీస్‌లో ఇండోనేసియాకు చెందిన అల్వి ఫర్హాన్‌తో ఆయుష్ తలపడతాడు. బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత షట్లర్ తారా షా 17-21, 6-21 తేడాతో గ్జు వెన్ జింగ్ (చైనా) చేతిలో ఓడింది. గతంలో ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు 1 స్వర్ణం, 4 రజతాలు, 5 కాంస్యాలు సాధించారు. 2022లో భారత్‌కు చెందిన శంకర్ ముత్తుస్వామికి రజతం దక్కింది.



క్లుప్తంగా...

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

పల్నాడు, ప్రకాశం జిల్లాలకు తాగు నీటి కోసం 5టీఎంసీలు కేటాయింపు



సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఓఅండ్‌ఎం ఈఈ శ్రీహరి

విజయపురిసౌత్: పల్నాడు, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు శనివారం మధ్యాహ్నం ఓఅండ్‌ఎం ఈఈ శ్రీహరి 4వ గేటు ద్వారా వెయ్యి క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంటకు వెయ్యి క్యూసెక్కులు చొప్పున పెంచుతూ రోజుకు 5,500 క్యూసెక్కులు విడుదల చేస్తామని తెలిపారు. పది రోజులపాటు ఇదే మోతాదులో 5 టీఎంసీలు విడుదల చేస్తామని వివరించారు. తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్న ఈ నీటిని రైతులు సాగు కోసం వినియోగించకుండా మంచినీటి చెరువులు నింపేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుడికాలువ ఓ అండ్ ఎం డివిజన్ డీఈలు మురళీధర్, శ్రీనివాస్, ఏఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తెలంగాణ

జూపార్కులో ఏనుగు దాడి..

యానిమల్ కీపర్ మృతి

బహదూర్‌పురా(హైదరాబాద్): హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో ఏనుగు దాడి చేయడంతో యానిమల్ కీపర్ మృతి చెందాడు. జూపార్కులో యానిమల్ కీపర్‌గా పనిచేసే షాబాజ్ (23)పై శనివారం మధ్యాహ్నం విజయ్ అనే మగ ఏనుగు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి సిబ్బంది జూ అధికారులకు సమాచారం అందించి వెంటనే చికిత్స నిమిత్తం డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రికి తరలించారు. షాబాజ్ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. జూపార్కులో యానిమల్ కీపర్‌గా పనిచేస్తున్న ఎజాజ్ అనారోగ్యం కారణంగా తన కుమారుడు షాబాజ్‌ను పనిలో పెట్టాడు. శనివారం మధ్యాహ్నం అసహనంగా ఉన్న ఏనుగు వద్దకు వెళ్లిన షాబాజ్‌పై ఒక్కసారిగా దాడి చేసింది. షాబాజ్ మృతికి అనుభవరాహిత్యం కారణమని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నెల 10న విచారణకు రండి

హీరో నవదీప్‌కు ఈడీ అధికారుల నోటీసులు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ వ్యవహారంలో టాలీవుడ్ నటుడు నవదీప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరోమారు సమన్లు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ విచారణకు హాజరైన నవదీప్‌ను మరోసారి ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతుండటం తెలుగు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. డ్రగ్స్ కేసులో విచారణకు ఈ నెల 10న తమ ఎదుట హాజరు కావాలని ఈడీ అధికారులు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు. గతంలో నమోదైన టాలీవుడ్ డ్రగ్స్ కేసుతోపాటు ఇటీవల మాదాపూర్ డ్రగ్ కేసులో విచారించేందుకే నవదీప్‌కు సమన్లు జారీ చేసినట్టు ఈడీ వర్గాలు తెలిపాయి. కాగా, మాదాపూర్ డ్రగ్స్ కేసులో గత నెల 23న తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నవదీప్‌ను ఆరు గంటలపాటు ప్రశ్నించింది. ఆయన మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న నార్కోటిక్ బ్యూరో పోలీసులు అందులోని కాల్ లిస్ట్‌లో పేర్లు, ఆ వ్యక్తులతో పరిచయాలపైనా ఆరా తీశారు. అదేవిధంగా సెప్టెంబర్ 14న నార్కోటిక్ బ్యూరో అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులతో కలిసి బెంగళూరులో చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు నైజీరియన్స్‌తోపాటు ఓ దర్శకుడిని అరెస్టు చేశారు. ఆ ముఠాతోనూ నవదీప్ సంప్రదింపులు జరిపినట్టు కీలక ఆధారాలు లభించడంతో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు ఆ అంశాలపైనా నవదీప్‌ను ప్రశ్నించారు. టాలీవుడ్ డ్రగ్స్ కుంభకోణంలో 2017లో తెలంగాణ ఎక్సైజ్ శాఖ చార్జిషీట్లు నమోదు చేసిన 12 కేసులలో మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా టాలీవుడ్ నటులు నవదీప్, రకుల్‌ప్రీత్‌సింగ్, దగ్గుబాటి రాణా, రవితేజ, చార్మీకౌర్, ముమైత్‌ఖాన్, తనీష్, నందు, తరుణ్‌లను ఈడీ అధికారులు గతంలోనూ ఒకసారి ప్రశ్నించారు.

బీజేపీలో చేరిన చీకోటి ప్రవీణ్

కాచిగూడ(హైదరాబాద్): ధర్మరక్ష సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, క్యాసినో కింగ్ చీకోటి ప్రవీణ్ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో శనివారం ఆ పార్టీలో చేరారు. హైదరాబాద్ బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రవీణ్‌తోపాటు ఆయన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని, ధర్మరక్షణ కోసం బీజేపీలో చేరినట్లు తెలిపారు. అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీ కోసం పనిచేస్తానని, పార్టీ ఆదేశిస్తే ఎక్కడి నుంచి అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

‘డిజి లాకర్’లో ఇంటర్ సర్టిఫికెట్లు

2014 నుంచి 2023 వరకు ఇంటర్ ధ్రువపత్రాలు

- పాస్ మెమో, మైగ్రేషన్, అర్హత సర్టిఫికెట్లు కూడా..
- ఇప్పటికే 1.14 కోట్ల మంది టెన్త్ సర్టిఫికెట్లు అప్‌లోడ్
- తాజాగా ఇంటర్ పాసైన 45.53 లక్షల మంది సర్టిఫికెట్లు అందుబాటులోకి
- రెండు నెలల్లోనే లక్షలాది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసిన ఇంటర్ బోర్డు
- ఎప్పుడు, ఎక్కడ కావాలన్నా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు
- 2014 ముందు ఇంటర్ సర్టిఫికెట్లు కూడా త్వరలో అందుబాటులోకి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్ పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సులభంగా పొందే వెసులుబాటును ఇంటర్మీడియట్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల పాస్ సర్టిఫికెట్, మైగ్రేషన్, ఈక్వలెన్సీ, జెన్యూన్‌నెస్ సర్టిఫికెట్లు ఎప్పుడు, ఎక్కడ కావాలన్నా తీసుకునేలా ‘డిజి లాకర్’ (https://digilocker.gov.in)లో ఉంచింది. అందుకోసం రాష్ట్ర విద్యా సంబంధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమైన జ్ఞానభూమిని డిజిలాకర్‌కు అనుసంధానించింది. ఇప్పటికే 1.14 కోట్ల మంది టెన్త్ సర్టిఫికెట్లను ప్రభుత్వం డిజి లాకర్‌లో ఉంచింది. ఇప్పుడు 2014 నుంచి 2023 వరకు ఇంటర్మీడియట్ పూర్తిచేసిన 45.53 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచింది. ఉమ్మడి రాష్ట్రంలో పాసైన (2014కు ముందు) ఏపీ విద్యార్థుల సర్టిఫికెట్లను సైతం మరికొద్ది రోజుల్లో డిజి లాకర్‌లో ఉంచనుంది. కేవలం రెండు నెలల్లోనే లక్షలమంది సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేసి, డిజి లాకర్‌లో ఉంచడం దేశ చరిత్రలో తొలిసారి కావడం విశేషం. అంతే కాకుండా సర్టిఫికెట్లలో తప్పు పడిన పేరు సరిదిద్దేందుకు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలను సవరించడం వంటి ఇతర సేవలను కూడా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా విద్యార్థులు పొందవచ్చు. ఐఐటీ, నీట్‌తో పాటు అనేక జాతీయ స్థాయి ఎంట్రన్స్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటికే చాలా మంది విద్యార్థులు డిజి లాకర్‌లో ధ్రువపత్రాలు పొందుతున్నారు. ఇకపై ఇంటర్మీడియట్ (+2) పూర్తి చేసిన వారి సర్టిఫికెట్లను బోర్డుకు చెందిన జ్ఞానభూమి ద్వారా డిజి లాకర్‌లో పొందవచ్చు. డిజిటల్ సర్టిఫికెట్లను దేశ, విదేశాల్లోని యూనివర్సిటీలు, జేఈఈ, నీట్ కాలేజీలు కూడా అంగీకరించడంతో ఇకపై విద్యార్థులకు డూప్లికేట్ సర్టిఫికెట్ల అవసరం ఉండదు.



ఎప్పుడైనా సర్టిఫికెట్లు పొందే అవకాశం

ఇప్పటిదాకా ఏ కారణం చేతనైనా సర్టిఫికెట్లు పోగొట్టుకుని నకళ్లు (డూప్లికేట్) పొందడం పెద్ద ప్రహసనం. ముందుగా సర్టిఫికెట్ పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేసి, అది దొరకలేదని ఎన్‌వోసీ ఇస్తారు. ఇందుకు కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ తర్వాత నోటరీ చేసిన అఫిడవిట్‌తో సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకుంటే మరో నెల, రెండు నెలల తర్వాత డూప్లికేట్ సర్టిఫికెట్ వస్తుంది.

సర్టిఫికెట్ ఇలా పొందవచ్చు


మొబైల్ ఫోన్‌లోని డిజి లాకర్ యాప్ ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా మార్క్స్ మెమో, మైగ్రేషన్ సర్టిఫికెట్, ఈక్వెలెన్స్ సర్టిఫికెట్, అర్హత సర్టిఫికెట్ పొందవచ్చు. అభ్యర్థులు వారి మొబైల్ ఫోన్‌లో డిజి లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ఫోన్ నంబర్ లేదా ఆధార్ నంబర్‌తో https://digilocker.gov.in లో లాగిన్ చేయాలి. వారి రిజిస్టర్డ్ ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీని నిర్దిష్ట బాక్స్‌లో నింపి సబ్‌మిట్ చేస్తే లాకర్ ఓపెన్ అవుతుంది. ఇక్కడ వివిధ రాష్ట్రాల ఐకాన్స్ ఉంటాయి, వాటిలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ చేస్తే అందులో ‘క్లాస్ గీఐఐ’ ఓపెన్ చేస్తే ‘బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్’ బ్యానర్ కనిపిస్తుంది. ఇందులోకి ఎంటర్ అయ్యి ఎవరికి ఏ సర్టిఫికెట్ కావాలంటే దానిపై ‘క్లిక్’ చేయాలి. రోల్ నంబర్/ రిజిస్ట్రేషన్ నంబర్, పూర్తయిన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేసి వారి సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇంత సుదీర్ఘ ప్రక్రియకు స్వస్తి పలుకుతూ డిజి లాకర్‌తో జ్ఞానభూమిని అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులు వెంటనే సర్టిఫికెట్ పొందవచ్చు.

టెన్త్ సర్టిఫికెట్ తీసుకోవచ్చు ఇలా..

2004 నుంచి 2023 వరకు పదో తరగతి పాసైన విద్యార్థుల సర్టిఫికెట్లను సైతం పాఠశాల విద్యాశాఖ డిజి లాకర్‌లో ఉంచింది. ఇందులో 2008, 2009, 2010, 2011 విద్యా సంవత్సరాల సర్టిఫికెట్లను మరో పది రోజుల్లో డిజి లాకర్‌లో ఉంచనుంది. విద్యార్థులు తమ పాస్ మెమోల కోసం డిజి లాకర్ యాప్‌లో మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ‘క్లాస్ గీ మార్క్‌షీట్’ ఓపెన్ చేస్తే, వివిధ రాష్ట్రాల ఎస్సెస్సీ బోర్డుల ఐకాన్స్ కనిపిస్తాయి. వీటిలో ‘స్కూల్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్’పై క్లిక్ చేసి, రిజిస్టర్ మొబైల్ నంబర్‌తో సైన్ ఇన్ అయ్యి సర్టిఫికెట్‌ను పొందవచ్చు.

టుడేస్ గ్రాఫిక్



వెయ్యి అడుగుల మువ్వన్నెల రెపరెపలు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ‘విద్యా సంకల్ప్’ కార్యక్రమంలో భాగంగా వెయ్యి అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఘనంగా సత్కరించారు. -యర్రగొండపాలెం

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సీఎం జగన్ నిర్ణయాన్ని బలపరుద్దాం

పరిపాలన వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లజపతిరాయ్

సీతమ్మధార(విశాఖపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభించనున్న సందర్భంగా శుభాకాంక్షలు చెబుతున్నట్లు పరిపాలన వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలూ అభివృద్ధి చెందాలని, ముఖ్యమంత్రికి అన్ని మతాల దేవుళ్ల ఆశీర్వాదాలు అందించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విశాఖ వందనం పేరిట ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. సంపత్ వినాయగర్ ఆలయం వద్ద శనివారం ప్రచార రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం కనకమహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు. లజపతిరాయ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ జెండా, అజెండాలను పక్కన పెట్టి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం తీసుకున్న నిర్ణయాన్ని బలపర్చాలని విన్నవించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, హ్యూమన్ రైట్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఏయూ ప్రొఫెసర్ షారోన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జేఏసీ నాయకులు

బాల్య వివాహాల నిరోధానికి విస్తృత ప్రచారం


- ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి : బాల్య వివాహాల నిరోధానికి జిల్లా స్థాయిలో నెల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల్సిందిగా ఆయన స్పష్టం చేశారు. వివిధ పథకాలు, కార్యక్రమాల పురోగతిపై సీఎస్ జవహర్‌రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బాల్య వివాహాల నివారణ ద్వారానే మాతా, శిశు మరణాలు తగ్గించగలమన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు నిర్ధారణ నివేదికను పంపాల్సిందిగా ఆదేశించారు. యుక్త వయస్సుల్లో ఉన్న బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే చెడు ప్రభావాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. బేటీ బచావో బేటీ పఢావో పథకం కింద ఆగస్టు నెలలోనే జిల్లాల వారీగా నిధులు విడుదలయ్యాయని, ఆ నిధులతో బాలికల విద్యతో పాటు బాల్య వివాహాల నిరోధానికి అవసరమైన కార్యకలాపాలను నెలవారీ క్యాలెండర్‌గా నిర్వహించాలన్నారు. ఈ పథకం కింద ఆడ పిల్లలకు విద్యనందించడం, లింగ వివక్షను నివారించడం, ఆడ పిల్లల రక్షణ, సంరక్షణ, బాల్య వివాహాల నివారణకు కార్యకలాపాలను జిల్లాల వారీగా, నెల వారీగా నిర్వహించాలని చెప్పారు. కార్యాచరణ ప్రణాళిక అమలుకు జిల్లాలకు రూ.5.56 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. మరింత దృష్టి సారించడం ద్వారా ఇంకా అక్కడక్కడా జరుగుతున్న బాల్య వివాహాలను పూర్తిగా నివారించగలమన్నారు. కాగా, సెప్టెంబర్ నెలలో బాల్య వివాహాలపై 1098 హెల్ప్‌లైన్‌తో పాటు వివిధ మార్గాల ద్వారా 206 ఫిర్యాదులు రాగా.. 193 బాల్య వివాహాలను నిరోధించారు. 13 బాల్య వివాహాలు జరగ్గా.. వాటిలో 11 వివాహాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అత్యధికంగా అనంతపురం, శ్రీ సత్యసాయి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బాల్య వివాహాలపై సెప్టెంబర్‌లో ఫిర్యాదులొచ్చాయి.

అసమానతలు లేని అభివృద్ధితోనే పేదలకు న్యాయం

సీపీఎం నేత బీవీ రాఘవులు



సాక్షి, అమరావతి: అసమానతలు లేని అభివృద్ధితోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీవీకేలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సెమినార్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు. గతంలో చంద్రబాబుగానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌గానీ ప్రజలకు ఎంతో చేశామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే సంక్షేమం జాడ కనిపించడం లేదని విమర్శించారు. విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు రచించిన ‘దేశ స్వావలంబనకు కీలకం రైతు వ్యవసాయం’ అనే పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం నేతలు ఎంఏ గఫూర్, కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి మాట్లాడారు.

‘కృష్ణా’పై కొత్తగా విధి విధానాలు చట్ట విరుద్ధం

బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికం

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టీకరణ
- విభజన చట్టంలో సెక్షన్–89 ద్వారా ఇప్పటికే విధి విధానాలు
- ఇప్పుడు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మళ్లీ విధి విధానాల జారీ అన్యాయం
- రాష్ట్రానికి హక్కుగా దక్కిన ప్రతి నీటి బొట్టునూ రక్షించుకుంటాం
- కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో సీఎం జగన్ పోరాటం

సాక్షి, అమరావతి : కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు పంపిణీ చేయడం కోసం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కొత్తగా విధి విధానాలు (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్సెస్) జారీ చేస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమంటూ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆక్షేపించారు. విభజన చట్టంలో సెక్షన్–89 ప్రకారం రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడానికి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు విధి విధానాలను ఇప్పటికే నిర్దేశించారని గుర్తు చేస్తూ.. మళ్లీ కొత్తగా విధి విధానాలు జారీ చేయడాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని తెగేసి చెప్పారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్యాయంగా, అక్రమంగా కొత్తగా జారీ చేసిన విధి విధానాల వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందన్నారు. వాటిపై సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ) దాఖలు చేసి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని తెగేసి చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికమని.. దాని ద్వారా న్యాయబద్ధంగా హక్కుగా రాష్ట్రానికి దక్కిన ప్రతి నీటి బొట్టునూ రక్షించుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

ఇప్పటికే ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపులు

- బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1976లో 811 టీఎంసీలు కేటాయించింది. ఆ జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయించింది. ఈ కేటాయింపుల ఆధారంగా 2015 జూలై 18–19న ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ చేస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ చేసిన తాత్కాలిక సర్దుబాటుపై రెండు రాష్ట్రాల సీఎస్‌లు సంతకాలు చేశారు.



- కృష్ణా నది జలాలను పంపిణీ చేయడానికి 2004లో ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2010లో తొలి నివేదిక, 2013లో తుది నివేదిక కేంద్రానికి ఇచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కొనసాగించింది. ఆ రెండు నివేదికలపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు బేసిన్ పరిధిలోని రాష్ట్రాలు సుప్రీంకోర్టులో ఎస్సెల్పీలు దాఖలు చేయడంతో వాటిపై స్టే ఇచ్చింది. దాంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తుది నివేదికను కేంద్రం నోటిఫై చేయలేదు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేసే బాధ్యతను సెక్షన్–89 ప్రకారం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే కేంద్రం కట్టబెడుతూ దాని గడువును పొడిగించింది.
- విభజన చట్టంలో సెక్షన్–89లో ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని, నీటి లభ్యత తక్కువగా ఉన్న సంవత్సరాలలో ప్రాజెక్టులకు నీటిని విడుదల చేసే నియమావళిని రూపొందించాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం విధి విధానాలు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలని కూడా విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొంది. ఆ మేరకే నీటి పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2016 నుంచి విచారణ జరుపుతోంది.

రాష్ట్ర హక్కుల పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ కృషి

- అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశంలో కృష్ణా జలాలను సెక్షన్–3 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాలని తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తే సీఎం వైఎస్ జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయబద్ధంగా రాష్ట్రానికి దక్కాల్సిన చుక్క నీటిని వదులుకోబోమని, అన్యాయంగా చుక్క నీటిని వాడుకోబోమని తేల్చి చెప్పారు.
- సెక్షన్–3 ప్రకారం నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ సీఎం కేసీఆర్ కేంద్ర జల్ శక్తి శాఖకు 2021లో లేఖ రాయగానే.. దానిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి చట్టబద్ధంగా ట్రిబ్యునల్ కేటాయించిన జలాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా న్యాయబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు 2021 ఆగస్టు 17న.. ఆ తర్వాత 2022 జూన్ 25న సీఎం వైఎస్ జగన్ మరోసారి లేఖ రాశారు.
- రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీకి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కొత్త విధి విధానాల జారీకి కేంద్ర మంత్రివర్గం ఈ నెల 4న ఆమోదం తెలపడం అశాస్త్రీయమని, దీని వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని.. అందువల్ల తదుపరి చర్యలను నిలిపేసి రాష్ట్ర హక్కులను పరిరక్షించాలని ఈ నెల 6న ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అదే రోజున ఢిల్లీలో హోం శాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమై ఇదే అంశాన్ని వివరించారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన విధి విధానాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నిర్దేశిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు.
- కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం నాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నడుంబిగిస్తే.. నేడు సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పోరాడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేని ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ సీఎం వైఎస్ జగన్‌పై విషం చిమ్ముతూ తప్పుడురాతలు అచ్చేస్తున్నారు. వారి విషపురాతలను ప్రజలు నమ్మరు. టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న విమర్శలను జనం పట్టించుకోరు.

పవన్ కళ్యాణ్, లోకేశ్ పొలిటికల్ బఫూన్లు

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, చంద్రబాబు కుమారుడు లోకేశ్‌లు ఎప్పుడు ఏం మాట్లాడతారో ఆయా పార్టీల వారికే తెలియక జుట్టు పీక్కుంటున్నారు. పెడనలో ఎన్డీయే నుంచి బయటకొచ్చానని ప్రకటించిన పవన్.. ముదినేపల్లికి వచ్చే సరికి మాట మార్చారు. జైలులో చంద్రబాబును ములాఖత్‌లో కలిసి బయటకొచ్చాక.. చంద్రబాబు అవినీతిని ఇంటింటా ప్రచారం చేస్తానని లోకేశ్ ప్రకటించారు. అందుకే వారిద్దరినీ పొలిటికల్ బఫూన్లుగా ప్రజలు చూస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అనేక కుంభకోణాల ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్నారని నిరూపితమైంది కాబట్టే చంద్రబాబు జైల్లో ఉన్నాడు. అలా జైల్లో ఉన్న చంద్రబాబును కలిశాక టీడీపీతో పొత్తును పవన్ ప్రకటించారంటే.. ఆయన అవినీతిలో ఈయనకు వాటా ఉన్నట్లు స్పష్టమవుతోంది. బలహీనపడ్డ టీడీపీ తన మద్దతుతో బలం పుంజుకుంటుందని పొత్తు పెట్టుకున్న జనసేన.. క్షేత్ర స్థాయిలోకి వచ్చే సరికి చతికిలపడింది. అవనిగడ్డ, పెడన, ముదినేపల్లిలలో పవన్ సభలు అట్టర్ ఫ్లాప్ కావడమే అందుకు నిదర్శనం. టీడీపీతో పొత్తు ప్రజలెవరికీ ఇష్టం లేకపోవడంతో జనసేన బలహీన పడిందన్న వాస్తవాన్ని పవన్ తెలుసుకోవాలి.

శ్రీశైలాన్ని తెలంగాణ తోడేస్తోంది

తాగునీటి అవసరాలకు వాడుకోవడానికే త్రిసభ్య కమిటీ భేటీలో రెండు రాష్ట్రాల అంగీకారం

- కానీ.. భేటీ జరిగిన రోజే ఎడమ గట్టు కేంద్రంలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి
- దాంతో శ్రీశైలంలో తగ్గిపోతున్న నీటి మట్టం
- ఇలాగైతే రాయలసీమ, చెన్నైకి తాగునీటిని అందించడానికి ఇబ్బందులు
- అనేకసార్లు తెలంగాణ వైఖరిని మీ దృష్టికి తీసుకొచ్చాం.. ఇప్పటికైనా నియంత్రించండి
- ఆ నీటిని ఆ రాష్ట్ర కోటాలోనే కలపండి.. జరిమానా విధించండి
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి లేఖ

సాక్షి, అమరావతి : దిగువన తాగు, సాగునీటి అవసరాలు లేకున్నా.. బోర్డు అనుమతి తీసుకోకుండా.. శ్రీశైలం ప్రాజెక్టులో ఎడమ గట్టు కేంద్రంలో అక్రమంగా విద్యుదుత్పత్తి చేస్తూ తెలంగాణ జెన్‌కో కృష్ణా జలాలను తోడేస్తోందని కృష్ణాబోర్డు దృష్టికి మరోసారి ఏపీ ప్రభుత్వం తీసుకెళ్లింది. హైదరాబాద్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం త్రిసభ్య కమిటీ సమావేశంలో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకే వాటిని వాడుకోవడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించిన విషయాన్ని గుర్తుచేసింది. కానీ, ఆ సమావేశం జరుగుతుండగానే శుక్రవారం సా.4 గంటల నుంచి శనివారం ఉ.8 గంటల వరకూ విద్యుదుత్పత్తి చేస్తూ 13,210 క్యూసెక్కులను దిగువకు తరలించిందని.. మళ్లీ శనివారం 4 గంటలకు విద్యుదుత్పత్తిని ప్రారంభించిందని ఫిర్యాదు చేసింది. దీనివల్ల శ్రీశైలంలో నీటిమట్టం తగ్గిపోతోందని వివరించింది. శ్రీశైలంలో 854 అడుగులకు ఎగువన నీటి మట్టం ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా తరలించి దుర్భిక్ష రాయలసీమ, చెన్నైకి తాగునీటిని సరఫరా చేయవచ్చునని పేర్కొంది.

తీరు మారని తెలంగాణ

ఇక తెలంగాణ జెన్‌కో ఇదే తరహాలో నీటిని తోడేస్తే రాయలసీమ, చెన్నైకి తాగునీటిని సరఫరా చేయలేమని ఏపీ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి శనివారం లేఖ రాశారు. శ్రీశైలం విద్యుదుత్పత్తిలో తెలంగాణ జెన్‌కో దుందుడుకు వైఖరిపై అనేకసార్లు బోర్డు దృష్టికి తీసుకొచ్చామని గుర్తుచేశారు. కానీ, తెలంగాణ జెన్‌కో తీరు మారడంలేదని ఆక్షేపించారు. అక్రమంగా తోడేసిన నీటిని ఆ రాష్ట్ర కోటాలోనే కలపాలని.. విభజన చట్టం 11వ షెడ్యూలులోని 9వ పేరా ప్రకారం ఆ రాష్ట్రంపై జరిమానా విధించాలని నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఇకనైనా తెలంగాణ జెన్‌కో అక్కడ విద్యుదుత్పత్తి చేయకుండా నియంత్రించడం ద్వారా రాయలసీమ, చెన్నైకి తాగునీటిని సరఫరా చేయడానికి సహకరించాలని కృష్ణా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943